అభ్యుదయ

సెప్టెంబర్ 1979 ఒక రూపాయి

చైనా సాహిత్యవేత్త లూసన్



సంపుటి 3   1979 అభ్యుదయ   సెప్టెంబరు
సంచిక 9   చందా రు. 10.

విషయసూచిక

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

విద్యను గురించి

ఆందోళన ఏల ?

-గుర్తుంచుకొండి

చైనా ఆధునిక సాహిత్యయుగకర లూసన్

25-9-1881 **19-10-1936**

లూసన్ కలం పేరుతో ప్రపంచ సాహిత్యంలో అగ్రస్థానం సముపార్జించుకున్న "చౌ షు జెన్" జన్మించి ఈ సెప్టెంబరు 25 నాటికి 98 ఏళ్ళు నిండాయి. వారిది చికియాంగ్ రాష్ట్రంలో షావొసింన్‌కు చెందిన పండిత కుటుంబం. తాతగారు పెద్ద పదవిలో ఉండి అతరువాత జైలుపాలయాడు. తండ్రి నిరుద్యోగం అనారోగ్యంతో మంచానబడి కన్నుమూశాడు. తల్లి తెలివైంది. కష్టాల నెదుర్కొని శాడుకుని పెంచింది. ఆమె మొదటి పేరు "లూ" అదే ఆయన కలం పేరైంది.

లూసన్ బాల్యంనుండి ప్రతిభాశాలి. అద్భుతమైన ధారణాశక్తి ఉంది. ప్రాచీన సాహిత్యాన్ని పుక్కిట పట్టాడు వాటికి చెప్పే మూఢ ఛాందస భాష్యాలను సవాలుచేసేవాడు. జానపద కళలు, చిత్రశిల్పకళల్లోనూ ప్రవేశం వుంది.

తన బాల్యంలో పెద్ద రైతుబిడ్డలతో స్నేహానురాగాలు తనకు మరువలేని అనుభవం అని స్వయంగా రాసుకున్నాడు.

ఆ కాలంలో అంచగొండి చింగ్ చక్రవర్తుల పాలన గబ్బుకొడుతుంటే విదేశీ దురాక్రమణల పరంపర దేశాన్నిమింగి ముక్కలుగా చీల్చేస్తుంటే దేశభక్తులు తిరుగుబాట్లుచేసి ప్రజాస్వామ్య విప్లవోద్యమాలకు బీజాలు నాటుతున్నారు.

షావొసింగ్ మిగతా ప్రపంచంతో సంబంధంలేని ప్రదేశమైనా దేశం ఎదుర్కొంటున్న సంక్షోభ ప్రభావంనుండి ఎలా తప్పించుకోగలదు? లూసన్ ఒక పక్క వడ్డీషాపులు, మందులకొట్టులచుట్టూ తిరుగుతూ జీవితంతో మర్చిపోలేని అనుభవాలు పొందుతున్నాడు.

18 వ ఏట ఆయనను తల్లి నాన్‌కింగ్ పంపింది. జీతం చెల్లించ నక్కరలేని సేవక అకాడెమీ ఆ తరువాత రైలు, గనుల శిక్షణాసంస్థలలో నాలుగేళ్ళు చదువుకున్నాడు. ఇక్కడ విదేశీ సాహిత్యంతో పరిచయం అయింది. 1900 లో సామ్రాజ్య దేశాలు చైనాను అత్యంత అవమానాలపాల్జేశాయి. సామ్రాజ్య వ్యతిరేక బాక్సర్ తిరుగుబాటుతో చైనా కుతకుతలాడిపోయింది. సామ్రాజ్యవాదానికి, చేతగాని చింగ్ పాలనకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఆవశ్యకతని గ్రహించగలిగాడు లూసన్.

1901 లో గ్రాడ్యుయేట్ అయి జీవికకు స్కాలర్‌షిప్‌మీద ఉన్నతాభ్యాసం కోసం వెళ్ళాక ఆయన దేశభక్తి మరింత దృఢతరమైంది. ఇప్పటి నక్సలైట్లు

—మల్లిక్ కేశవగోపాల్

విరసంవారు ఏమంటారోగాని లూసన్ మాత్రం జపాన్‌లో యూరప్ దేశాల సాహిత్యం ఫిలాసఫి బాగా అధ్యయనం చేశాడు. ప్రాచీన గ్రంధాలూ క్లాసికలు చదివాడు. బైరన్, షెల్లీ, పుష్కిన్, షెర్మంటోవ్, మికిలిస్ట్, పెటాఫి రచనలు జపాన్ జర్మని భాషల్లో చదివారు. తాను సైతం చైనా విప్లవానికి బాగా సహాయ పడాలనే ఉద్దేశంతో లూసన్ సెండాయ్ మెడికల్ కాలేజీలో చేరి రెండేళ్ళు వైద్య విద్య అభ్యసించాడు. ఆ తరువాత ప్రజలను చైతన్యవంతులను చేయాలంటే సాహిత్యం ద్వారానే సాధ్యమని భావించి లిటరేచర్ (సాహిత్యం) విద్యాభ్యాసం ఆరంభించాడు

1908 లో రష్యన్, ఉత్తర యూరప్ రచయితల అనువాదాలతో సాహిత్య జీవితం ఆరంభించాడు. అదేకాలంలో మంచూ ప్రభువులకు వ్యతిరేకంగా ఏర్పడిన "కునాంగ్‌ప్స హుయ్" అనే రాజకీయ పార్టీలో చేరాడు.

జపాన్‌లో గడిపిన 8 సంవత్సరాలు లూసన్‌ని విప్లవ ప్రజాస్వామ్యవాదిగా తీర్చిదిద్దాయి. చైనా తిరిగివచ్చి రెండేళ్ళు ఉపాధ్యాయుడిగా చేశారు. చక్రవర్తి పాలనను అంతమొందించిన 1911 విప్లవంతో ఆయనకు సంబంధం ఉంది. 1912 లో చైనా రిపబ్లిక్ ఏర్పడగానే విద్యామంత్రిత్వశాఖ సభ్యుడిగా పదవిని స్వీకరించారు. చక్రవర్తి పాలన పోయినప్పటికి సామ్రాజ్యవాదం ఫ్యూడలిజంల దోపిడిలో మార్పు ఏమిలేదని చైనా ప్రగతిశీల మేధావి వర్గం గ్రహించింది. వార్‌లార్డ్‌లు అంటే సైన్యాలున్న జమీందారీ ప్రభువులు ఎక్కడికక్కడ దేశాన్ని ముక్కలు చేయడం ఆరంభించారు. అంతులేని రక్తపాతం అంతర్యుద్ధం, సామ్రాజ్యవాదుల కుట్రలు సాగుతూనే ఉన్నాయి. అటు సాహిత్య కళారంగాలలో "గతంలోకి పోదాం" అనే ప్రగతి నిరోధక ఉద్యమాలు బయల్దేరాయి.

లూసన్ పెకింగ్‌లో ఉన్న ఈ కాలంలో చైనా ప్రాచీన కళలో సాహిత్యం సంస్కృతి లోతుగా అధ్యయనం చేశారు. క్రీ. శ. 3 వ శతాబ్దంనాటి కవి "చికాంగ్" రచనలు వెలువర్చారు. ఈ కవి కన్‌ఫూషియన్ సిద్ధాంతాలను వ్యతిరేకించిన వాడు' లూసన్ భారత బౌద్ధ ప్రాచీన గ్రంధాలను కూడా అధ్యయనం చేసి చైనాభాషలోకి తర్జుమాచేశారు.

ఇంతలో మొదటి ప్రపంచయుద్ధం రావడంతో సామ్రాజ్యవాద దేశాలు చైనామీద మోహంపు తగ్గించాయి, 1917 చారిత్రాత్మక సోషలిస్టు విప్లవం ఘన విజయమై చైనావంటి దేశాలలో విముక్తి పోరాటాలకు కొత్త ఊపు ఉత్సాహం ఇచ్చింది. 1919 లో మే ఫోర్త్ ఉద్యమంగా రూపొందింది.

1918 ఏప్రిల్‌లోనే లూసన్ కలం పేరుతో తొలి స్వంతరచన" పిచ్చి వాడి డైరీ" కధానికను న్యూయూత్ అనే విప్లవ పత్రికను ప్రచురించాడు. కాల్టు

ఆర్మ్స్ (చేతులకుపిలుపు) మైటల్డ్‌హోం (నాపాతయిల్లు) ది ట్రూస్టోరీఆహ్‌క్యూ (అహ్‌క్యూ నిజంకథ)వంటి గొప్ప కథా సంపుటాలు వెలువర్చాడు. చైనా ఆధునిక సారస్వత పితగా స్థానంపొందారు.

జీవితం పొడుగునా అనేక విద్యాలయాల్లో ఉపాధ్యాయుడుగాఉంటూ యువకులలో విద్యార్థులలో వారి తిరుగుబాట్లు విప్లవ పోరాటాలతో సన్నిహిత సంబంధం ఉంది లూసన్‌కు.

1926లో అమోయ్ యూనివర్సిటి సారస్వతశాఖలో ప్రొఫెసర్‌గా నియుక్తులయారు.ఆ మరుసటి ఏడే కాంటన్ లోసన్‌యట్ సేన్ యూనివర్సిటి చైనా భాష సాహిత్యశాఖకి అధిపతి అయాడులూసన్, ఇంతలో చాంగ్ కై షేక్ విప్లవానికి ద్రోహం చేసి కమ్యూనిస్టులను ఊచ కోతకోయించి యూనివర్సిటీలో వామపక్ష భావాలుగల విద్యార్థులపై దాడికి నిరసనగా లూసన్ తనపదవికి రాజీనామా చేసారు. కాంటన్‌లో అభివృద్ధి నిరోధకుల వల్ల లూసన్ ప్రాణానికే ముప్పు ఏర్పడింది.ఆ దశలో ఆయన షాంఘై చేరుకున్నారు. అప్పటినుండి చివర గడియల వరకు షాంఘైలోనే గడిపారు 1928లో లూసన్ టూరెంట్ అనే పత్రికను ఆరంభించారు. మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాలను తర్జుమా చేసి ప్రచురించారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితుడయారు.

1930లో చైనా ఫ్రీడం లీగ్‌ను, వామపక్ష రచయితల లీగ్‌ను నిర్మించడంలో కీలక పాత్ర నిర్వహించారు. 1938 ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక మహాసభ నిర్వహణలో అతి ప్రధాన బాధ్యతలు నిర్వహించారు ఆయన రహస్య గా ఉండాల్సి రావడంతో అంతర్జాతీయ మహాసభ అధ్యక్ష వర్గంలో ఉన్నప్పటికీ మహాసభకు ఆయన హాజరు కాలేకపోయాడు.

ఒకపక్క కృశింప చేస్తున్న క్షయవ్యాధిని మరోపక్క నిర్బంధ కాండని ఎదుర్కొంటూ 1936 అక్టోబరు 19 న కన్నుమూసే పర్యంతం ఆయన ఒకక్షణం కూడ విశ్రాంతి లేకుండా సాహిత్య సైద్ధాంతిక రంగాలలో యోధుడుగా పోరాటం సాగించారు.

నిరంతరం అధ్యయనం కొత్తరచనలు చేయడం, పత్రిక సంపాద కత్వం, కళాప్రపంచంలో కొత్త పంథాలకు రూపకల్పన ఇదీ లూసన్ జీవితం. అభ్యుదయ రచయితల కళాకార్ల ఉద్యమానికి సారథ్యం వహించారు. అంతకు ముందు కొమింగ్‌టాంగ్ వర్గం సాహిత్య రంగంలో చేసిన అభ్యుదయ వ్యతిరేక సైద్ధాంతిక గందరగోళాలను లూసన్ పటాపంచలు చేసాడు అలాగే పాతనంతా నాశనం చెయ్యాలనే దుందుడుకు వాదుల తెలివితక్కువ మూర్ఖత్వానికి వ్యతిరేకంగా కూడా

ఆయన పోరాడారు. చైనా ప్రాచీన సాహిత్యంలోగల సత్సంప్రదాయాలన్నిటికి నిజమైన వారసులుగా అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని ఆయన తీర్చిదిద్దారు.

అందుకోసం చైనా పురాణ గాధల్ని, చివరికి పుక్కిట పురాణాల్ని సైతం ఇతివృత్తం తీసుకొని గ్రంధాలు రాశారు. ప్రాచీన కాలంనాటి చైనా ప్రజల సృజనాత్మక శక్తిని చాటే రచన మెండింగ్ హెవెన్ (స్వర్గ నిర్మాణం) అలాగే ప్రాచీన చైనా రుషులు, మునులు "యి" "యు" "మొట్జు" వంటి వారిని గురించి ఆయన రాశాడు.

తన జీవితంలో 700 వ్యాసాలు రాశారు. 16 వాల్యూల, 8 కధానికల సంపుటాలు వెలువడ్డాయి. "మన అతిముఖ్యలక్ష్యాలు 1. బతకడం, 2. తిండి, బట్ట, 3. ముందుకు సాగడం" "ఇందుకు అడ్డువచ్చేదేదైనా ప్రాచీనంకాని, ఆధునికం కాని, మానుష, మానుషేతర శక్తి ఏదిగానిండి దాన్ని తొక్కపారేయాల్సిందే" అంటారు లూసన్.

"కేవలం శ్రామిక వర్గానిది మాత్రమే భవిష్యత్తు శ్రామికవర్గ విప్లవ తుఫానుతో ఈ గడ్డమీది పనికిరాని చెత్తనంతా ఊడ్చెయ్యాలి".

"కోట్లాది ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే అద్భుత సామాజిక వ్యవస్థ ఈ నరకలోయల్లోంచే అవతరిస్తుంది".

ప్రఖ్యాత చైనా మార్క్సిస్టు సాహిత్య విమర్శలు "ఫెంగ్‌స్యూపెంగ్" లూసన్ సెలెక్టెడ్ వర్క్స్ (1956 పెకింగ్ ప్రచురణ)కు ముందుమాట రాస్తూ ఇలా అన్నారు. "లూసన్ రచనలు ఆయన పార్టిజాన్‌షిప్ (పక్షపాతం) సోషలిస్టు రియలిస్ట్ (సోషలిస్టు వాస్తవికత) సాహిత్యం ఆధునిక చైనా సాహిత్యంలో కొత్తచరిత్రను సృష్టించాయి".

"సుదీర్ఘ చరిత్రగల ప్రాచీన చైనా సాహిత్యంలోని ఉత్తమ ఉదాత్త సాంప్రదాయా లన్నింటినీ ఆయన గట్టిగా బలపరాచాడు. వాటికి ఆయన గొప్ప వారసుడు".

"ప్రాచీన చైనా సంస్కృతి లోతుల్లోకి వేళ్ళవరకూ తడిమి ఆ జ్ఞానంతోను, సంస్కరణాకాంక్షతో విదేశీ సాహిత్యాన్ని చదివి విస్తృతంగా అకళించుకున్నారు. ఆ విధంగా చైనా సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యం ఆధునిక అభ్యుదయ రీతులలో అనుసంధానింపజేశాడు".

చైనాలో విప్లవం విజయవంతమవడానికి దాదాపు 13 సంవత్సరాల ముందే లూసన్ కన్నుమూశారు.

సాహిత్యమీమాంస

ప్రశ్న: వాస్తవ జీవితానికీ, జీవిక వాస్తవానికి ఏమైనా తేడా ఉందా? ఉంటే, ఏమిటి??

—జగన్నాథ శాస్త్రి, తిరుపతి

జవాబు: ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే మనం మొట్టమొదట మరో ప్రశ్న వేసుకోవాలి. "అది జీవితమంటే ఏమిటి?" అనే ప్రశ్న. ఈ ప్రశ్నకి సమాధానం రసాయనిక, జీవ శారీరక (chemical, biological, phsiological) శాస్త్రాలను ఆధారం చేసుకుని సమాధానం చెప్పవచ్చు. కానీ ఆ సమాధానం, ఈ సందర్భంగా సరిపోదు.

ఈ సందర్భంలో జీవితానికి మనం యివ్వకోవలసిన అర్థం, 'సాంఘిక జీవితం' అంటే ఏమిటి? సంఘం మనుగడకి, సంఘం ప్రకృతితో సంబంధం ఏర్పర్చుకుని, సాంఘిక ఉత్పత్తి ద్వారా తన అవసరాలను భర్తీ చేసుకుంటుంది. ప్రకృతితో ఏర్పరుచుకున్న సంబంధాలే కాక, సంఘంలో వ్యక్తులు యితరమైన సంబంధాలను కూడా ఏర్పర్చుకుంటారు. ఉదాహరణకి, స్త్రీ పురుష సంబంధాలు అలాగే వ్యక్తుల మధ్యన పెరిగే స్నేహబంధాలు; తర్వాత సంఘం పెరిగి ముందంజ వేసినప్పుడు కొన్ని రకాల సంస్థల్ని ఏర్పర్చుకుంది. ఉదాహరణకి సాంఘిక సేవా సాంస్కృతిక సంస్థలు లయన్స్ క్లబ్, వర్కర్స్ అసోసియేషన్ క్లబ్ మొ.వి. ఈ మొ॥ వాటిలో వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలు పెరుగుతాయి. అలాగే ట్రేడ్ యూనియన్స్ లోనూ, రాజకీయ పార్టీలోనూ, వ్యక్తుల మధ్య రాజకీయ సంబంధాలు ఏర్పడుతాయి. అలాగే ఒక దేశపు సంఘానికి మరొక దేశపు సంఘానికి మధ్య సంబంధాలు కానుకల రూపంలోనూ, వర్తక వ్యాపార రూపాల్లోనూ యుద్ధాల రూపంలోనూ, రాజకీయ రూపంలోనూ ఏర్పడుతాయి

ఈ సంబంధాల ద్వారా, వ్యక్తులలో, సంఘాలలో స్నేహ భావాలు కానీ, ఏవగింపు భావాలు కానీ, శత్రుత్వ భావాలు కానీ, పుట్టడం, వాటి ద్వారా, ఉత్సాహమూ, వ్యక్తులమీద భ్రమలుపోయి ఒక రకమైన ఏవగింపు కలగడం, కోపం, నిరాశ మొదలైన అనుభూతులు కలగడం తరచు జరుగుతుంటుంది.

ఈ నెల ప్రశ్నకు సమాధానం శ్రీ జి. జె. రామారావ్ గారిస్తున్నారు. వీరు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు శాఖలో లెక్చరరు. మార్క్సిస్టు సూత్రాలను సాహిత్యానికీ - ఆర్థిక రంగాలకు అన్వయించటంలో నిష్ణులు.

సంఘజీవితం మొత్తంపైన వివరించిన ప్రకృతితో సంబంధించి ఉత్పత్తిలో ఉత్పన్నించే సంబంధాలు, స్త్రీ పురుష లేక పునరావృత్తి సంబంధాలు, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, అంతర్జాతీయ సంబంధాలు, వాటివల్ల సంఘంలోనూ, వ్యక్తులలోనూ ఉద్భవించే భావ, అనుభూతి సంపద, వీటి మొత్తమే, సాంఘిక జీవితం. సంఘం కాక వ్యక్తుల ఆలోచనలన్నీ ఈ సంబంధాల ననుసరించి ఉంటాయి. ఆలోచనలు ఈ సంబంధాల ప్రతిబింబమే ః ఇది సంఘపు వాస్తవ జీవితం.

"వాస్తవ జీవితం ఏమార్గంలో నడుస్తున్నదీ, సంఘపు మొత్తం సంబంధాలు ఏ మార్గంలో నడుస్తున్నవీ, వాటి భావి పర్యవసానాలు, పరిణామం, ఏ మాదిరిగా జరగవచ్చు, జరగగలదు" అనే విషయాలు సంఘమూ, ప్రతివ్యక్తీ ఆలోచిస్తూనే ఉంటారు. ఈ సాంఘిక పరిణామాన్ని కూలంకషంగా అర్థంచేసుకొని దాని కారణ కార్య సంబంధాన్ని నిర్ణయించింది. తప్పని సరిగా రాబోయే, కారం, రాగల మార్పును సూచించడమే జీవితాన్ని వాస్తవికంగా దర్శించడం ఇది జీవిత వాస్తవికత.

జీవితాన్ని వాస్తవికంగా దర్శించడం ఏ మాదిరిగా జరుగుతుంది?- సంఘంలో ఉన్న వ్యక్తుల చైతన్యం సాంఘిక చైతన్య పూరితమై ఉంటుంది. ఎందువల్ల నంటే వ్యక్తి తన బాల్యంనుండి సంఘపు సంబంధాలలో పెరగడం వల్ల చైతన్యం ద్వారానే మానసిక, సాంస్కృతిక వికాసాన్ని పొందుతాడు. ఇదికాక వ్యక్తి తన స్వకీయమైన మానసిక శక్తి ద్వారానో, తన అభివృద్ధిలో అలవర్చుకున్న నైతిక తాత్విక దృష్టి ద్వారానూ సంఘ పరిణామం ఏమాదిరిగా జరగగలదో జరగబోతోందో, దర్శించగలడు. అయితే, ఇందుకు సరైన నైతిక, తాత్విక దృష్టి ఉండటం చాలా ముఖ్యం. వీటి ద్వారానే జీవిత వాస్తవికతను దర్శించ గల్గడం జరుగుతుంది. అలాగే, ఏ కళాకారుడు, రచయిత దర్శించగల్గుతాడో వాళ్ళని 'ద్రష్ట' అంటారు. అటువంటి రచయితలు, కళాకారులు, సంఘంముందుకు పోయే ఉత్సాహాన్ని కల్గించే రచనల్ని, కళారూపాల్ని సృష్టిస్తారు.

వ్యక్తిత్వం

మనస్సుని
జీవితమనే టెస్టుట్యూబ్‌లో వేసి
పరిస్థితుల యాసిడ్స్ పోసి
పరిశీలిస్తే
మిగిలేదే
వ్యక్తిత్వం-

—అడవికొలను మాలతి.

వై. సి. వి. రెడ్డి

కథానిక

ఐదు రూపాయలు

"వానితో ఏం? వాన్ని అంతగా కొట్టకుంటే ఏం? యింతకూ వాడేంచేసినాడు. కాదంటే కష్టకాలాల్లో గింజలో, లెక్కో అప్పుతీసుకొని వుంటాడు. అదైనా ఎక్కువ యిచ్చిటాడా. యీ ముండమోపి యిచ్చింటే 5, 10 లెక్కో, 10, 15 సేర్ల గింజలో యిచ్చింటాడో లేదో, అంత సంబడానికి యింతగానా కొట్టేది. అయినా యివూరు వూరేకాదు. అందరూ పెద్ద రెడ్లే ఆస్తి కొంచెమూ అహంభావము ఎక్కువా. వాళ్ళకు తెలియదు. ఒకరు సెప్పితే వినరు. ఏమన్నా అంటే "పోరాపోరా మహా తెలిసినోడివి అని అంటారు. ఈ వూరు బాగుపడుతుందా? ఎట్లబ్బా యీ వూరు బాగుపడేది. 'ఛా కొంపలో మానంగా మర్యాదగా బతకాలంటే కుదరనే కుదరదు. ఎక్కడన్నా పోయి బతుకుదామా అంటే కానేకాదు. ఏ వూరికావూరు అగ్గి గుండంగా మండుతా ఉంది. టౌనుకు పోదామా అంటే అక్కడ దిక్కులేని చావు. అక్కడ బతకాలంటే వాటగాడు కావాల. ఎక్కడ ఒరిగినా ఆఫీసర్ల పదును కత్తులు ఒరుసుకొంటాయి. తెలిసీ తెలియకుండా బతకాల. పెట్టుబడి పెద్దగా వుండాల. పెద్ద వ్యాపారముండాల. పెద్దపెద్ద ఆఫీసర్లతో పరిచయాలుండాల. లేకుంటే కుక్కచావు....ఈ అసూయలూ ద్వేషాలూ - రోషాలూ - లోభిగుణాలూ దానికితోడు అహంభావాలూ ఎట్లాపోతాయి. ఎప్పుడు పోతాయి "అని దిక్కుతెలియని స్థితిలో ఆలోచిస్తున్నాడు వాసుదేవరెడ్డి.

వాసుదేవరెడ్డికి బంధువర్గము దండిగా వుంది. అందరూ తన చుట్టూ ఉన్నట్లుంటారు. ఎవరికి సహాయం చేయకపోయినా చిక్కుల్లో పడతాడు. ఎవరికి ఏ సలహా యివ్వాలన్నా కనీసం వారం రోజులైనా ఆలోచించి యివ్వాల. కఠినమైన కావ్యానికి వ్యాఖ్యానమైన చెప్పచ్చుకానీ - కలసి జీవించే కవలపిల్లల హృదయోల్లాసాలను విడమరచి చెప్పలేము అంతస్థుకు తగిన మర్యాద లేదు. అర్థంకాని బతుకులు. ఒకడు ఏదారి అంటే యింకోడు గోదారి అంటాడు. వాసుదేవరెడ్డికి ఆలోచనల్లో కొడి దొరకలేదు లచ్చిగాన్ని కొట్టింది రెండు రూపాయలకే అని అంటారు. స్వల్ప మొత్తానికే అంతగా కొట్టాలా - లెక్కరాకుంటే ఏమవుతుంది. ఎక్కడికి పోతాడు అని, వస్తుందిలే అని సోకోర్చుకో వచ్చునే. న్యాయం చెపుదామా అంటే ఎవనిక్కా

పాల న్యాయం. జరిగే వాని పక్కనే ఉంటుంది న్యాయం. బీదోళ్ళు ఎవరి దగ్గర న్యాయం పొందుతారు. కోర్టులూ, కచ్చేరీలు వాళ్ళకు దూరం. పనిపోగొట్టు కొని తిండిలేకుండా కోర్టుకు పోలేరు అంతా కరువుతో కూడుకొన్న పని. అక్కడా ఆస్తిపరులదే పైచెయ్యిగా ఉంటుంది. కర్చులు పెట్టుకొంటూ, అం దర్నీ మేపుకొంటూ సంవత్సరాల తర బడి వాయిదాలు వేయించుకొంటారు విచారనే జరగనీరు. పేదోడు కర్చులకు తట్టుకోలేక ఆ వూరు విడిచి పెట్టిపోవాల. అంతే! న్యాయం పేదోవి పక్కనఉన్నా- అన్యాయంగా, దిక్కులేకుండా. దొంగ తనంగా వూరువిడిచి కానని చోటికి కష్ట పడి పోవాల్సిందే. లేకుంటే వాన్ని సర్వ నాశనం చేస్తారు. యింతకూ సుకపడే రాతలేదు. తల వేడెక్కిపోయింది. ఆలో చన్లతో. బీడీ ముట్టించుకున్నాడు. ఎవ రన్నా ఆదోవన వస్తారేమో అని చూస్తూ బీడీ తాగుతూ, వసారాలోంచి వచ్చి, పంచటరుగు మీద కూర్చున్నాడు. పేడ గంపెత్తుకొని పోతున్న గుర్రప్పను పిలిచినాడు వాసుదేవరెడ్డి.

"వస్తాలేబ్బా" అని పేడదిబ్బలో వేసి వచ్చినాడు గుర్రప్ప.

"గుర్రప్పా!లచ్చిగాని కొట్టినారంటనే ఎందుకూ? 'నేనూర్లోలేను నిజంచెప్పరా" అని అన్నాడు.

"ఏముంది వాడు బాలిరెడ్డికి బాకీ అంట. పనికి పిలిస్తే రాలేదంట. అం తకు ముందే పిలచినోళ్ళకు పనికి పోతుంటే వాళ్ళు తంతారు. వాని వేరే వాళ్ళపనికి పోయినాడు" అని గుర్రప్ప అన్నాడు.

"ఎంతరా బాకీ? ఊరుకూరకనే కొట్టారు." అని కొంచెం విసుగ్గా అడిగి నాడు వాసుదేవరెడ్డి.

"యాడదిబ్బా ఐదురూపాయలు బాకీ వున్నాడంట" అని అన్నాడు, గుర్రప్ప.

"రెండు రూపాయలే అని చెప్పి నారే" అని అడిగినాడు వాసుదేవరెడ్డి.

"కానోళ్ళు చెప్పింటారు. వాడే నాతో అన్నాడు ఐదురూపాయలు యివ్వాలని, రెండురూపాయలకే యిరగ్గట్టి కొట్టినాదని బాలిరెడ్డిని పది మందిలో చూపించేం దుకు అట్లా అని ఉంటారు. ఎట్లయినా పేదోళ్ళదే తప్పు. అప్పు తీసుకోద మేల దెబ్బలు తినడమేల? అని అంటూనే కొట్టడం తప్పు అన్నధ్వని వచ్చేట్లు మాట్లాడినాడు గుర్రప్ప.

"అప్పు తీసుకొంటే - పనికిరాకుంటే అంతగా కొట్టాల్నా. కళ్ళ బెత్తుతో పని జరుపుకోవాల. యిప్పుడు పదిమంది నోళ్ళలో బాలిరెడ్డి నానుతావుండాడు. ఏంపని" అని యీసడింపుగా అన్నాడు వాసుదేవరెడ్డి.

"గోడలకు చెవులుంటాయి, మా కెం దుకీ రంపుల్లో యిరుక్కోవడం పేదోళ్ళు ఏం మాట్లాడినా, అట్లాన్నావంటనే, యిట్లాన్నావంటనే అని నిలదీసి అడిగి మరీ కొట్టారు. నేపోతాబ్బా సీకు తెలి

ఖ్యుండేమ్మున్ది. మీరే న్యాయం విచారించు కోండి'' అని గుర్రప్ప జారుకొన్నాడు.

పాపం లచ్చిగాన్ని బాగా కొట్టినారు రోకల బడెలతో. ఎప్పుడంటే అప్పుడు వాని దగ్గర లెక్క ఎక్కడు టాది. పనికి యీ పొద్దు రాకుంటే రేపొస్తాడు. 'ఛ'. పాడుపనులు. పనికిమాలినోళ్ళు అని అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

లచ్చిగాడు కేసుపెట్టినాడు. డాక్టరు కూడా దెబ్బల సర్టిఫికెటు బాగా నేయిచ్చినాడంట ఊరంతా అలగులలుగా ఉంది. 'పోలీసులు వూర్లోకి వస్తారు విచారించుకొంటారు. నేరస్తులను పట్టుకొని పోతారు' అని వూరంతా అనుకొంటున్నారు.

బాలిరెడ్డి కొడుకు వచ్చి "మా నాయన రమ్మంటున్నాడ"ని వాసుదేవరెడ్డికి చెప్పినాడు. పోకూడదనుకొంటూనే-పోకుంటే తీరదని – 'వస్తున్నా' అని చెప్పి పంపినాడు వాసుదేవరెడ్డి.

బాలిరెడ్డి యిల్లంతా కోలాహలంగా ఉంది. బలపరిచే బంధువులందరినీ సమావేశ పరచినాడు. బంధువులంతా "ఆపసులో అంత అక్కసు పనికిరాదు. సన్నోళ్ళను అంతక్కసుగా కొట్టితే ఎట్లరా – బుద్ధిలేనిపని చేసినావు అందరూ మనమంనే అంటున్నారు. లచ్చిగానితో రంపు, లచ్చిగాని కొట్టడం సాకు పెట్టుకొని, మన శత్రువులు, మన గుంపును పుడమార్చాలని చూస్తున్నారు. ఆ తర్వాత యిది ఏ విధమైన రంపుల్లోకి దారి తీస్తుందో. అయినా మిడి మేళం పనికిరాదు. గామిడిగాదని వలుగురి నోళ్ళల్లో నానడం తప్పితే ఏమన్నా పుణ్యమూ పురుషార్థమూ. రూపాయకూ, అర్థరూపాయకూ పియ్యి తినేవాళని జాన్నోళ్ళు ఆదేపనిగా వాగుతారు. ఇంధువుల్లో తలవంపులు. సరిసమానమైన వాళ్ళతో సరసమైన, విరసమైన" అని అంటున్నారు "ఊర్లో పార్టీ పడుతుంది. యిది దానికి ఎత్తుమాసం" అని అంటున్నారు.

బాలిరెడ్డి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. 'లచ్చిగానికి దిక్కెవరో చూస్తాను. యిప్పుడు లచ్చిగాని కేసుతో పనేం. జరిగేది జరుగుతుంది. వానికి సాయపడే గంగిరెడ్డిగాని కతేందో తేలుతుంది చేకాడ, చెట్టుకాడ ఎక్కడా వానితో రంపే. ఎంత ఒదుక్కొని పోవాలన్నా వానిది జాస్తిఅయింది. ఖర్చుఎంతయినా సరే" అని బాలిరెడ్డి రొప్పుతున్నాడు. వాసుదేవరెడ్డి అంతలో వచ్చినాడు. అతన్ని చూసి "నువ్వే చెప్పుమామా. వాడు లచ్చిగానికి సాయం పోవచ్చునా. నేను లెక్కిచ్చినా రాబట్టుకొంటా, వాన్ని కొట్టుతాను. చంపుతాను. ఎగదోసి వుసికొల్పుతాడా. గంగిరెడ్డో, నేనో – చావో బతుకో చూచుకొంటాం. మాకు వచ్చింది. మీకురాకుండాపోతుందా. వాడ సాధ్యుడు. ఎక్కడెక్కడి బీళ్ళల్లో మాన్లూ వాడే కొట్టుకొంటాడు చావిడికని కొట్టిన దంతెలు వాడే బండ్లమీద్దకూ వసారాకూ వేసుకోలేదా. ఊరకుంటే వూరంతా మేస్తాడు ఊరకుంటే వూరం దర్ని తిప్పలు పెడ్తాడు. ఎక్క డెక్కడి

తకరార్లు వానికి కావాల. అందరికి తం పులు పట్టి వాడు పెద్దమనిషిగా తిరుగు తున్నాడు'', అని ఊగుతూ చెప్పినాడు బాలిరెడ్డి.

''అయినా దీనికి పార్టీ లెందుకురా'' అని అన్నాడు మందలింపుగా వాసుదేవ రెడ్డి

''నీకు తెలియదులే. వాన్ని ఎదుర్కో వలసిందే. లచ్చిగాని కేసు నా స్వంతం. మిగతా కేసులు, వస్తాయి. మీరంతా ఉండాల. లేకుంటే మితిమీరిపోతాడు. మీరు రాకుంటే నా స్వంతం నేనుచూచు కొంటా. సస్తే చస్తాను. బతికితే బతుకు తాను. అని అన్నాడు. ఏమైనా సరే నన్నట్లు బాలిరెడ్డి.

''తొందర పడకురా'' అని వాసుదేవ రెడ్డి తాలచెప్పేందుకు ప్రయత్నించి నాడు.

''రెడ్డికన్నాన్ని లోబరుచుకొని ఎన్ని పనులు చేసినాడో మీకు తెలియదా. బీదోళ్ళను ఎన్నిసార్లు కొట్టినాడో ఊరం దరికి తెలుసు. వాడు కొట్టినప్పుడు నేను కేసు పెట్టినానా. వాని మాదిరీ నీచమైన పనులు మనం చేస్తామా. పోనీలే అని ఊరుకుంటే నన్ను రచ్చకీడుస్తాడా. నేను లచ్చిగాడి కాళ్ళు పట్టుకోవాలనా - వాని ఉద్దేశం. కేసు జరగనీ ఏమవు తుందో చూస్తాం'' అని అన్నాడు బాలి రెడ్డి.

వాసుదేవరెడ్డి ఏమీ మాట్లాడకుండా కొంతసేపు వుండి అందరితోపాటు నేనూ అని అక్కడనుండి పోయినాడు.

ఆ రాత్రికి అంతా కట్టుదిట్టంగా గంగి రెడ్డికి ఎదురు పార్టీగా కట్ట మాట్లాడుకొని తిరుగుబాటు గాకుండా వుండేందుకు బాండ్లు వ్రాసుకొన్నారు. వాసుదేవరెడ్డి బాండు రాయించినాడు. ఆ రోజే ఏదో పని ఉందని కడపకు పోయినాడు. వాసు దేవ రెడ్డికి దంతా యిష్టంలేదు. ''తానేమీ చేయలేదు. అందరితోపాటు కచ్చలకు లెక్కలు పెట్టుకోవాల. భూస్వాముల కట్టలో తానూ ఒకడు. తప్పించుకోలేడు తనకూ ఆస్తి పాస్తులున్నాయి వాటికి రక్షణ ఉండదు. అందరితోపాటు ఉండ కపోతే పనికిమాలిన వాడైనా వాసుదేవ రెడ్డిని ముప్పుతిప్పలు పెట్టవచ్చు. పీల యితే యిరు పార్టీల వాళ్ళూ వాసుదేవరెడ్డి ఆస్తులకు నష్టం కలుగచేస్తారు. వాటం తప్పితే కొట్టడం కూడా జరుగుతుంది. అంతా దుర్మార్గుల మధ్య ఉన్నాడు. యింతకూ యీ ఆస్తిలేకపోతే యిదంతా లేదుకదా. న్యాయంకూడా చెప్పలేకుండా ఉన్నా'' అని అనుకొన్నాడు వాసుదేవ రెడ్డి. ''విధిలేని మంచితనం ఏం పని చేస్తుంది'' అని కూడా అనుకొన్నాడు.

స్వంత కచ్చలతో కడప-మద్రాసు తిరుక్కుంటూ వూరికి పోకుండా తప్పిం చుకని తిరుగుతావున్నాడు. వూరికి పోయినా రాత్రిపూటలపోడం, ముఖ్య మైన పనులు పురమాయించడం - చేసి వస్తున్నాడు. యిదంతా కేసుల్లో తన్ను యిరికిస్తారనే ఉద్దేశంతోనే తప్పించు కొంటున్నాడు వాసుదేవరెడ్డి.

పార్టీలు రెండుగా స్పష్టంగా ఏర్పడి నాయి. యిరుగుపొరుగు ఊర్లకు ప్రాకింది

యూ వార్త. తోటలకాడ, దొడ్లకాడ, కళ్ళాల కాడ, ఆ గుంపులోనూ, ఈ గుంపులోనూ ఉన్న కట్టె పట్టేవాళ్ళు మన పార్టీ తగ్గిపోతే ఎట్లా - ఎవళ్ళ కోమను సదరానికి తెలుస్తాది" అని పరస్పరం తెలిసేట్లు బీరాలు పలుకుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల పిడిగుద్దులూ కొట్లాటలూ, లేనిపోని సాకులు పెట్టి సేద్యగాళ్ళను కొట్టడం జరుగుతావుంది. చిలికి చిలికి గాలివాన అవుతావుంది. పార్టీలో వాళ్ళు రెండుగుంపుల వాళ్ళూ ఎక్కడికి పోయినా జట్లుజట్లుగా, మొల్లో బాకులతో పోతూ వున్నారు. యీరముట్లూ, కావలసిన తుపాకులూ తెచ్చి పెట్టుకొన్నారు. ఎప్పుడైనా తలపడ వచ్చునని పోలీసోల్లు జామీన్ కేసులు బనాయించినారు. వాయిదాలకు తిరుగుతున్నారు. డబ్బులు కర్చయితా ఉన్నాయి. వూర్లో ఏ యింటి కాడ తకరారూ ప్రధానంగా చర్చల్లోకి వస్తూనే ఉంది.

నెల తిరక్కతలికే వూరిలో కూనీలు పడినాయి. వాసుదేవరెడ్డికి దిక్కు తెలియలా. విధిలేక ఊరికి వచ్చినాడు. బాలిరెడ్డి గుంపులోనే ఒకడు ఎందుకూ పనికిరానోడు కూనీ అయినాడు. మిద్దెలెక్కి తుపాకుల్తో కాల్చుకొన్నారు. కూనీలు జరిగిననాడు ఊర్లో లేనోల్లను తప్ప అందరినీ - ముఖ్యమైనోళ్ళను - కేసులో యిరికించినారు. అంతా తెలుసుకొన్నాడు వాసుదేవరెడ్డి. ఏంచేస్తాడు. బాలిరెడ్డి యింటికి పోయినాడు.

"అయిందేదో అయింది. యిప్పుడే మంచి అవకాశం. నేను చెప్పలా వాడు దుర్మార్గుడని. వూరంతా నాశనం చేయాలని చూసినాడు. ఆ దినం కాల్పుల్లో వూరంతా అట్టుడికినట్లు ఉండింది. కాల్పుల్లో ఏమీ కాబట్టనోడు మన రామిరెడ్డన్న సేద్యగాడు గుర్రప్పచచ్చినాడు. వాన్నెందుకు కాల్చినారో తెలియదు. ముందనా కొడుకులు. మమ్మల కాల్చకూడదా. అందరం కట్టుదిట్టంగా ఉండి వాన్ని - గంగిరెడ్డిగాన్ని నామరూపాలు లేకుండా చేయాల"-అని అన్నాడు బాలిరెడ్డి.

ఊరంతా పుండు మాదిరి పాసిపోతా ఉంది. పార్టీ లీడర్లు రక్షణకు మనుషుల్ని వెంట పెట్టుకొని తిరుగుతున్నారు. రెండు గుంపులూ న్యాయంకోసం పోరాడుతున్నారు. లచ్చిగానితో వచ్చిందంతా అని ఎక్కడ పడితే అక్కడ అనుకొంటున్నారు. లచ్చిగాడు వూర్లోలేడు. పొరుగూరికి పోయి పనులకు పోతా బతుకుతున్నాడు. ఎప్పుడైనా వాయిదాకు పోయి వస్తూంటాడు. వాని కేసు సంగతి సందర్భాలు ఎవరికీ కాబట్టలేదు. గంగిరెడ్డికి కూనీకేసు వచ్చి మీద పడింది. సముద్రము యీదినట్టుంది. బాలిరెడ్డి గుంపు వాళ్లు జాగ్రత్తగా గంగిరెడ్డి గుంపును జైలుకు పంపాలని కేసు విషయాలు చూచుకొంటున్నారు.

"గాడిదిని చంపి గల్లుకు పోవడం దేనికిరా. చెప్తే వినరు. అనవసరంగా అక్కసలకుపోయి కొంపకు చేటు తెచ్చుకొన్నారు. కేసు సరిగ్గా నడిస్తే కనీసం పదిమందికైనా యావజ్జీవ కారాగారం చెప్తారు. కొంపలు గునామల్తో కూడా

లేసిపోతాయి. కూనీ కేసులంటే సన్న పనా. వకీళ్ళూ, పోలీసోళ్ళూ మేస్తారు. యింతకూ న్యాయం జరుగుతుందా. జరగదు. కాల్చిందేవ ఒకడే అయినా పదమంది జైలుకుపోవాల. ఆడోళ్ళకూ, పిల్లోల్లకు దిక్కెవరు. భూములూ, యిళ్లూ దిక్కులేకుండాపోతాయి. సేద్యం సరిగా జరగదు. అన్ని యిబ్బందులే. చెప్తే వినరు యిప్పుడైనా మించి పోలేదు. రాజీపడితే మనకు మేలు. జైలు తప్పుతుంది"- అని గంగిరెడ్డి బంధువులు కొంత మంది గంగిరెడ్డికి చెప్పుతున్నారు. బాలిరెడ్డికీ, బాలిరెడ్డి బంధువులు రాజీపడమని చెప్తున్నారు "పిల్లపిల్ల పచ్చ్యాతమూ యీ కోషాయిపోవు. మనమై తెచ్చి పెట్టినట్లుంది. ఆడోళ్లకు పిల్లోల్లకూ కష్టం. లెక్కలు పోతాయి. ఎందుకీ పగ. వాళ్ళు జైలుకు పోతే మనకేమొస్తుంది. అందులో ఏమీ తెలియనోళ్ళను, కాబట్టినోళ్ళను కేసులో పెట్టినారు. వాళ్లకు అక్కసలు వస్తాయి. ఏమైనా రాజీపోతే మంచిది" అని,

రెండు గుంపుల్లోనూ యువకులు రాజీ మాటలు చెప్తేనే మెడ గరుసుకొంటున్నారు. వాళ్ళు రాజీ పోయేది యిష్టపడటం లేదు," యింత దూరం వచ్చినాం. వాళ్ల నాశనం కావడమో, మేం నాశనం కావడమో జరుగుతుంది. జరగనీ" అని అంటున్నారు. రాజీకి వప్పుకోకుండా వున్న వాళ్ళంతా, కేసులో లేనోల్లే. పార్టీకి కట్టెపట్టేవాళ్లు. అంతే. పార్టీ అన్నాక అందరి మాటలువినాలి. వినకుంట్టే కూడా దిక్కులు వస్తాయి. రాజీప్రయత్నాలు చెయ్యాలని పార్టీ ముఖ్యులు అనుకోలేకపోతున్నారు. పనికిమాలిన న్యాయ ధర్మాలు అడ్డువస్తున్నాయి. పూరి మేలు గోరి రాజీ పోవాలన్న భావమే అందరి మనసులోనూ మెదల్తావుంది. అందరికీ లెక్కలు పోతాయి. ఆస్తులు కరుగుతాయి.

పెద్దపెదవాళ్లూ, యిరుపార్టీలకు సంబంధించిన రాజకీయవాదులూ. బంధువులూ, పరిసరగ్రామ పెద్దలూ, అందరూ రాజీ పొండని చెప్పుతున్నారు. ఎవరితో కదిపినా, "ఇప్పుడు సల్లు కుంటాము. పోతే పోతుంది రెండేళ్ళ పైరు. అని బాలిరెడ్డి గుంపులో కుర్రకారు రాజీకి ఒప్పుకోవడంలేదు. యిరుపార్టీల గుంపుల్లో కొన్ని కుటుంబాలు ఒకరికొకరు బంధువులు – దగ్గర బంధువులు ఆ దవాళ్ళ ద్వారా లోపల్లోపల రాజీ మాటలు జరుగుతున్నాయి. రాజీకి ఒప్పించేందుకు వాళ్లూ తీవ్రంగా ప్రయత్నిస్తూన్నారు.

కేసు బలం తగ్గకుండా బాలిరెడ్డి గుంపు తీవ్రంగా ప్రయత్నిస్తూఉంది కేసు తోసిపొయ్యేట్లు చేయవలసిన ప్రయత్నాలన్నీ గంగిరెడ్డి గుంపు వాళ్ళూ ప్రచండంగా ప్రయత్నిస్తున్నారు. యథావిధిగా ఎక్కువ మోతాదులో లెక్కలు కర్చవుతున్నాయి. అడ్డు పడినోన్నల్లా ఆదరించి పంపాల్సిఉంది. అందరినీ మేపాల. నైతికంగా బలపరిచేవాళ్ళనూ మేపుకుంటూరావాల. ఆయకాలు రాయించి అప్పులు తెచ్చుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి కొందరికి. "పార్టీ బాగొచ్చి

పడెనే పాడుపడ" అని అనుకొంటున్నారు కొందరు. పెద్ద మనుషులు ప్రతి నిత్యమూ రాజీకి ప్రయత్నిస్తున్నారు. ప్రతివానినోటా "ఆస్తులుపోతాయి. అడుక్కోవలసి వస్తుంది. రాజీపోతేమంచిది. మా మాట వినండి" అని నొక్కుతున్నారు.

కడాకు రాజీ కుదిరింది. 10 వేల లెక్క బాలిరెడ్డి గుంపుకు యిచ్చేట్లుగా, ఉత్తరోత్తరా తిరిగీ కొట్లాటలు రాకుండేందుకు బాలిరెడ్డి కూతుర్ని గంగిరెడ్డి మేనల్లునికిచ్చి వివాహం చేసేట్లు కుదరపలుక్కొని రాజీ జరిగింది. విశ్వ ప్రయత్నమైంది రాజీ కుదిరించేందుకు. అందరు పెద్ద మనుషులూ తీవ్రంగా ప్రయత్నించినారు. సాక్ష్యాలు తప్పు పలికేటట్లు కట్టుదిట్టంగా మాటలు జరిగినాయి న్యాయవాదులూ, పోలీసోళ్ళు, అందరూ రాజీకి సహకరించినారు. వాళ్ళదేంపోతుంది. వాళ్ళకు ముట్టాల్సింది ముట్టింది. కూసి అయిన గుర్రప్ప భార్యకు రు 3000/- లెక్క యిచ్చినారు. సాక్ష్యం తప్పుబలికిచ్చినారు. సంపాదించే మొగుణ్ణి పోగొట్టుకొని ముష్టిమూడువేలు తీసుకొని 'శివుగా' అని వూరు విడిచిపోయింది.

"పోనీ రేబ్బా రాజీ కుదిరింది. యింక నన్నా బాగుంటారు" అని అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

అచ్చిగాని కేసేమయిందో ఎవనికీ తెలియదు.

కొత్త జీవితం

ఆకాశంలో
సూర్యుడు వెలుగుతున్నాడు,
కానీ
అంతా చీకటే-
కంకర రాళ్ళను భుజించి
తారును తొడుక్కొన్నది రోడ్డు:
కానీ
దారిపొడుగునా గతుకులూ, ముళ్ళే-
నవ్వుకుంటూ
జీవిస్తున్నాడు మనిషి;
కానీ
గుండెనిండా బాధలగాయాలే-
చీకట్లలో,
ముళ్ళలో,
గాయాలతో
సుస్తీగా జీవిస్తున్న
ఈ సమాజం తిర్గి
ఆరోగ్యం పొందాలంటే-
పిడికిలి బిగించే వాని
చెమటతో, రక్తంతో
తయారు చేసిన
సరికొత్త టానిక్కు తప్పనిసరి-

—జూకంటి జగన్నాథం

బెంగుళూరు తెలుగు

డా॥ జి. యస్. మోహన్ ఎం.ఏ; పి. హెచ్. డి.

కర్ణాటక రాజధాని బెంగుళూరు. రకరకాల జనులకు ఇది నిలయం. పలు రకాల భాషలకు ఇది కూడలి. బెంగుళూరు అనగానే ఇదొక చల్లని ప్రదేశమని దేశదేశాల్లో ప్రఖ్యాతి వహించింది. కనుకనే విహార యాత్రికులుగా వస్తున్న కొందరు ఇక్కడే స్థిరపడడానికి ప్రయత్నిస్తుంటారు. కన్నడిగుల ఆదరాభిమానాలు కూడ గొప్పవి. దేశం నలుమూలలనుంచి వచ్చి జనులు ఉద్యోగాలు సంపాదించుకొనో, కర్మాగారాల్లో పనిచేస్తూనో లేక తామే కర్మాగారాలను నెలకొల్పకొనో ఇక్కడే ఉండి పోతున్నారు. అలా వచ్చిన వాళ్ళలో ఆంధ్రులు, తమిళులు, మలయాళీలు ముఖ్యులు. ఇంకా గుజరాతీ, పంజాబీ, సింధీ, మరాఠీ ప్రజలు కూడ ఉన్నారు.

కోలారు, తుంకూరు, బళ్ళారి, బెంగుళూరు. మైసూరు చిత్రదుర్గ మండలాలలో అదిక సంఖ్యాకులు తెలుగు మాట్లాడుతారు. వీళ్ళలో చాలమందికి తెలుగే మాతృభాష. పలు కర్ణాటక ప్రాంతాల తెలుగువాళ్ళే కాకుండా ఆంధ్రులు సైతం ముఖ్యంగా రాయలసీమ వాసులు బెంగులూరు లో అక్కడక్కడ వాసమేర్పరచుకొన్నారు బెంగుళూరులో ముఖ్యంగా విశ్వేశ్వరపురం, చాదురాజపేట, మల్లేశ్వరం రాజాజీ నగర్, హనుమంతనగర్, త్యాగరాజ నగర్, శివాజీ నగర్ మున్నగు ప్రాంతాల్లో తెలుగు వాళ్ళున్నారు.

ఆంధ్ర దేశపు తెలుగుని మూడు విధాలుగా విభజిస్తే రాయల సీమ తెలుగనీ తెలంగాణా తెలుగనీ, సర్కారు తెలుగనీ పిలువవచ్చు. దీనికి కారణం భౌగోళికంగా ఆయా ప్రాంతాలను విడదీయడమే కాకుండా, ప్రధానంగా వాళ్ళు మాట్లాడే తీరులో కన్పించే యాసకూడ దీనికి దోహదం చేస్తుంది. ఉదాహరణానికి 'ఎక్కడ పోతన్నావు' అనే మాట రాయలసీమలో 'యాడికి పోతున్నావు' యాటికి పోతున్నావు' అనీ, తెలంగాణాలో 'యేడ బోతున్నవు' అనీ, సర్కారు ప్రాంతంలో 'ఎక్కడికెళ్తున్నావు' అనీ వాడుకలో ఉంది. ఇదే మాటని కన్నడ దేశంలోని తెలుగువాళ్ళుకానీ, బెంగుళూరులోని తెలుగువాళ్ళుకానీ ప్రయోగిస్తే 'యక్కడిక్కి పోతా ఉండావు' అని ఉంటుంది.

బెంగుళూరు రాయలసీమలోని అనంతపుర మండలానికి దగ్గరగా ఉన్నందువల్ల ఆ మండల వాసుల ప్రభావం ఇక్కడి తెలుగువాళ్ళపైై అధికంగా కన్పిస్తుంది.

ఆంధ్ర కన్నడిగులలో సంబంధ బాంధవ్యాలు బాగా పెనవేసి కొన్నాయి ముఖ్యంగా రాయలసీమ వాసుల లో కర్నాటక ప్రజలకు వివాహ బాంధవ్యాలు చాల ప్రచురంగా ఉన్నాయి.

పలు కర్నాటక ప్రాంతాల తెలుగువాళ్ళు బెంగుళూరులో ఉండడం వల్ల ఇదే 'బెంగుళూరు తెలుగు 'అనిచెప్పడం కష్టం.అయినా ఈ తెలుగు ఆంధ్రదేశం లోని తెలుగుకు చాలా భిన్నంగా ఉంటుందనే చెప్పాలి. ఈభాషా వైవిధ్యము వాళ్ళుమాట్లాడే యాసలోనూ, కన్నడ పదాలను తెలుగులోనికి చేర్చుకొని తెనుగు పదాలుగా ఉచ్ఛరించడంలోనూ స్పష్టంగా గోచరిస్తుంది. అంతేకాకుండా ఈ తెలుగు అనంతపురం, చిత్తూరు మండలాలకు కొంత సన్నిహితంగా ఉంటుంది. కనుక ఇక్కడ 'బెంగుళూరు తెలుగు' అంటే బెంగుళూరు నగరంలోని తెలుగు అని చెప్పుకుంటే బాగుంటుంది.

అసలు భాషఅనే పదానికి అర్థం ముందుగా తెలుసుకోవాలి. ఒక వ్యక్తి తన భావాలను ఎదుటి వ్యక్తికి చెప్పడానికి ఉచ్చరించే ధ్వనుల సముదాయమే భాష. ఈ ధ్వనులు కూడ వ్యక్తినిబట్టి, పరిసరాలనుపట్టి మారుతూ ఉంటాయి. రెండు భాషల్ని మాట్లాడే ప్రజలు ఒకచోట ఉన్నట్లయితే ఒక భాష మీది ప్రభావము మరియొక భాషమీద తప్పక పడుతుంది. కన్నడ దేశంలో కన్నడం ప్రధానమైన భాష. ఈ భాషాప్రభావం కన్నడ దేశంలోని అల్పసంఖ్యాకులైన తెలుగు వాళ్ళ మీద కూడ పడింది కన్నడ భాషా యాసలు కూడ చోటు చేసికొన్నాయి. బెంగులూరు తెలుగులో కూడ ఇదే జరిగింది. కొన్ని తరాలుగా ఈ ప్రాంతంలో స్థిరపడి పోయిన వాళ్ళ భాష అధారంగా కొన్ని మాటల్ని వివరించడమే ఈ వ్యాసోద్దేశము,

కొన్ని కన్నడ పదాలకు 'ముపర్ణం' చేర్చి తెలుగు పదాలుగా వ్యవహరించడం జరుగుతుంది. ఉదాహరణానికి కన్నడంలో 'భాషణ' అంటే ఉపన్యాసమని అర్థం దీనికి ముపర్ణం చేర్చి 'భాషణము' అని ప్రయోగిస్తారు. 'నిన్న ఆయన భాషణము సానా బాగుండా' అని ప్రయోగము.

అలాగే స్థలము అనడానికి 'జాగము' అని, రంగు అనడానికి 'బణ్ణము' అనీ, సెలవు అనడానికి 'రజము' అనీ, జీతము అనడానికి 'సంబళము' అనీ పంతము అనడానికి 'హఠము' అనీ ప్రయోగాలున్నాయి.

కన్నడంలోని హకారం తెలుగులో పకారంగా ఉచ్చరింప బడుతుంది. 'ఏందిరా అట్లా పుడుకులాడ్తా ఉంటావు, ఏంకానరాలా' అని ప్రయోగం. ఏమి వెతుకుతున్నావు, ఏమి కనబడలేదని దీని అర్థం. కన్నడంతో హుడుకువుదు అంటే వెతకడం హుడుకు – పుడుకు

సాధారణంగా చకారం సకారంగా మార్పుపొంది పలుక బడుతుంది, ఇద్దరు స్నేహితుల స భాషణ ఇది, 'యాటికి పోతావ్ స్నెపా' అని ఒక తనంటే 'యాటికి పోతే నీక్యాల, నీకి సెప్పాలేమి' అని జవాబిచ్చాడు మరొకతను ఎక్కడికి అనే పదం యాటికి అయింది. నీ కెందుకు అన్న పదం నీక్యాల అయింది. చెప్పాలా అన్నమాట సెప్రా అయింది. నీక్యాల అనే పదం 'నింగ్యాకె, అన్న కన్నడ పదానికి సరిపోతుంది.

నినగె + యాకె → నినగ్యాకె (కన్నడం)

నీకు + యాల → నీ క్యాల (తెలుగు)

ఏల, ఎందుకు అనే పదం 'యాల' అయింది. అచ్చు హలుగా మారిందన్న మాట. ఎకారము యకారమయింది.

నేనొకసారి స్నేహితుని ఇంటికి వెళ్ళాను, నేనేదో విషయం చెప్తున్నాను. మధ్యలో నా స్నేహితుడందుకొని 'ఔనష' అన్నాడు. 'ఔనట' అనడానికి ఆయన ఉపయోగించిన పదం ఇది. ఇంతలో వాళ్ళబ్బాయి వచ్చి 'డాడీ! అమ్మ పిలుస్తా ఉంది. పోవాలష' అన్నాడు. సాధారణంగా మనం 'అమ్మ పిలుస్తోంది, వెళ్లాలట' అని అంటాము. కాని ఇక్కడ టకార ప్రయోగం వింతగా కన్పిస్తుంది. టకారాన్ని షకారంగా మార్చి ఔనష, పోవాలష, నిజమష అని ప్రయోగిస్తారు. అయితే ఈ 'అష' ప్రయోగము సర్వత్ర కన్పించదు బ్రాహ్మణుల్లోని ములక నాడు తెగలో ఇది బాగా వ్యాప్తిలో ఉంది. అయితే ఇది ఆంధ్ర దేశంలోని గోదావరి, విశాఖ ప్రాంతాల్లో వైదిక బ్రహ్మణ కుటుంబాల్లో విన్పిస్తుంది.

సాధారణంగా సంబోధనలో 'స్వామీ' అనే మాట వినబడుతుంది. కొన్ని తెలుగు ప్రాంతాల్లో ఇది హేళనార్థకంగా ప్రయోగింపబడుతుంది. ఉదాహరణానికి 'ఏం స్వామి ఇట్లా చేస్తివి' అనేమాట. అయితే ఇక్కడివాళ్ళు. స్వామి అనే పదాన్ని గౌరవార్థంలో ప్రయోగిస్తారు. కన్నడంలో 'స్వామి' గౌరవార్థక సూచకం. అలాగని తెలుగులో స్వామి గౌరవార్థం కాదనికాదు. అయితే ఇది అతి విరళంగా ప్రయోగింప బడ్తుందనీ పెద్దవాళ్ళను, దేవతలను సంబోధించే టప్పుడు మాత్రమే ప్రయోగిస్తారని చెప్పవచ్చు.

'జనాలు పార్తా ఉండారు' - ఈ ప్రయోగం చూడండి. ఒకచోట సమ్మె జరుగుతోంది. పోలీసులు లాఠీ ప్రయోగం చేస్తున్నారు. అల్లంత దూరం నుంచీ చూస్తూ ఒకతను అన్న మాటలివి. జనాలు అంటే మనుష్యులు అంటే జనులు పార్తా ఉండారు - పరుగెత్తుతూ ఉన్నారు అని అర్థం. పార్తా ఉండారు అనే మాట కన్నడంలోని 'ఓడ్తా ఇద్దారే' అను మాటను అనుకరించింది.

'యజమాన్లు' అనేపదం బాగా వ్యాప్తిలో ఉంది ఇంటి పెద్దను కన్నడంలో 'యజమాన' అంటారు. దీన్నే ఇక్కడి తెలుగు వాళ్ళు గ్రహించి దానికి యాజమాన్యాన్ని వహించారు. చూడండి ఈ ప్రయోగం. 'యాల్నో యజమాన్లు అట్లుంటారు'. యాలనో అంటే ఏలనో, ఎందుకో అని అర్థం. యజమాన్లు అనే పదం ఇంటిపెద్దకే కాకుండా ఏ పెద్ద మనిషికైనా వర్తిస్తుంది.

రండి, కూర్చోండి, తినండి అనే పదాలు రాండ, కూకొండ, తినండ అని ప్రయోగింప బడతాయి. అంటే పదంలో అంత్యఇకారం అకారాన్ని పొందింది సాధారణంగా ఈ మాటల్ని వైశ్యులే ఎక్కువగా ఉపయోగిస్తారు.

ఒకతను మరొక తనితో ఇలా ఇంటున్నాడు. 'కెలసము లేక దుడ్డుసిక్కేది సానా కష్టమాయ - పనిలేక డబ్బుదొరికేది చాలా కష్టమయ్యింది అని దీనికి అర్థం. ఇందులో మూడు కన్నడ పదాలున్నాయి. కెలసము, దుడ్డు, సిక్కేది. కెసలము అంటే పని, దుడ్డు అంటే డబ్బు, సిక్కేది అ టే దొరికేవి. చిక్కేది - సిక్కేది. కన్నడంలో సిక్కువుదు అంటే దొరకడమని అర్థం.

సిక్కేది అనేమాటని మరొక అర్థంలో కూడప్రయోగిస్తారు 'వాడునిన్న బజార్లో సిక్కిండా'అనేమాటకు వాడునిన్న బజార్లో కనించాడని అర్థం. కన్నడంలో ను ఇలాగే ప్రయోగిస్తారు. 'అవను నిన్నేదిన సిక్కిద్దా' అని.

చాలా రోజులతర్వాత ఇద్దరుస్నేహితులు ఒకర్నొకరు చూసుకొన్నారు. ఒక తను అన్నాడు 'యాలా సానా సన్నమయి నావు' అని.దానికి జవాబుగా 'బొలే' నీవు సానా దప్పంగా ఉండావ్లే' అవిరె డో అతను అన్నాడు. చిక్కిపోయావు అనడానికి సన్నమయినావు అని' లావు అనడానికి దప్పము అని వాడుకలో ఉన్నాయి. కన్నడంలో సణ్ణగాగిద్దియ అంటే చిక్కిపోయావని' దప్ప అంటే లావు అని వాడుక. ఈ రెండు కన్నడపదాలకు ముకారము చేర్చి సన్నము'దప్పము అని ప్రయోగిస్తారు.

'నువ్వేమి బేజారు పడొద్దు నేను ఉండాన్లే'అని అభయమిస్తున్నాడు ఒకమిత్రుడు అపునకు. బేజారుఅనేపదం హిందీ, వ్యవహారంలోనిది. కన్నడంలో ఈపదాన్ని అధికంగా ఉపయోగిస్తారు నువ్వేమి చింత చేయకు, నేనున్నానులే' అనే అర్థంలో వాడబడింది. బేజారు అనే పదం నెమ్మది లేక పోవడం' అనే అర్థంతో కూడ ప్రయోగంలో ఉంది 'యాలో బేజారుగా ఉండావు' అని ప్రయోగం. ఇదేపదం ఒక్కొక్క సారి 'విసుగు' అనే అర్థంలో కూడ వాడబడుతుంది. బేజారు చేసు కోవద్దండ ''అని ప్రయోగం.

ఆఫీసులో గుమస్తా 'బేజాన్ పనిచేసి సుస్తుఉంది,కాఫీ ఎత్తుకోనిరా' అని ప్యూన్ తో చెప్తున్నాడు. అంటే 'చాలాపనిచేసి అలసటగా ఉంది' కాఫీ తీసికొనిరా. అని దీనికిఅర్థం

బేజాన్ పని-చాలాపని సుస్తు-అలసట (tiredness) ఎత్తుకోనిరా-తీసికొనిరా

'అపొద్సు ఇంగారాలా 'నా తోన సెప్పిండా వస్సానని' ఒకతను అంటున్న మాటలవి. 'ఆ అమ్మాయి వస్తానని చెప్పి ఉండింది, ఇంకా రాలేదు' అని దీనికి అర్థం. సాధారణంగా పడుచు అనే పదాన్ని మధ్యవయస్కు రాలైన స్త్రీని అంటారు. పడుచు- పొడుచు- పొడుచు- పొద్సు వస్తాను అనేమాటను వస్సానని నాతో అనేమాటను 'నాతోన' అని ప్రయోగిస్తారు.

'అయ్యా వాండ్లు ఒస్తా ఉండారు, అని కొడుకు లోపల ఉన్న తండ్రినిసంబోధించి అంటున్నాడు. వాళ్ళు అనడానికి 'వాండ్లు' అనే పదం వ్యవహారంలో ఉంది. ఇది, వాడు పదానికి బహువచనం.

ఈ బద్దుమేష్టు సానా తిట్టిడ్సి, ఒక విద్యార్థి మరొక విద్యార్థితో అన్నమాటలవి.'

యాల నువ్వు సిక్కాపట్టే మాట్లాడ్తేవెమో-ఇది తోటి విద్యార్థి మాటలు. ఈ మాటల్లో రెండు కన్నడ పదాలున్నాయి. మేష్టు. సిక్కాపట్టే అనేవి. కన్నడంలో 'మేష్టు' అంటే ఉపాధ్యాయుడు. అలాగే 'సిక్కాపట్టే' అనేమాటను 'విపరీతం' అనే అర్థంలో వాడుతారు.

ఈ పొద్దు- ఈ ప్రొద్దు- ఈపద్దు. ఈబద్దు అంటే ఈ రోజు అనీ, తిట్టారు అనడానికి' తిట్టిడ్సి' అనీ ప్రయోగిస్తారు. తిట్టివిడిచారు- తిట్టిడ్సి కన్నడంలో కూడ ఈ క్రియా ప్రయోగం ఇలాగే ఉంటుంది 'బెయిదుబిట్రు' అని కన్నడ ప్రయోగం ఒక తండ్రికొడుకుతో అంటున్నాడు 'నువ్వాపని చేసిడు. ఆమీట కొచ్చి సూస్తా' నని. చేసేసెయ్యి అనే మాటను చేసిడు అని ప్రయోగిస్తారు. ఈ ప్రయోగం కన్నడ అనుకరణమే ఇదే మాటను కన్నడంలో 'మాడుబిడు' అంటారు. చేసివిడు-చేసిడు ఈ రకంగా క్రియాపదాలూ అనీ బెంగుళూరు తెలుగులో విలక్షణంగా కనబడ్తూంటాయి.

(ఆకాశవాణి, సౌజన్యంతో)

విముక్తి

గతాన్ని నెమరు వేస్తూ
మతాల మత్తు పానీయాల్ని సేవిస్తూ
ఆకలినీ : అప్పుల్నీ
ఆశలను పైకెత్తుకు పోయే ఆవేదనా సుడి గాడ్పుల్ని
పిల్లల ఏడ్పుల్ని తప్పించుకొంటోయి
సందేహాల చీకటి గూటిలో మత్తుగా నిద్రించే గొంగళి పురుగూ
గూడు పొడుచుకొని బయటకు వస్తే
నువ్వు స్వేచ్ఛగా ఎగిరే
సీతాకోక చిలుకవి.

—భాను

వాల్మీకి భార్య

'ఆడవాళ్ళకే అన్ని కష్టాలూ అన్నట్లు అందరి సానుభూతీ వాళ్ళ పట్లనే' అన్నాడు మారుతి విసుక్కుంటూ, ధుమ ధుమ లాడుతూ.

తెల్లబోవటం నావంతైంది. తుమ్మల్లో పొద్దు అంటారు అదుగో అలావుంది అతడి ముఖం. ఎర్రగా కందిపోయి. ఇతణ్ణెందుకు పలకరించాంరా బాబూ అనుకున్నేట్లు! ఎప్పుడైనా చూశారో లేదో తుమ్మ చెట్ల గుంపుల్లోంచి అస్తమిస్తున్న సూర్య బింబాన్ని. ఈ మధ్య పదిహేను రోజులాగా అసలు కనిపించలేదు. కనిపిస్తేనూ తప్పుకొనిపోయే తప్పునేనే మీ చేయ చేయలేదు. పై పెచ్చు నేను కనిపిస్తే ముఖం చాటు చేసుకోకూడదు. చాటంత చేసుకోవాలి మారుతి న్యాయంగా. దోసిలనిండా చిరు నవ్వులు నిండి పక్కలకి పొర్లిపోతుండగా, ఒకటోరెండో ఇంకా పెదవులకి అతుక్కొని వుండగా, నాకు దండం పెడుతూ సంతోషపడిపోవాలి. అదేం లేకపోగా రెక్క పుచ్చుకొని నేనే కాస్తఆగవోయ్! ఈ మధ్య కనిపించి చాలారోజులైంది అనాల్సి వచ్చింది. పాత బట్టకి ఎంత మంచి రంగు అద్దించినా, కళ కళ లాడనట్లు గావుంది అతడి ముఖం. నేనలాగా అతణ్ణి అడిన్న పార్కులో కలుసుకొని పలకరించడం ఇష్టం లేదులావుంది.

నాపట్ల మారుతి ఎందుకు కృతజ్ఞుడై వుండాలంటారా?!

అదేం పెద్ద కథకాదు. అతడికి రత్నమాల నిచ్చి వాళ్ళ వాళ్ళు పెళ్ళి చేయడానికి నేనేనండీ కారణం! అదా నేచేసిన తప్పు!! ఆఫీసు నుంచి అటే నడుస్తాను ఇంటికి. కాబట్టి కాసేపు ఆ చల్లని చెట్లు చూస్తూ, పువ్వులు చూస్తూ, ఆ పార్కులో ఆడుకొనే చిన్ని చిన్ని బుజ్జి బుజ్జి పిల్లల్ని చూస్తూ, పావుగంటో అరగంటో గడిపి ఇక లేస్తాను. కార్తీకం వచ్చేసింది. అన్ని అందాలు అమరి, అలంకారాలన్నీ పూర్తిఅయిపోయిన పెళ్లి కూతురులా వుంది ఒక పున్నాగ. ఈ యేడే పూలు పూసిందేమో. ఇద్దరు ముగ్గురు చిన్నారులు పూలేరుతూ నవ్వుకుంటున్నారు. ఆకాశంలో హరివిల్లు తమ కోసమే అనుకొని ఆనందించే అమాయకులు. సృష్టిలో కల్లా అందమైన వస్తువులు.

ఏమిటి నీ బాధ అన్నాను నేనుకూడా కొంచెం గాంభీర్యం ప్రదర్శిస్తూ మారుతిని ఒక చోట కూలేసి.

— వం జా శ్రీ

'అవునండీ మగవాడికేమీ చికాకులూ చీదరలూ, కష్టాలూ, నిష్ఠూరాలూ ఉండవా? ఆఫీసులుంటాయి. అసూయపడే వాళ్ళు ఉంటారు. ఏ విధంగానైనా మనస్సునొప్పిస్తే, కష్టపెడితే, అవతల వాణ్ణి బాధిస్తే, అసూయనంతా ప్రదర్శించుకుంటే, తమ జన్మ సార్థకమైపోయినట్లుగా ప్రవర్తించే మనుషులుంటారు. వీళ్ళతోనే బతకాలి కదా! 'ఇదంతా ఏమిటి? విసుగు పుట్టించి బోర్ చేసే రచయిత లాగా' అన్నాను మధ్యలో కల్పించుకుంటూ.

'వినండి మరి. అధికారికి ఆపేక్షా, దయ్యానికి దయా వుండకూడదని ఒకదైనా సామెత. ఆఫీసుల్లో ఏ కష్టాలూ వుండవనుకుంటారు ఈ ఆడవాళ్ళు', వాళ్ళకుండవేమో-అని నా బదులుతానే నాలిక కరుచుకున్నాడు. మారుతి మంచివాడు. పెద్దమాటలు మాట్లాడడు.

'అదికాదండీ. నామనస్సంతా వికలమై, చికాకనిపించి మొన్నొక రోజున నేరుగా సినిమాకి వెళ్ళాను. అదంతకన్నా తలనొప్పి అని తెలుసుకోలేక, మీరు నాకు కట్టబెట్టిన మెళ్ళో గుదిబండ మూడురోజులు సాధిస్తుందేమండీ! ఒకరోజున సిగరేట్ కాల్చానని తెలుసుకుందిట. అదో గొప్ప అపరాధం. నాతి చరామి భంగమై పోయినట్లు. నాకుచాలా అసహ్యమేసింది ఎందుకలా వున్నారు మీకిటైంది అని నెమ్మదిగా అడగవచ్చు కదా. అదీ మీ మాట విన్నందుకు నా కొరిగిన సుఖం, హాయి; అని నన్నే ఆ రత్నమాలను చూస్తున్నట్లు చూశాడు. (కొరుక్కుతినడు కదా - కోపంతో !) రత్నమాల మంచి పిల్ల. తెలివైంది. మరి ఎందుకిలా మగడనే పదార్థాన్ని అర్థం చేసుకోకుండా బాధిస్తున్నది! మగువ మనసు ప్రశ్నార్థకం!

'ఇది నీ మంచికే నయ్యా మారుతీ. మహా పురుషులందరికీ ఇల్లాళ్ళ వల్లనే జ్ఞానోదయమైంది. కిరాతుడు మహర్షి కావడానికీ, సోక్రటీస్ తత్త్వవేత్తగా మారడానికీ, తులసీదాసు రామాయణం రాయడానికీ కారణం, లేదా ప్రేరణం ఎవరో తెలిస్తే నీవింత బాధపడవు' అన్నాను.

అతడి కర్థమైందో కాలేదో - ఎవరికి అర్థమైనా కాకపోయినా నేనేమీ చెయ్యలేను. ఎదురుగా చిన్నిచివ్వి చిన్నారులు. పున్నాగ పూలకాడ లూదుతూ. పూల రెక్కల బుడగలు బుగ్గల మీద టప్ మనిపించుకుంటూ.*

టుప్ టీక :- అదండీ కథ. మహర్షి కాకపూర్వం 'నీ పాపంతో నాకు పనిలేదు. నీవు దోచితెచ్చే సొమ్ము మాత్రమే నాక్కావాలి'. అందిట వాల్మీకిగారితో ఆయన ఇల్లాలు. అర్థం చేసుకోవడం అనే పెద్ద పెద్ద కబుర్లు వన్ వే ట్రాఫిక్ కాకూడదు. వర్తమాన సమాన సమాజంలో ఎన్నో ఉద్రిక్తతలు. ఇవి ఆలూ మగడూ ఇద్దరికీ అర్థం కావాలి- అంటారు మంజుశ్రీ.

వచనకవిత - రూపాంతరాలు

కవిత్వం రాజ ప్రాసాదాలు దాటి, జమీందారీల ప్రహరీ గోడలు దూకి ఛ్ఛందస్ నియమాల కట్టుదిట్టాల ఆభరణాలన్నీ ఎగిరిపోగా పరిగెత్తి పరిగెత్తి సామాన్యుడి బ్రతుకు లాగే అదీ సామాన్యమై పోయింది. ఇప్పుడది ఊహల్లో విహరించదు. మనిషి బ్రతుకు లోంచి ఉదయిస్తుంది. నాగరికత పేరుతో అది కృత్రిమంగా వుండదు – మనిషి మాట్లాడినట్టే సాఫీ గాసుఖంగా వుంటోంది.

తమ వల్లనే వచనకవిత్వం నిలబడిపోతోందని ఒకరనుకుంటే, వచనకవిత్వానికిక కాలం చెల్లిపోయిందని ఒకరు చెబుతున్నారు. నిజానికి ఈ రెండిట్లో దేనిలో కూడా పూర్తి నిజం లేదు. వచన కవిత్వం పుట్టుకగూర్చి, దాని పరిణతి గూర్చి మనకు తెలుసు. అది యింత ఉధృతంగా వ్యాపించడానికి, స్థిరపడడానికీ కారణం వుంది పాండిత్యం సంపాదించడం, కవిత్వం రాయగలగడం రెండు వేర్వేరువిషయాలుగా విడదీయబడడం వల్ల, పాండిత్యం లేని సామాన్యులుకూడా వారి స్పందనని, భావననీ అదిమిపెట్టలేక వారికి అందుబాటులో వున్న వ్యావహారిక భాషలో వీలయినంత బలంగా చెప్పే ప్రయత్నాలు చేశారు. ఫలితంగానే ఏ బంధాలూ లేని వచన కవిత్వం ఊపిరి పీల్చుకుంటోంది. అందుకు దోహదం చేస్తున్న ఈ తరం కవులు చాలామంది భాషా పాండిత్యం లేనివారే.

పాండిత్యానికి బానిసలా కట్టివేయబడకుండా కవిత్వం, స్వేచ్ఛగా స్వచ్ఛంగా అనుభవంలోంచి, ఆవేదనలోంచి, తపనలోంచి, తపస్సులోంచి పుట్టుకొస్తోంది. అంతేకాని ఎన్నికల ప్రచారంలా ఎవరో కొందరు ప్రచారం చేయడంవల్ల వచన కవిత్వం ప్రజాదరణ పొందిందనుకోవడం వట్టి భ్రమ. కవిత్వంలో ఉద్యమాలున్నాయి. ఉద్యమాల్లో కవిత వుంది. కాని వచన కవితే-ఒక ఉద్యమం అని ఎవరైనా అంటే మాత్రం సబబు కాదు. ప్రకృతిలో పరిణామం సహజం. సమాజంలో మార్పు సహజం. సాహిత్యంలోనూ అంతే-

వచన కవితా ప్రక్రియ కవిత్వాన్ని జనానికి దగ్గరగా తీసుకెళ్ళింది. ఏదో ఒకరిద్దరి ఆత్మాశ్రయ కవిత్వం తప్ప, వచన కవిత్వం సగటు సామాన్యుడికి అర్థమయ్యేట్లుగా వచ్చింది. వస్తోంది. అందుకు కారణం వచన కవిత్వం చాలా వరకు సగటు మనిషి సమస్యల్ని చిత్రిస్తూ రావడమే. ఛందోబద్ధ కవిత్వంలో కావ్యాలొచ్చినట్లుగా (శివారెడ్డి ఆసుపత్రి గీతం తప్పించి) వచన కవిత్వంలో రాలేదు. ఎక్కువ భాగం ఖండికలే వచ్చాయి. తెలుగులో వచ్చిన వచన కవిత్వం పరిశీలిస్తే కవులు టెక్నిక్ గురించి తపించిపోయినట్టుగా అనిపిస్తోంది. ఈ విషయంలో ముం

దుగా తిలక్‌ను నిలబెట్టి ఆ తరువాత హేమాహేమీలను ఎవ్వరిని నిలబెట్టినా ఫరవా లేదు. ఈ ఆధునిక తెలుగు కవుల్లో ఎవరి ప్రత్యేకత వారు ఏర్పరుచుకున్నా, చాలా మంది ఒకే పరిధిలో వున్నట్లు కనిపిస్తారు. కాని బైరాగి, పఠాభి లాంటి వారి దారి వేరు ముఖ్యంగా పఠాభి. కవిత్వంలో ఎంత విదూషకుడు లాగా కనిపిస్తాడో, దర్శకుడుగా చలన చిత్రాలలో అంత తీవ్రతను కనబరుస్తాడు. ఈ విధంగా రెండు రకాల మనస్తత్వాల్ని ప్రదర్శించే కవులింకా వున్నారు. వారి గూర్చి పరిశీలన జర గాలి. (కాళోజీ కవితా విశ్లేషణకు కూడా ఎవరైనా పూనుకుంటే బావుండును)

వచన కవిత్వంలో నాటికలు, పీఠికలూ వచ్చాక మొదటిసారిగా కథలు చెప్పి మెప్పించాడు శీలా వీర్రాజు. గోదావరి మాండలికంలో రంధి సోమరాజు, తెలంగాణా జీవద్భాషలో దేవరాజు మహారాజు వచన కవిత్వం రాసిన వాళ్ళు. రంధి సోమరాజు సంకలనాలు ప్రజల భాషలో చాలా వచ్చాయి. మరో వైపు కవిత్వాన్ని విలోమంగా చెబుతున్నాడు నగ్నముని.

అభ్యుదయ భావాలతో ప్రగతిని, చైతన్యాన్ని కాంక్షిస్తూ వస్తున్న కవిత్వాన్ని కొద్దిగా మళ్ళించి ఉద్యమం వైపు తీసుకెళ్ళారు కొందరు. ఒక గొప్ప ఉద్దేశ్యంతో ఉద్యమాన్ని నడిపించేందుకు వచ్చిన వస్తున్న వచన కవితలో ఆవేశాల వేడికి కవిత కరిగి వచనం ఎక్కువ శాతం మిగిలిపోయి వుండడం విచారకరం. ఇదే ఉద్దేశ్యంతో వచన కవిత కన్నా పాటలు ఎక్కువగా రాయబడుతున్నాయి. రావాల్సిన అవసరం కూడా వుంది. అయితే ఇక్కడ కూడా కవితా స్పర్శవున్న పాటలే జనానికి బాగా చేరుతూ వుండడం గమనించాల్సిన విషయం. ప్రజల భాషలో, ప్రజల బాణీలో గొప్పగా పాటల్ని రాస్తున్న వాళ్ళు - గద్దర్, వంగపండు, భూపాల్ లాంటివాళ్ళు.

ప్రయోజనాత్మకంగా వస్తున్న వచన కవిత్వం ఇటీవల అకస్మాత్తుగా సైజు మార్చుకుని మినీ కవితలుగా పేలుతున్నాయి. ప్రయోజనంలో మార్పు లేకుండా, పాతకడి కాలం వృధా చేయకుండా ఎంతో ఆలోచనాత్మకంగా వస్తున్న ఇప్పటి మినీ కవిత ఎవరో వద్దంటే ఆగదు. అది యువతరం ఆలోచనని, ఆవేశాన్నిచాలా సూటిగా చెబుతోంది. ఏక కాలంలో సర్వశక్తుల్నీ ఒక బిందువు వద్ద కేంద్రీకరించి ఉత్తి బలంగా యిచ్చే కరంటే స్ట్రోక్ లాంటిది-మినీ కవిత. ఇదే వచన కవితకు నేటి రూపం. వచన కవిత ముందు ముందు ఏ రకంగా మారుతుందో చూడాల్సివుంది.

—దేవరాజు మహారాజు

"వివాహ వ్యవస్థ చలం దృష్టి"

—నాళేశ్వరం శంకర్.

వివాహ వ్యవస్థ కొన్ని వేల సంవత్సరాలనుంచే అడమగను అంటిపెట్టుకుంది. ఈ వ్యవస్థ పవిత్రతను, దాని ధర్మాన్ని, దాని గొప్పతనాన్ని, దాని సంస్కారాన్ని ఆనాటి నుంచి ఇరువది శతాబ్ది వరకు సాహిత్యంలో పొగడ్తలతో పైకెత్తి తగిన పీఠం వేసి ఊడిగం చేసిన మన తెలుగు కవుల్లో ఎందరో లెక్కేయడం కష్టం.

వివాహం స్త్రీ పురుషులు ఏర్పరచుకొనే ఒక ఒప్పందం. వ్యక్తిని, సమాజాన్ని ఏకం చేయడానికి నీతిని, ధర్మాన్ని తరతరాల కొరకు నిలబెట్టడానికి ప్రతిరూపమే వివాహ వ్యవస్థ. ఈ పెళ్ళి, కాలం జరుగుతున్న కొద్దీ ఈశ్వరునితో, మతాలతో, కులాలతో, సంఘంతో ముడిపెట్టుకొని రోజు రోజుకు దాని పరిధిని విశాలం చేసుకుంది. ఒకప్పుడు క్రమబద్ధత కొరకు, నీతి కొరకు, కట్టుబాట్ల కొరకు నిర్మించుకున్న వ్యక్తిచేత దాస్యం చేయించుకుంటూంది వ్యక్తి స్వేచ్ఛను వివాహ వ్యవస్థ పూర్తిగా తన అధీనంలోకి తీసుకోగానే వ్యక్తి మోహం, ప్రేమ ఉరితీయ బడ్డాయి అప్పటి నుంచి తిరుగుబాటు మొదలయింది.

'వివాహ వ్యవస్థ ఉండాలా ? వద్దా ? అన్నది చాల విశాలమైన సమస్య ముఖ్యంగా భారతీయులకు. మన తెలుగు సాహిత్యంలో విధవా వివాహాలపై చర్చ, సంస్కరణ జరిగింది కాని వివాహ వ్యవస్థలో ఉన్న లోపాలపై జరగలేదు. దాన్ని చలం చేతపట్టి సాహిత్య పరంగా, వ్యక్తి పరంగా, సమాజ పరంగా వివాహ వ్యవస్థను ఆలోచించి, దాన్ని పూడ్చి పెట్టడానికి, మరో నవ్య భవంతిని నిర్మించడానికి ఆవేశంతో, బాధతో, హృదయంతో ముందుకు వచ్చాడు.

వివాహ వ్యవస్థను పూర్తిగా చలం దూషించలేదు దానిలో ఉన్న కుళ్ళునూ, కంపునూ, క్రౌర్యాన్ని విపరీతంగా దూషించాడు. "ఇంకా వివాహం సంస్కారం; ఈశ్వరుడే చేస్తున్నాడు. మోహం పోతే, అది మనుషుల లోపం కనక ఒకరిని వొదలడం పాపమంటారు" అనేది చలం సహించలేడు.

"భర్తలేమీ దేవుళ్ళుకారనీ, సంసారాలేమీ శాశ్వతంగా యీశ్వరుడేర్పరచలేదనీ, ఇవన్నీ అబద్ధాలనీ ప్రతిస్త్రీకి తెలుసు. నీతులూ, పురాణాలూ, ధర్మాలూ బోధించే దొంగ నోళ్ళలో తప్ప ఈ సంసస్కారం పవిత్రత లోకంలో ఎక్కడా లేదు." అని చలం వివాహ వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని స్త్రీకిచ్చిన సందేశం.

కుక్కకి యజమానుడు యెంత అవసరమో ఆడపిల్లకి మొగాడు అంత అవసరం అనేది పెళ్ళివల్ల జరగ పద్దంటాడు. "భర్త వద్దని యేడుస్తున్న చిన్నపిల్లకి బలవంతంగా సంఘం కటపెడుతుంది. భర్త కావాలని గోల పెడుతున్న వితంతువులకి నిరాకరిస్తుంది" ఇది సంఘం చేస్తున్న అన్యాయం. ఇలాంటి సమస్యలు ఎత్తి పొడిచి చూపడమేకాకుండా పురుషులు పెళ్ళి ఎందుకు చేసుకుంటున్నారు. స్త్రీలు ఎందుకు చేసుకుంటున్నారు అనేవి సమగ్రంగా ఆలోచించి ఇలా వివరించారు. పురుషులు "కామం తీర్చుకునేందుకు. వొంటరితనం పోవడానికి, జబ్బులో వృద్ధాప్యంలో సేవ చేయడానికి, వంట, చాకిరి చేయించుకోడం కోసం, ఉన్న సంతానం కోసం, ముందు సంతానం కోసం" అని తెలిపాడు.

స్త్రీ విషయానికి వస్తే "అల్లరి చేయకుండా అజ్ఞాను బద్ధులయ్యేందుకు, కూడూ, గుడ్డా ఇచ్చేవాడుండటానికి, పెద్దవాళ్లు యేరి తెచ్చి కట్టడం, మోహం పోయిన తరువాత కూడా యిద్దర్ని పెళ్ళివల్ల అతికించడం" లాంటివి స్త్రీ చేసుకోవడానికి కారణాలు. అయితే ఈ సమస్యలు లేకుండా స్త్రీ పురుషులు పెళ్ళి చేసుకోవడం లేదా ? అనే ప్రశ్న రావచ్చు. ముఖ్యంగా చలం దేనిలోనైనా వున్న కుళ్లనే విమర్శించాడు. అందువల్ల స్త్రీ పురుషులు నిజమైన ప్రేమతో యిద్దరు యిష్టపడి పెళ్ళి చేసుకుంటే చలం దీవించాడే కాని విమర్శించలేదు.

జంతువులకున్న స్వేచ్ఛ మనషులకు లేదు, అనారోగ్య వంతుడైన భర్త నుంచి తప్పించుకునే స్వేచ్ఛ భార్యకు లేదు. ఆ స్వేచ్ఛ వివాహ వ్యవస్థలో వుండాలంటాడు.

"యెవరు ఆ రాత్రి గదిలోకి వొస్తే వారే భర్త, వారే భార్య యిట్లా కొత్త వాళ్ళిద్దర్ని గదిలో పశువుల్లాగు బంధించడానికి పవిత్రమైన వివాహ మని పేరు" అన్నాడంటే పశుత్వం వివాహంలో వుండటమేమరి.

వివాహ వ్యవస్థని ఈశ్వర నిర్మితమని, సంఘ నిర్మితమని, వ్యక్తి నిర్మిత మని మూడు భాగాలు చేసినారు. పెళ్ళి ఈశ్వర నిర్మితమని చలం వొప్పుకోలేదు. సంఘ నిర్మితమును ఆలోచిస్తే సంఘక్షేమం కోసం వ్యక్తి త్యాగం చెయ్యాలి అనేది కొంత వొప్పుకోలేదు. వ్యక్తి స్వేచ్ఛవల్ల సంఘం ధ్వంసం కాకూడదు. అలాగే సంఘక్షేమం కోసం వ్యక్తి ధ్వసం కాకూడదు అనేది చలం దృష్టి.

ఇకపోతే వ్యక్తి నిర్మితంపై మొగ్గు ఎక్కువగా చూపించాడు. అంతేకాక దీనిలో స్త్రీ, పురుషులను భిన్నంగా ఆలోచించాడు. అయితే వ్యక్తులు వివాహ వ్యవస్థను యెందుకు సమర్థిస్తారంటె "మోహం వల్ల స్త్రీగాని, పురుషుడుగాని, ప్రత్యేకంగా తన హక్కు కావడానికి, ఒకరు ధనము సంపాయిస్తే రెండో వాడు

పిల్లలు బతకడానికి" అంటారు. ఇవేగాక కామం తీర్చుకోవడమే ప్రధానమైతే వివాహం తప్పనిసరి. సంఘానికి మరీ అవసరం.

"భర్తనువొదిలి స్త్రీ యింకొక పురుషుడితోవుంటే దాన్ని వ్యభిచారమన్నారు. ఈనాడు ప్రభుత్వం కోర్టు ద్వారా యింకొకసారి పెళ్ళి చేసుకోవచ్చు అనగానే ఆ స్త్రీ పవిత్రత అయిపోయింది" మరి కోర్టును బహిష్కరించరేమి అంటాడు.

అసలు పెళ్ళికి మోహం ప్రధానం. కులం, రూపం, ధనం, విద్య ఇవిముఖ్యమైనప్పటికి మోహం స్త్రీ పురుషులకు లేకపోతే ఆ పెళ్ళి కలకాలం ఉండటంకష్టం.

స్త్రీ నేటి సమాజంలో మృగం వలె తినడం కనడం స్థితిలోవుంది. పురుషుడి వుపయోగార్థం స్త్రీ ఆత్మను, ఆదర్శాలను, హత్యచేయడంవల్ల పురుషుడు స్త్రీ పై అధికారం చెలాయిస్తున్నాడు స్త్రీకి స్వేచ్ఛ లేకపోవడం వల్ల తన కన్నవాళ్ళు తెచ్చిన వాణ్ణే కట్టుకోవలసి వస్తుంది. శరీరాన్ని అప్పచెప్పి కనవలసి వస్తుంది. ఈనాడుకూడా పురుషుడి వేడి తగ్గించుకోవడానికే స్త్రీని ఉపయోగించుకుంటున్నాడు. ఇలాంటివి ఎన్నో వివాహ వ్యవస్థలో కలిసిపోతున్నాయి.

ప్రపంచంలో ఆనందంగా బ్రతక లేకపోవడానికి చలం కారణాలు చూపించాడు వివాహ వవ్యస్థలోవున్న భౌతికమైన నీతిని, సంప్రదాయాన్ని, ఆచారాన్ని చూపించాడు. వివాహ వ్యవస్థ న్యాయస్థానంలోకి వెళ్ళి దానిలో జరుగుతున్న అన్యాయాలను చిత్రించారు అయితే శాసన కర్తగా మాత్రం వివాహ వ్యవస్థను కూలగొట్టించలేదు వివాహంలో మోహానికి, ప్రేమకు తగిన స్థానం లేకపోవడంతో చలానికి ఎక్కడలేని కోపం వచ్చింది. అసలు వివాహ వవ్యస్థనే పూడ్చిపెట్టాలనుకున్నాడు. వివాహాన్ని దూషించడానికి బలమైన కారణం కొందరికి దానివల్ల జరుగుతున్న అనర్థాలే. రెండవది ప్రేమకు తగిన స్థానం సమాజం, వివాహ వ్యవస్థా యివ్వకపోవడమే అనాలిమరి.

వాఙ్మాలిం

"చీకటి గుడిసెలు పడకిళ్ళు
చెమటలు సెంట్లు
బీడీలు, చుట్టలు అగరొత్తులు
బండరాళ్ళు తలగడలు
చింకి చాపలు పరుపులు
నిట్టూర్పులు అస్త్రాలు
మరి ఆనందానికేంలోటు?"

—డాక్టర్ విరియాల రామకృష్ణ

'ఎందుకు?...'

నరసింహం 'మీరు కోరిన పాటలు' వింటున్నాడు.

తన కొడుకురాజు పెద్ద గొంతుకతో పాఠాల్ని వల్లె వేస్తున్నాడు.

రాజు ఎనిమిదో క్లాసు చదువుతున్నాడు

అరగంటసేపు పాటలు వినడంలో లీనమైపోయిన నరసింహం పాటలు ఐపోయింతర్వాత తన వంశోద్ధారకుడి లౌడ్‌స్పీకర్ విప్పించక పోవడంతో అ వేపు చూశాడు.

ఎనిమిదిన్నరకే ముసుగు తన్నేసిన పుత్రరత్నాన్ని చూసి మండిపడుతూ- "ఏరా! పరీక్షలవుతున్నాయ్ కదా?"

అప్పుడే మంచంవేక్కేశావేం!? అరిచాడు.

ఆ అరుపుకి వులిక్కిపడి కళ్లువిప్పిన రాజు తండ్రి అంతర్యాన్ని గ్రహించి అన్నాడు. "అన్నీ వచ్చేసునాన్నా!"

"అన్ని పాఠాలు వచ్చేశా!?...." ఆశ్చర్యంగా-నమ్మలేనట్లుఅడిగాడు తను.

"అఁ, వచ్చేసు నాన్నా! ఆ ప్రశ్నలకు జవాబులు చూడకుండా రాసేయగల్ను!"

"పుస్తకంలోవున్న పాఠాలన్నింటికీ జవాబులు చూడకుండా రాసేయగలవా!?...."

"అన్ని పాఠాల సంగతెందుకు నాన్నా!?...."

"మరి అన్ని పాఠాలు రాకుండే ఎలా!?...."

"అబ్బే, ఎందుకు? ఆ ప్రశ్నలకి జవాబులొస్తే చాలుకదా?"

"ఆప్రశ్నలంటే ఏ ప్రశ్నలురా!?.."

"అదే నాన్నా! మా స్కూలు మాస్టారిచ్చిన పది ప్రశ్నలు! ఆ ప్రశ్నలకి జవాబులు చూడకుండా రాసేయగలను"

"అంటే...రేపు పరీక్షలో రాబోయే ప్రశ్నలు మీకు ముందే చెప్పేశారా!?.."

"అవున్నాన్నా! పబ్లిక్ పరీక్షకాదుగదా? ఎలాగూ ఫెయిలయే ప్రసక్తే లేదు. అటెండెన్సుంటే పాసై పోతాం. అందుకని అన్ని ప్రశ్నలు మాకు ముందే చెప్పేశారు"

'అలాంటప్పుడు - డిటెన్షన్ పద్ధతి లేనప్పుడు మరీ పరీక్షల తతంగంవెందుకో!?...." స్వగతంలా అనుకుంటూ ఆశ్చర్యపోయాడు నరసింహం.

—సుస్మితారమణమూర్తి

పుస్తక సమీక్ష : కొన్ని అంశాలు

ఘట్టమరాజు
అశ్వత్థ నారాయణ

విమర్శనా సాహిత్యానికి దోహదమిచ్చే పుస్తక సమీక్ష గురించి, తెలుగులో దాని స్థితిగతుల్ని గురించీ ఇటీవల కొంత మంది బుద్ధిజీవులు ఆలోచనను ప్రేరేపించే విధంగా వ్రాస్తూ వుండటం- భవిష్యత్తులో పుస్తక సమీక్షకు మంచి రూపు దిద్దగలదని ఆశిద్దాం.

తెలుగు పత్రికల్లో పుస్తక సమీక్ష ఎట్లున్నదో కొంత గంభీరంగా ఆలోచించే ప్రయత్నం చేయడం ఈ వ్యాసకర్త ఉద్దేశ్యం. పుస్తక సమీక్ష పోషకుల పత్రికా సంపాదకులు. తెలుగులో అసంఖ్యాకంగా వెలువడుతున్న పుస్తకాలను పరిచయం చెయ్యడమో లేదా సమీక్ష చెయ్యడమో పత్రికలలోని పుస్తక సమీక్ష అనే శీర్షిక ద్వారానే జరుగుతూ వున్నది తెలుగులోని అన్ని పత్రికలూ పుస్తక సమీక్ష శీర్షికను నిర్వహించటం లేదు. అచ్చవుతున్న నూర్లకొలది పుస్తకాలు పాఠకులకు తెలియవలెనంటే అన్ని పత్రికల్లోనూ పుస్తక సమీక్ష తప్పని సరిగా నిర్వహింప బడాలి. ఈ కార్యము నిర్వహింప బడుతున్న పత్రికల్లో (చాలా) చివరి పేజీలు ఒకటో, అరో మాత్రమే ఇందుకై కేటాయింప బడుతుండడం శోచనీయమైన విషయం. అచ్చయిన వందలాది పుస్తకాలు పాఠకులకు తెలియకుండా అజ్ఞాతంగా ఉండిపోతున్నాయి. పెద్ద చిన్న ప్రచురణ సంస్థలు యథాశక్తిగా విజ్ఞాపనల ద్వారా పరిచయమవుతున్నా, కావ్యాలు, నాటకాలు వ్యాసాలు, విమర్శలు వ్రాసి, సొంతంగా ప్రచురించుకొనే వ్యక్తుల రచనలు పాఠకులకు గోచరమయ్యేది కష్టంగా వుంటున్నది. సాహితీ గ్రంథాల్ని ప్రచురించుకొన్నవారు ఒకటి రెండు పెద్ద పుస్తక పంపిణీదారులకు తమ గ్రంథాల్ని ఇచ్చినా, వారు వీటి అమ్మకం, విజ్ఞాపన పట్ల ప్రత్యేక ఆసక్తి కనపరచరు. ఏతా వాతా తేలేదేమంటే కథలు, నవలలు తప్ప మిగతా సాహిత్య గ్రంథాలు అజ్ఞాతంగా, అపరిచితంగా ఉండిపోతాయి. ఉత్తమ రచనల్ని చేసిన రచయితా ప్రోత్సాహం లేక దిగాలు పడిపోతాడు, ఉత్తమ రచనలకై ఎదురు చూసే పాఠకుడు నిరాశతో కృంగిపోతాడు.

పుస్తక సమీక్షకు ప్రాధాన్యమిచ్చే కొన్ని పత్రికల్లో ముఖ్యమైనవి భారతి, ఆంధ్రపత్రిక (దిన) స్రవంతి, ఆంధ్రజ్యోతి (దిన) మొదలైనవి. మిగతా పత్రికలు పుస్తక సమీక్షను నామ్‌ కే వాస్తేగా నడుపుతూ వున్నాయి.

పుస్తక సమీక్ష అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. ఒక పుస్తకం యొక్క వస్తువు, రచనా విధానం రచయిత ఉద్దేశ్యం- అతడు సాధిం

చిన సాఫల్య వైఫల్యాలు ఇవి ఆ పుస్తకం ఆధారంగా చర్చిస్తే సమీక్ష అవుతుంది. అట్లుగాక ఒక పుస్తకంను సమీక్షిస్తూ ఆ రచయిత యొక్క ఇతర రచనలను, ఇతరులు ఆ విషయ సంబంధంగా రచించిన పుస్తకాలను చర్చిస్తూ విస్తారంగా, లోతుగా చర్చిస్తే 'విమర్శ'. 'సమీక్ష' పుస్తకం యొక్క సర్వాంగీణ పరామర్శ కాక, కొన్ని కోణాలనుంచే దర్శింపబడినది; పుస్తకం యొక్క బాగోగులపై స్థూలంగా కిరణాలను ప్రసరింపచేస్తుంది. విమర్శ పుస్తకాన్ని పలుకోణాల నుంచి దర్శిస్తూ, లోతుగా వెళ్ళి గుణదోషాల్ని చర్చిస్తుంది. అయితే స్థలావకాశం వలన, ప్రతిభావ్యుత్పత్తుల వలన పుస్తక సమీక్షనే పుస్తక విమర్శగా రూపొందింపగల ప్రతిభావంతులైన సమీక్షకులు లేకపోలేదు. అరుదని మాత్రమే చెప్పుతున్నాను.

తెలుగులో పుస్తక సమీక్ష అధ్వాన్నంగా వున్నదని వేరేచెప్పనవసరంలేదు. పుస్తక సమీక్ష స్థాయిని పెంచాలంటే ముఖ్యంగా పత్రికా సంపాదకులు ఈ విషయం పట్ల శ్రద్ధాసక్తులు, సదభిరుచి కలిగివుండాలి. వార, పక్ష, మాస, దిన పత్రికలు కథా సంపుటాలను, నవలలను సమీక్షింప చేస్తున్నాయి. వందలకొలది పుస్తకాలు వస్తున్నా, ఏడాదికొకటో, రెండో మంచి నవలలు, కథా సంపుటాలు మాత్రమే వస్తున్నాయి. మన కథా సాహిత్యం (Fiction) లో చెత్తా చెదారమే ఎక్కువగా వస్తున్నది. వీటికే 'పుస్తక సమీక్ష' లో ప్రాధాన్యమిస్తున్నారు పత్రికా సంపాదకులు. 'పుస్తక సమీక్ష' శీర్షికలో నవలలు, కథా సంపుటాలతోపాటు విధిగా ఇతర సాహిత్య ప్రక్రియకు చెందిన రచనలకు తావు ఇవ్వాలి. ఒక నవల, ఒక కథా సంకలనం, ఒక కావ్యం - అథవా ఒక సంచికలో నవల, కథా సంపుటాలు, మరో సంచికలో వ్యాసం, నాటకం, జీవిత చరిత్రలు-ఇలా వైవిధ్యానికి స్థానం ఇస్తే బాగుంటుంది. పెద్దపెద్ద ప్రచురణ సంస్థలు అడ్వర్టయిజుమెంట్లు ఇస్తున్నాయి అనే కారణంగా ఆ సంస్థల ప్రచురణలకే 'పుస్తక సమీక్ష' లో సహంభాగము లభిస్తుండటం మనం చాలా దిన, వార పత్రికల్లో చూడవచ్చు. రచయితలే కష్టపడి అప్పోసప్పోచేసి ప్రచురించుకొన్న పుస్తకాలకు ఈ శీర్షికలో ప్రధాన్యమిస్తే పత్రికలు విజ్ఞాపనలను పోగొట్టుకొనవని నేను భావిస్తున్నాను. నవలలు కథా సంపుటాలు బాగున్నా, లేకపోయినా ప్రభుత్వ గ్రంథాలయాలు, సర్క్యులేటింగ్ లైబ్రరీలు కొంటూనే వున్నాయి, కొంటాయి కూడా. అలాంటివి చదివే సగటు పాఠకుల సంఖ్య ఎక్కువ కాబట్టి, ఇక అడ్రసు లేకుండా అజ్ఞాతంగా అంతరించిపోయేది ఉత్తమమైన సాహిత్య గ్రంథాలు మాత్రమే.

తెలుగులోని పుస్తకసమీక్షకులు - వీరొక ప్రత్యేకమైన తెగ. పత్రికా సంపాదకుల నాశ్రయించుకొని, పత్రికా కార్యాలయానికే వెళ్ళి, అథవా ఎవరి ద్వారానో

తెప్పించుకొని సమీక్షలను రాసి పడేస్తుంటారు. వీరికి పత్రికలో ఇవ్వబడే స్థలావకాశం చాలా తక్కువ, ప్రతిఫలం కూడా దానికి తగినట్లే వుంటుంది లెండి-ఒక్కొక్క సమీక్షకు ఐదో-పదో! ఎన్ని పుస్తకాలు సమీక్షిస్తే వందరూపాయలు కళ్లచూడగలుగుతారు మన సమీక్షకులు? పెద్దమొత్తం కళ్లచూడాలంటే చాలా చిన్న పుస్తకాల నాధ్యమైనంత త్వరలో సమీక్షించి పారేస్తారు. పుస్తకం యొక్క సత్తా తేల్చిచెప్తే పౌరుషనష్టమని, ప్రశంసావాక్యాలు పలుకుతూవుంటారు. ప్రత్యక్షంగా వెళ్ళి పత్రికా సంపాదక స్వాముల్ని దర్శించుకొని, వారి కరుణా కటాక్షాలను నాలుగు కాలాల పాటు పొందగోరే సమీక్షక సార్వభౌములు వారి కనుసన్నల మెలగుచు పొగడమన్న పుస్తకాలను పొగడుతూ, తెగడమన్న పుస్తకాలను తెగడుతూ కాలం గడుపుతూవుంటారు. తెలుగుపత్రికల్లో కానవచ్చే సమీక్షకుల పేర్లను పరిశీలిస్తే ఎన్నో చిత్ర విచిత్రాలు గోచరమవుతాయి. సాహిత్యఅకాడమీ ప్రచురణల్ని ఆకాశాని కెత్తేవారే కొందరు. వాటిలో మంచివాటినికూడ దుమ్మెత్తిపోసేవారే మరి కొందరు. అకాడమీ ప్రచురణను ఆకాడమీ ఎగ్జిక్యూటివ్ మెంబరే సమీక్షించి(?) పొగడ్తల అగడ్తలను నింపటం మనంచూసే మామూలు విషయమే. పుస్తకాల్లో సత్తా తక్కువున్నా, వాటిని సంక్షిప్తంగా సమీక్షించకుండా, పేజీలకు పేజీలు వ్యాస రూపంగా వ్రాసి పత్రికా సంపాదకులనుండి ఎక్కువ పారితోషకాన్ని, రచయితల లేక ప్రచురణకర్తల నుండీ మరే రూపంగానో లాభం పొందే సమీక్ష కమ్మన్యులు తెలుగులో ఎక్కువవుతున్నారు తెలుగులోని కొన్ని పత్రికలు ముగ్గురు నలుగురు అస్థాన సమీక్షకులను పోషించి, తెలుగు గ్రంథాల (మంచి) పట్ల తీరని అన్యాయం చెకూర్చుతున్నాయి. ఈ సమీక్షకులు కథ, నవల, వ్యాసం విమర్శ, నాటకం — అన్ని సాహితీ గ్రంథాలనూ వీక్షించి సమీక్షించి పారేయగల పండిత ప్రకాండులు. ఉత్తమ రచనలను అధమ రచనలుగా, అధమ రచనలను ఉత్తమ రచనలుగా ఉద్ఘోషింపగల అఘటన ఘటనా సమర్థులు।

తెలుగులోని పుస్తక సమీక్ష దుస్థితిని చూసే కొంతమంది, రచయితలు, ప్రచురణ కర్తలు తమ పుస్తకాలను సమీక్షకై పంపటమే మానుకొన్నారు। కాని ప్రచురించిన తర్వాత ప్రపంచానికి తెలియచెయ్యవలసిందే కదా। విధిలేక కొన్ని పత్రికలకు మాత్రమే పంపి ఊరట చెందుతున్నారు। ఆ పత్రికల్లో న్యాయమైన సమీక్షలు రాకపోతే, లేక సమీక్షే రాకపోతే వారిబాధ వర్ణనాతీతం.

తెలుగులో పుస్తక సమీక్ష ఘోరంగా వున్నదనే విషయం మనం కొంత వరకైనా తెలుసుకొన్నామంటే అజ్ఞానపు టంధకారం నుంచి వెలువడాలనే తపన మనలో బయలు దేరిందన్నమాట! ఈ తపన తీవ్రమై, జ్ఞాన ప్రకాశంలోకి తీసుకెళ్ళే కాలం సమీపిస్తున్న దన్నమాట।

పుస్తక సమీక్ష స్థాయి పెరగాలంటే కొన్ని సూచనలు.

1. దిన, వార, పక్ష, మాస, ద్వై. త్రైమాసిక పత్రికలన్నీ విధిగా పుస్తక సమీక్ష' శీర్షికను నిర్వహించాలి.
2. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలకు తగిన ప్రాధాన్య మివ్వాలి.
3. ఆయా సాహిత్య ప్రక్రియల్లో కృషిచేసిన వారికి సమీక్షా కార్యం అప్పగించాలి.
4. సమీక్షకులకు పారితోషికం ఇవ్వాలి.
5. పాత కాపులతోనే పని జరిపించుకోకుండా. కొత్త కాపులకు ప్రోత్సాహ మివ్వాలి.
6. హిందీలో 'ప్రకర్' 'సమీక్షా' 'సమీక్షా సందర్భ' అనీ. ఇంగ్లీషులో 'బుక్ రివ్యూ' అనీ పుస్తక సమీక్షకే నిర్వహించబడుతున్న పత్రికలున్నాయి. తెలుగులో అలాంటి పత్రిక పుట్టుక రావాలి. ఒకటి మాత్రమే కాదు రెండు మూడైనా.

ఆ శుభదినం త్వరలోనే అవతరిస్తుందా?

హిందీ మూలం :
సర్దార్ ఆలీజాఫరీ

జైలులో ఒక రేయి

అనువాదం :
బిగాళ్ళ

వృక్షంలా రేయి
నిరుత్సాహంగా తారలు
చిక్కని అంధకారము
దటమైన చిట్టడవి
అలసిన బాటసారి
ఎక్కడ చూచినా బాకుల్లా
యెదలో గుచ్చుకుంటున్నాయి.

గత కాలపు కష్టాల రాక్షసులు
ఖైదీలను కుదిపేస్తున్నాయి
భీతితో విశ్చేష్టులై
నిర్జీవులై నిల్చున్నారు.

తమ నల్లని భీకరమైన కోరలతో
వెలుగు రేఖల్ని మింగేస్తున్నాయి
విరక్తి నీడల జాడలు
త్రాచుకళ్ళను కరిచేస్తున్నాయి
ముళ్ళ పొదలో గాయాల్తో
నేను బాధపడుతున్నాను.
ఈ రేయి నిన్నటి రేయిలా
అంధకార కర్మాగులతో
నింగి నేల కలిసినట్టు కనబడే
చోటుదాటి దాక్కుంది
కాని—
అది నన్ను జయించుట అసాధ్యము
నా చూపుల్లో నా ప్రేయసి
రూపం దాసివుంది
ఈ వెన్నెల నా నవ్వుల
ఆకాశానికి అంటించబడివుంది
నీ ధ్యానంలో నా జీవితమే
పున్నమియై పూసింది.

రాజా చేప

కథానిక

మ. రా. శాస్త్రి

వంతెనమీద నడుస్తున్న వరదమ్మకి అరవై యేళ్ళుంటాయి. వరదమ్మ ఒణికిపోతూ, ఊగిపోతూ, తూలిపోతూ నడుస్తూంది. కాళ్ళు జారుతున్నాయి. నిలదొక్కుకుంటూ నడుస్తూంది. వంతెన తాటి పట్టెలు వర్షానికి చీకి విరిగిన పేళ్ళు కాళ్ళలో దిగుతున్నాయి. "ఈ వంతెన మరి బాగుపడదు! బాబా!" అనుకుంటూ వంతెనదాటి యివతల పడింది వరదమ్మ.

వంతెన అవతల పాలెంలో వరదమ్మ మకాం. వంతెన దాటి చాకిరీకి ఊళ్ళోకి రావాలి. నాలుగయిదు యిళ్ళలో. పాచి పనులు చేసుకుంటుంది. ఇంటికి రెండు గంటలు చాకిరీ. నెలకి అయిదు రూపాయిలు వస్తాయి. రోజుకి ఎనిమిది పది గంటల చాకిరీకి, నెలకి పాతిక రూపాయల జీతం గిట్టుబాటు.

వరదమ్మ మొగుడు పెళ్ళయిన కొత్తలో ఓ కొడుకు పుట్టేక రంగం వెళ్ళి మరిరాలేదు. ఓ సంవత్సరం గోదావరి వరదలో కొడుకు కొట్టుకుపోయేడు— దిక్కులేని పక్షి వరదమ్మ. పాలెంలో చిన్న పాకలో ఉంటుంది.

శరీరం ముడతలు పడిపోయింది, చేతులమీది చర్మం వేలాడుతూంది. జుట్టు పండిపోయి, బాగా రేగిపోయి వానలో తడిసిన పిచ్చిగూడులా ఉంది. నత్తు ముక్కున వేలాడుతూంది. అది బంగారమో, ఇత్తడో అందులో ఉన్నవిరాళ్లో, గోతులో చెప్పడం కష్టం. ఛాతి ఎండిపోయింది— పక్క ఎముకలు లెక్కపెట్టేలా ఉన్నాయి. పొట్ట జావలా బట్టకట్టుమీదికి జారిపడింది. ఎండి పెట్టిన చర్మం బరబరలాడుతూంది. ఒంగి నడుస్తూంది.

వంతెనదాటి, గుడిదాటి, తాతయ్య హోటలు సమీపించింది వరదమ్మ. చిన్న పాకలో, వీధిమీదకున్న పొయ్యిమీద పెనంమీద పెసరట్లు వేస్తున్నాడు తాతయ్య. పెనంమీద పడ్డ పెసరట్టు వరదమ్మ మనసు పట్టి. అలారం గొలుసులా లాగగానే వరదమ్మ ఆగింది— రెండు పెసరట్లు తాతయ్య దగ్గిర తినాలని వరదమ్మ కోరిక. రెండు పావలాలు అర్ధరూపాయి అవుతుంది. సొదరుకంత ఖర్చు చేసే తాహతు తనకేది? తరిగి పోసిన ఉల్లిచెక్కు, పచ్చిమిరపకాయ ముక్కలు, పెసరచోవి, వేడిపెనం కనిపించాయి. తింటున్న జనం కనిపించారు. కమ్మటి వాసన ముక్కులో దూరుతూంది. పెనంకింద నిప్పుసెగలాగ, లోపల కోరిక సెగ ఎగసింది— ఎగసిన కోరిక మీద నీళ్లుజల్లి, ఓమారు ముక్కుపుటాలు రాసుకుని, ముందుకు కదిలింది, "వరహాలమ్మ మనవడికి నీళ్ళు పొయ్యాలి!" అని తలచుకుంటూ—

తోవలో రాజా ఎదురయ్యాడు— మాసిన ముతక పంచని మోకాళ్ళపైకి ఎగగట్టి బరువుగా నడుస్తున్నాడు. చేతిలో

యి త్తడి చెంబు నీళ్ళు, భుజంమీద తువ్వాలు మాసిన గెడ్డం- అతని వేషమే చెబు తూంది అతను ఎక్కడికి బయలు దేరిందీనూ!

"బాబా! నా పనే జేశావు?" అంది వరదమ్మ ఒణుకు గొంతుతో.

"ఎధవ ముండ! ఇప్పుడేనేటి? నీ ప్రశ్నలు! పొద్దున్నే ఎధవ శకునం! ఎళ్ళెళ్ళు! తర్వాత చూద్దాం!" హడా వుడిగా వెళ్ళిపోయాడు రాజా చెంబులో నీళ్లు చింది పడకుండా పట్టుకుని.

రాజా వార్డు మెంబరు; రాజకీయప్పు రుగు, ఊళ్ళో గుడి పెత్తన మరమ్మత్తులు, పూజలు, సేవలు జాతర్లు ఒకటేవిటి? ఆఖరికి మేస్టర్ల బదిలీల్లో కూడా రాజా చెయ్యి ఉంటుంది. తల్చుకుంటే ప్రెసి డెంటుని దింపగలడు. రాజా అంటే ప్రెసిడెంటుకి ప్రాణం.

రాజా పొరుగూరు వెడితే, తెల్ల ఖద్దరు పంచి, ఖద్దరు లాల్చీ, అంచుల కండువా, కాళ్ళకి చెప్పులు ధరిస్తాడు. "గద్దరు జావారే కావాలి!" అని మావగార్ని పీడించి పుచ్చుకున్న జావారుని అపు రూపరంగా వినియోగిస్తాడు ఆగస్టు పది హేనుకీ, జనవరి యిరవై యార్యారుకి ఖద్దరు టోపీ నెత్తికెక్కుతుంది.

రాజా భోజనం అయి వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటూ ఆరోజు పేపరు తిరగేస్తున్నాడు.

"ఏం బాబా! రాజాబాబు! ఏటయి నాది నాపని? పుచ్చుకొన్నదబ్బు పుచ్చు కుని, కుర్చీలో కూకని కునికిపాట్లు పడతన్నావు- నాకు మనియార్డర్లు వస్త యన్నావు. నే బతికుండగా ఒస్తయా? చచ్చినాక వస్తయా? నే ముష్టెత్తినదబ్బు నీ యదాన్నకొట్టి ఇప్పుడేడ స్తన్నాను!" వరదమ్మ తన బాధని వెళ్ళగక్కింది.

పేపరు కింద పడేసి, వరదమ్మను చూస్తూ-

"ఎధవ ముండ! ఏమిటి? నాయ దాన్నకొట్టేవా? మాటలు జాగ్రత్తగా రానీ! ఇంట్లో కూర్చున్నదాన్ని పిలిచి దిక్కులేని ముసలిముండవి! నీకు వృద్ధాప్యము పెన్షను ఒస్తుంది దాని పద్ధతి నే చెబుతాను నీకు డబ్బువచ్చేలా చూస్తాను-అని చెప్పేను కదూ? అందు కోసం నువ్వు నన్ను యదం గిదం అంటున్నావు-అనకేంజేస్తావు?" బొంగురు గొంతుతో వరదమ్మ మీద తిరగ బడ్డాడు.

"అవునయ్యా! ఏడాదయిపోనాది, నాదగ్గిర వంద రూపాయలుచ్చుకుని. కరుసులు అయిపోయినాయిగాని, నాకు డబ్బు యిప్పించేవా? డబ్బిచ్చుకునీ నీకు దండవెట్టాలన్న మాట!"

"అయితే అవుద్ది! జీవితం అంతా సర్వీసు చేసి రిటైరయి, రావలసిన పెన్షను రాక, ఎంతడబ్బు ఖర్చు పెడు తున్నారో మన రావయ్య మేస్టారినడుగు డబ్బు పోసినా వాళ్ల కాగితాలు చూసే దిక్కు లేదు! ప్రెసిడెంటుగారు ఆరు సార్లు హైద్రాబాదు వెళ్లేరు బోడి ముండవు! నీ లెక్కేమిటి?"

అట్టాగయితే నా సొమ్ము నాకు పారెయ్యిబాబా! నా వృద్ధాప్యం ఎల్లిపోతానే వుంది!"

జేబు లెట్టుక ఊరేగుతున్నాననుకున్నావేటి? తాలూకా కచేరి సుట్టూ త్రాంపైసార్లు తిరిగేను. ఒస్తది. ఒస్తె నెలకి పాతికో పదిహేనో, గాడకింద పంది కొక్కులా కూర్సుని సచ్చేదాకా తింటావు నాకు కానీ యిస్తావా? ఈ రాజా కనిపిస్తాడా?"

"మా బాబే! నీరు పండించి పబ్బం గడుపుకుంటావు!"

చేతులెత్తి మెటికలు విరిచి. విసవిస నడుచుకుంటూ వెళ్లిపోయింది వర దమ్మ.

X X X

లోపల ఫోనులో మాటలు విని పిస్తున్నాయి. బయట బల్లమీద చతికిలబడ్డాడు రాజా. సమితి ప్రెసిడెంటుతో మాట్లాడుతున్నారు ప్రెసిడెంటుగారు

రాజా చెవులు రిక్కించి వింటున్నాడు

అలాగేనండి, ఆదెంత పనండె? అయ్యెబాబోయ్! మీరందర్ని కూడ గట్టుకున్నాక, నా ఒక్కడిదేముందండే? అలాగేనండి! మాటంటే మాటేనండి! మరి తిరుగుండదండి! ఎటొచ్చినా, నా సపోర్టు మీకేనండి. మీరీసారి కూడా సమితి పెసెంటు అయిపోయారనుకోండి. అయ్యెబాబోయ్ ఎంతమాట?.... ఏముందండె? ఏంలేదండి! గతంలో మీకు సెప్పిండేనండి! అదే మా వూరి వంతెన– అలాగేనండి, ఆమాట సాలండి! ఏదో మనిద్దరి టైంలోనూ ఈసారి ఆ పనయిపోతే, నాకూ మా ఊరోళ్ళకి కూడా సేటి స్పేక్సనండి! ఉరండి.... సెలవండి! పెట్టేస్తానండి. ఆయ్!"

ఫోను క్లిక్‌మంది. రాజా లోపలి కెళ్ళేడు

"రావయ్యా! రాజా! ఇప్పుడే నీ ఇసయం మాట్లాడేను! నువ్వు వచ్చేవు!"

రాజా 'అబద్ధం' అని తెలుసున్నా నిజంలా నమ్ముతాడు! అదే రాజకీయం! ఎదురు కుర్చీలో కూర్చున్నాడు. తన విషయాలుతో బైట ఉన్నాయి అందులో ఏ విషయం మాట్లాడత? ఆఖరికి ఆ వంతెన విషయం కూడా తన విషయం కింద జమకట్టగల సమర్థుడు ప్రెసిడెంటు! దానివల్ల తనకి లాభంఏమిటి?

"ఏ విషయవండి? నా పెన్షను గురించే నాండి? నన్ను రాజకీయ బాధితుడుగా గుర్తింపించి, నెలకో నూరు ముట్టజెప్పిస్తా నన్న విషయమేనాండి?" అన్నాడు అనుమానంగ.

"అవునయ్యా! అదే! అయిపోతుందన్నాడు!"

"అవుతుందంటారా?"

"అదేనిటయ్యా? నీకేవన్నా పిచ్చా? ఆయన తలుసుకుంటే ఏటవదు? ఆయన బామ్మరిది జిల్లా పరిసత్తు సేరిమేను. ఆయనతో సెప్పయినా, సంతకం ఎట్టిస్తాడు. అంతెందుకు? మన పక్కని ఆ పంతులికి యిప్పించలేదూ? ఆ పంతులు మొన్నటిదాకా ఎర్ర పేంటూ ఎర్ర చొక్కా, ఎర్ర రుమాలు వాడేవోడు! నువ్వు రంగుమార్చి తెల్లగుడ్డ లేసుకో!

నీ కుపకారం సేస్తనన్నాడీయన। మర్చేడు। సేసేడు।। ఎదురుగుండా సూసీ, నమ్మకపోతే ఎలాగయ్యా రాజా?"

రాజా మనసు నిజం అని నమ్మింది కాని, యిప్పుడు తను వచ్చింది వరదమ్మ పనికోసం। అదే చెప్పేడు రాజా। ఓ వంద దాని దగ్గర తిన్నట్టు కూడా ఒప్పేసు కుని, పరువు నిలబెట్టమన్నాడు-

"అరిసీ।"అని ఆ తర్వాత, "ఆదెంత పనిలే?" అన్నాడు ప్రెసిడెంటు। వెంటనే ఆర్ డీవోకి రింగ్ అయింది.

x x x

అయింది. వంతెన పనికి। ప్రెసిడెంటు గారి మేడ పనికి ఒకేసారి పునాదిరాయి పడింది రంగుల మేడ. ఎత్తయిన వంతెన ఆవూరికి ఎంతో అందాన్ని. అభి వృద్ధిని తెచ్చిపెట్టడం ఖాయం.

రాజా రాజకీయ బాధితుడుగా గుర్తిం పబడే వంకూ, రాజకీయాల్లో బాధపడాలి తప్పదు.

వరదమ్మ వృద్ధాప్యపు పెన్షను-మొదటి పదిహేను రూపాయలు అందుకో కుండానే-పరమపదం అందేసుకుంది.

ఇది నా స్వంత రచన: దానికి అను వాదం, అనుసరణా కాదు అముద్రితం.

జీవిత విషవృక్షం

బండతనం- మొండితనం: ఈ
రెండూ జీవితాదర్శాలు చేసుకొని
రెండుపూలు; ప
న్నెండు కాయలు కాస్తోంది
నీజీవితవృక్షం.
ఇంకా-
జీవితయజ్ఞంలో
అనురాగం- అభిమానం-జాలి, న్యాయం,
ధర్మం
ఆఖరికి ఆలు బిడ్డలు
ఆహుతి చేసుకొని-
ఏఎండాలేకుండ; ఏవానా కురవకుండానే
ఏఅండలేకుండ;
ఏపూలు పూయకుండానే
(అనురాగపువెచ్చదనం - కన్నీరుకురవ
కుండ-హృదయం వికసించలేకుండానే)
కాయలుకాస్తోంది
నీజీవితవృక్షం.
అవన్నీపిచ్చికాయలు. పుచ్చువిత్తులు,
ముళ్ళశాఖలు
అని తెలిస్తే
ఆ చెట్టును కొట్టేస్తుందిదేశం
అంతవరకేనువు క్షేమం.

—శివ

జానపద కథా నిర్మాణ సూత్రాలు

—డా॥ నాయని కృష్ణకుమారి

ఏ జాతి చరిత్రను పరికించినా, అది కథల భాండారమే. లేఖనంతో సంబంధం పెట్టుకోకుండా కేవలం మౌఖిక ప్రచారంమీద ఆధారపడి, తరతరాల నుండీ బ్రతుకుతూ వస్తున్న కథలు ప్రతి జాతికి కాణాచుల వంటివి. ఆ కథలు, ఆ జాతి ఆదిమస్థితినీ, అప్పటి ఆలోచనా విధానాన్నీ, అటువంటి ఆలోచనలు పుట్టడానికి అవసరమైన అప్పటి సాంఘిక స్థితిగతుల్నీ, ఆ జాతిలో క్రమ పరిణతంగా కనిపించే అభివృద్ధినీ, చాటి చెప్పడానికి సమర్థాలుగా ఉంటాయి. ఏ కథనైనా మనం విశ్లేషిస్తే ఆ విశ్లేషణవల్ల, ఆ కథలో అంతర్గతంగా ఉండే కథకుని అనుభవమో, లేదా కథకుడికి సంబంధించిన మొత్తం జాతియొక్క అనుభవమో, ఒకానొక ఉద్రేక పూర్ణమైన విధానంలో బుద్ధివైభవాన్ని ఉపయోగించి చాతురీ మహితంగా చెప్పబడినట్లు కనిపిస్తుంది.

Levy Strauss "కథకో భాష, అనగా సాంకేతిక భాష ఉన్నట్లుగా మనం నిర్ధారించకోగలిగితే, ఆ భాష చరిత్ర కాలానికి చెంది, మరుగుపడిన ఎన్నో విషయాలను వివరించగలదు" అని అభిప్రాయపడ్డారు అంతటితో ఆగక కథాగమనంలో 'గతి తార్కిక పద్ధతి' ఉన్నట్లుగా భావించాడాయన.

ఇక్కడ చిన్న వివరణ అవసరం. కథానిర్మాణంలో సాధారణంగా మనం విడగొట్టగలిగే విధంగా రెండు భాగాలుంటాయి. దీనికి ప్రాచీనకథా, జానపదకథా, ఆధునికకథా, అన్న భేదం లేదు. ఆ రెండుభాగాలలో ఒకభాగంలోని వస్తువో, సన్నివేశమో, వాటిమీద అధికారంకల మనుష్యుడో రెండవ భాగానికి చెందిన వస్తు సన్నివేశ, పాత్రలతో, వైరుధ్యాన్ని కలిగిఉండడం కనిపిస్తుంది. అనగా ఒకభాగం రెండవ భాగంతో సంఘర్షణను పొందేదిగా ఉంటుంది. ఈ సంఘర్షణ విచ్చిపోయి ఒక భాగం రెండవ భాగంమీద విజయాన్ని సాధించి, కొంతముందుకు నడవగానే, తిరిగీ అటువంటి సంఘర్షణ ప్రాప్తం కావచ్చును. కాబట్టి కథ జరగడమంటే అడుగడుగునా అడ్డంకుల్ని ఎదుర్కొంటూ, వాటికి పరిష్కార మార్గాల్ని తీర్చుకుంటూ, గమ్యం చేరడం, ఎదురయ్యే అడ్డంకుల స్వరూపంలోనూ, వాటికి తీర్చే పరిష్కార మార్గాల్లోకూడా, కొంత పరిణతీ, కొంత మార్పు, వచ్చి చివరకు అవి పూర్తిగా లేకుండా పోవడమో, లేక నామావశేషంగా అయిపోవడమో జరుగుతుంది. సమాజపరంగా ఈ పద్ధతే గతి తార్కిక పద్ధతి.

భారతీయ సాహిత్యకులు, కథా నిర్మాణాన్ని గురించి ఒక్క మాటయినా చెప్పలేదు. కాని నాటక లక్షణాలను పర్యాలోచిస్తూ, అక్కడ కథాగతిని అవగాహనం చేసుకునే ప్రయత్నంలో, అర్థ ప్రకృతులు అయిదింటినీ వివరించడం జరిగింది. ఈ అయిదింటిలోనూ, పతాకా ప్రకరులను ముఖ్యకథకు అనుసంధించకుండా కేవలం, బీజ, బిందు, కార్యాలనే గ్రహించడం జరిగింది. బిందువులో ఆటంకాలున్నా, అవి ప్రధానాలు. వాటిని తొలగించడానికి బీజాన్ని పునః ఉద్ధరించడానికి మాత్రమే బిందువు ఉపయోగిస్తుంది. ఈ పద్ధతి కథా శరీర నిర్మాణాన్ని సూచించేదిగా కాక, కథా వస్తుగతిని నిర్దేశించేదిగా కనిపిస్తుంది.

కథా శరీర నిర్మాణాధ్యయనం ఆధునికమైనది. సమాజ శాస్త్ర సిద్ధాంతాలను Strauss కథా నిర్మాణానికి అన్వయించడానికి ప్రయత్నిస్తే Alen Dundes కథాగతిని శాస్త్రీయమైన పద్ధతిలో విశ్లేషించడానికి ప్రయత్నం చేశాడు. సాధారణంగా ఏ కథయినా ఒక అనిశ్చిత పరిస్థితిలో నుండి మెల్లమెల్లగా ఒక నిశ్చిత పరిస్థితిలోనికి జరిగిపోయి స్థిరత్వాన్ని సంతరించుకుంటుందని ఆయన వాదన. ఈ అనిశ్చిత పరిస్థితి కథ ఆరంభం కావడానికి ముందుండేది అభావం (Lack). అభావంనుండి కథ ఆరంభమై, అవాంతరాలను నేర్పుగా అధిగమిస్తూ అభావ నివారణ (Lack liquidation) ను సాధించడమే కథాగతియొక్క ముఖ్యధ్యేయం. కథ పరిపూర్ణత్వం చెంది స్పష్టాకారాన్ని సంతరించుకునేది అభావనివారణ వలననే.

ఉదాహరణకు, బాలనాగమ్మ కథలో-తల్లి భూలక్ష్మీదేవి తనకు లేని సంతానం కోసమై జటంగిముని ఆశ్రమానికి వెళ్ళి, మునిని ప్రసన్నుణ్ణి చేసుకుని సంతాన వరాన్ని పొందుతుంది.

ఇక్కడ సంతానం లేకపోవడమనే అభావం (L) నుండి సంతానాన్ని పొందడమనే అభావ నివారణవరకూ (LL) జరిగేకథ భూలక్ష్మీదేవి కథ. ఈ రెండు అంశాలకూ మధ్య ఎన్నో అవాంతర సంఘటనలు కలగడమే కథా నిర్మాణం. ముని సంతానార్థమై 'బాలమామిడి చెట్టు పళ్ళు ఏడు మాత్రమే కోసుకొమ్మనీ, ఒక్కసారి మాత్రమే కోసుకొమ్మనీ చెప్తాడు' ఈ రెండు అంశాలనూ అధిగమించరాదనేది ఆంక్ష. ఏ కథలోనైనా ఒక ఆంక్ష ప్రవేశించిందనగానే దాని అర్థం, ఆ ఆంక్ష అధిగమింపబడడానికే; అధిగమించడం అనేదే కథలో లేకపోతే, ఆ ఆంక్షను ప్రవేశపెట్టవలసిన అవసరం రాదు. ఇది వ్యాకరణంలోని నిషేధ సూత్రం వంటిది, అందువల్ల ఆంక్ష వెంటనే అతిక్రమణకూడా ఉండకతప్పదు. జటంగి ముని మాటల్ని అతిక్రమించి భూలక్ష్మీదేవి ఒడినిండా పండ్లు కోసుకుంటుంది. కిందకు దిగిచూస్తే ఒళ్ళో ఏడే పళ్ళు. తిరిగి ఆమె చెట్టెక్కి మళ్ళీ ఒడి నింపుకుంటుంది. ఆ విధంగా ఆవిడ రెండు విధుల్ని అతిక్రమించింది.

అతిక్రమణవల్ల పర్యవసానం ఉండకతప్పదు. మన కథలో అతిక్రమణకు పర్యవసానంగా నాగేంద్రుడు పుట్టనుండి బయటికివచ్చి భూలక్ష్మీదేవి కంఠాన కాటందుకోబోతాడు.

నిజంగా ఆవిడ ఆ క్షణాన నాగేంద్రుడి కాటువల్ల మరణిస్తే, కథాసూత్రం చివరవరకూ రాక మధ్యలోనే తెగి, కథ అసంపూర్ణంగా ఆగిపోతుంది.కథా నిర్మాణం పరిపూర్ణంకాదు. అనగా అభావనివారణకు కథలో స్థానం ఉండదు.

అందువల్ల, ఆంక్షను అతిక్రమించడంవల్ల కలగబోయే ఫలితాలనుండి తప్పించుకునే ప్రయత్నం కథా నిర్మాణంలో తప్పనిసరి అంశం.

భూలక్ష్మీదేవి నాగేంద్రుణ్ణి వేడుకుని, తాను పెనిమిటి మరణం ఒప్పని కారణాన, ఏడుగురు ఆడబాలల్ని సంతానంగా అంగీకరించి వెళ్ళిపోతుంది.

ఇప్పుడీ కథ నంతటినీ నిర్మించే సూత్రాన్ని ఇలా తయారుచేయవచ్చును.

అభావం —ఆంక్ష — ఆంక్షాతిక్రమణ—పర్యవసానం—ఫలితాన్ని పొందకుండా తప్పించుకునే ప్రయత్నం —
అభావ నివారణ :

ఈ సూత్రానికి Allen Dundes వాడిన ఇంగ్లీషు మాటలు, Lack——Interdiction——Violation——Consequence——Attempted escape —Lack Liquidation.
దీన్నే సూక్ష్మీకరిస్తే

L —> I —> V-C—> AE—> LLఅనేది కథానిర్మాణ సూత్రంగా తయారవుతుంది.

ఇక్కడ కథ అనేది అభావానికీ అభావ నివారణకూ మధ్య జరిగే ఇంత తతంగం.

దీన్నే వెనక Levy Staruss చెప్పిన గతి తార్కిక పద్ధతిలో వివరిస్తే ఒక అస్థిరత్వాన్ని నివారించే ప్రయత్నం అడ్డంకులు -> అడ్డంకుల్ని అధిగమించడం ->స్థిరత్వం. ఒక్క తెలుగుకేగాక ప్రపంచంలో ఏజాతికి సంబంధించిన కథలకైనా ఈ నిర్మాణ సూత్రం అన్వయించడానికి వీలు కలుగుతుంది.

అయితే పరిణామవశాన కథల్లో వచ్చే మార్పులవల్ల సూత్రాలను కూడా చిన్న చిన్న మార్పులు అవసరమౌతుంటాయి.

మనకున్న జానపద కథల్ని వింగడించిచూస్తే వాటిని నాలుగు స్థూల విభాగాలుచేయడానికి వీలవుతుంది. అవి,

1. (ఏ) సృష్టి నిర్మాణక్రమం (బి) వస్తువుల స్వభావ వివరణకు సంబంధించిన కథలు.

2. దేవతల కథలు.

3. వీరుల కథలు.

4. పేరంటాళ్ళ కథలు – ఈ అన్ని విభాగాల్లోనూ మౌలికంగా పురాగాథాంశం (Mythical element) ఇమిడే ఉంది.

మొదటి విభాగానికి చెందిన కథలు వెనుక వివరించిన L ⟶ LL అనే Dundes సూత్రానికి లోబడేవే.

ఉదాహరణకు :– భూమి ఎట్లా పుట్టింది అనే ప్రశ్నమీద ఆధారపడి "దేవుడు తన బొచ్చె (ఎదుర్రొమ్ము) మీది మన్ను నలిచి దాన్ని పెద్ద రొట్టెనుచేసి నీళ్ళలోకి విసిరేస్తే, ఆ రొట్టె గట్టిపడి భూమిగా మారింది" అనే జవాబు ఒక కథ రూపంలో మనకు లభిస్తుంది.

ఇక్కడ భూమి లేనప్పటి అభావం. ఆ అభావాన్ని నివారించడం అనే రెండే అంశాలు ప్రముఖాలు. అభావ నివారణకోసం, కథ చెప్పేవాడి కాల్పనికమైన ఆలోచనాశక్తి పై రెండింటి మధ్యా వర్తితమౌతున్నది. భూమి లేకపోవడమనే అభావం నిజమైన అభావంకాదు. అనగా తొలి మనుష్యుడనుభవించిన అభావం కాదు. కాని, తనకు సంబంధించిన జాతి ఎప్పుడో అనుభవించి ఉండవచ్చునని. ఆదిమ మానవుడు భావించిన అభావాభాసం. ఇక్కడ అభావ (L) అభావ నివారణల (LL) మధ్య అంశలూ, అంశా వ్యతిక్రమణలూ, పర్యవసానాలూవంటివి ఉండవు. కథ ఈ విధంగా, L, LL ల మధ్య తిరిగేంత చిన్నదైతే, ఆ కథను మనం అతి ప్రాచీన కాలానికి చెందిన మౌలికమైన పురాగాథగా నిస్సందేహంగా అంగీకరించవచ్చును. ఇది నిర్మాణానికి సంబంధించిన విషయం.

అయితే, పురాగాథ ఇటువంటి నిర్మాణంవలన నిర్దేశించే భావం ఏమిటి అని ప్రశ్నించుకోవచ్చును. కథాంతర్గతమైన భావం, మొదట మనం కథకు చేసిననాలుగు భాగాలలో నాలుగు రకాలుగా సాక్షాత్కరిస్తుంది.

1. సృష్టి, స్వభావ వివరణ గాథల్లో, నిర్మాణక్రమం అందించే భావం. ఆదిమ మానవుడు తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి తానుగా చేసే కాల్పనికమైన, లేదా ఊహాత్మకమైన, ప్రయత్నం. ఇక్కడ భావ నిర్మాణ సూత్రం–తెలియని తనం, ఊహ, పరిష్కారం–అనే అంశాలమీద ఆధారపడి ఉంటుంది.

ఇక్కడ భూమి ఎట్లా పుట్టింది? అనే తెలియని ప్రశ్నకు దేవుడి రొమ్ము మీద మన్నువల్ల పుట్టిందనే ఊహాత్మకమైన జవాబులో సందేహచ్ఛేదం సాక్షాత్క

రిస్తుంది. అయితే ఉపనిషద్ధోరణిలో, దేవుడి రొమ్ముమీద మన్ను ఎట్లా పుట్టింది? అసలు దేవుడెవరు? అన్న పరిణతమైన ఆలోచనాక్రమం కథ పుడుతున్న తొలిరోజుల్లో ఉండడానికి ఆస్కారం లేదు. అందుకే ఇక్కడ L, LL ల మధ్య ఏమీ లేకపోవడం సంభవించింది.

ఈ పద్ధతిలో ఒక స్వభావ వివరణ గాథను కూడా మనం పరిశీలించ వచ్చును.

కంటికి కనిపించే ఆకాశం ఎంతో ఎత్తున అందకుండా, నీలంగా ఉంది. దాన్ని గగనమనీ, శూన్యమనీ, అనేంత పరిణత బుద్ధి ఆనాటి మనుష్యుడికి లేదు. అది అందకుండా ఉన్నదనే దాని స్వభావాన్ని సమర్థిస్తూ ఒక కథ పుట్టింది.

ఒక ముసలమ్మ ఇళ్లు చిమ్మి దుమ్ము ఆకాశంవేపుకు విసిరేసింది. [ఇప్పటికీ రెండుచేతులతోనూ దుమ్మెత్తి విసురుగా అవతలకు విసిరేయడం మనుష్యుల స్వభావమే.] అప్పుడు ఆకాశం తనకు తగిలేంత కిందకుండేది. తన మీద దుమ్ము పొయ్యడం కోపకారణమై, ఆకాశం పైపైకి ప్రయాణం సాగించి, ఎవరికి అందని ప్రదేశంలో ఆగిపోయింది.

అయితే ఇక్కడ Dundes అంచనా ప్రకారం అభావానికి అర్థం ఏమిటి? ఆకాశం లేకపోవడమంటూ లేదుకదా అనే ప్రశ్న రావచ్చును ఆకాశం తలకు తగిలేంత కిందుగా ఉందన్న స్థితే ఒకవిధంగా అభావస్థితి. అనగా ఇక్కడ ఆకాశం అందకుండా ఎక్కడో ఉందనే స్థితి లేకపోవడమే అభావం. అది ముసలమ్మ చర్య వల్ల నివారితమై, ఈ కథ మళ్ళీ L-LL ల మధ్య తిరుగ గలుగుతుంది.

[వి వే చ న సౌ జ న్యం తో]

ముందడుగు

జరిగి పోయిన "నిన్న"
సాధించాలనుకున్నది
ఏమీ సాధించలేక పోయాననే ఆవేదనతో
జరగబోయే "రేపు"
తప్పక సాధించాలనే ఆలోచనలచే
జరుగుతున్న నేటిని వ్యర్థంచేస్తే
నీకు చివరకు మిగిలేది
నిన్నటి ఆవేదన
రేపటి ఆలోచన
అందుకే...
జీవితంలో నీవనుకున్నది
సాధించాలంటే
నిన్న సాధించ లేనిది
రేపు సాధించాలనుకున్నదీ
నేడే ప్రయత్నించు.

—రేవూరి రాజేష్.

రచయితలో బోధకుడు

"అవంతి"

"పాఠకులను విద్యావంతులుచేయాలనే తపన రచయితకు అనవసరం. ఏ విషయాన్నైనా బోధించాలనుకుంటే ఓ వ్యాసం రాస్తే సరిపడుకుంది కదా? దాన్ని తిప్పితిప్పి కథగానో, నవలగానో మలచవలసిన పనేమిటి?" – అనడిగే వాళ్ళు మనకు తరుచు తగులుతూనే వుంటారు.

ఇది ఇప్పుడే కొత్తగా ఎదురైన ప్రశ్నకాదు. రచనకి సామాజిక ప్రయోజనం లేదు. అక్కర్లేదు–అనే వాదానికి ఇది పాఠాంతరం తప్ప మరేంకాదు.

నిజం ఆలోచిస్తే, మన మనస్సులోని భావాన్ని బయట పెట్టేందుకు ఉపయోగించే సాధనాల తేడా తప్ప బోధకుడిలో రచయితా, రచయితలో బోధకుడూ ఏదో ప్రమాణంలో ఉంటారు. ఉండాలి. బోధకుడు తాను చెప్పేది అవగాహన అయ్యేందుకు వుదాహరణలు తీసుకొస్తాడు. ఆ వుదాహరణలూ, ప్రమాణాలే రచయిత ముడిసరుకు. ఆ ముడిసరుకుకు అందమైన రూపం ఇచ్చి మలచడంలో తెచ్చే విరుపులూ, మలుపులూ లోనే మనం రచయితలోని బోధకుణ్ణి చూస్తాం. బోధక స్వభావమైన వ్యక్తీకరణం లేకపోతే రచన పూర్తి కాదు.

అయితే బోధకుడిలో రచయిత ఎంత స్పష్టరూపంతో కనిపిస్తే అంత అందం ఇస్తుంది బోధనకు. కాని రచయితలోని బోధకుడు ఎంత మరుగున వుంటే అంత అందం ఇస్తుంది రచనకు. ఈ సౌందర్య కల్పన దృష్టి అసలు రచనలో బోధనావసరాన్నే నిరాకరించే స్థితికి కారణం అయింది,

రచయితలో బోధకుడు కనిపించకూడదనడం కళాత్మకతను సమకూర్చడం దృష్టితో తప్ప అతడు అస్పృశ్యుడూ, అవాచ్యుడూ అవికాదు. ధ్వని, వ్యంగం, వక్రోక్తి మొదలైనవి అలంకారాలుగా ఏనాటినుంచో చలామణీ అవుతున్నాయి ఒకమాటలోనో, పదంలోనో, పద్యంలోనో ఒదిగించిన గుప్త బోధనను ఆధునిక రచయిత ఒక కథలో, నవలలో, నాటకంలో పొదుగుతున్నాడు. వానిలో మనకు చూపించే జీవిత చిత్రణం పద్ధతిలో, చిత్రణలో తాను చెప్పదలచుకొన్నది చెప్తాడు. ఆ విషయంలో రచయిత చిత్రకారుడి వంటివాడు. గులాబీపువ్వు వేసి, దానికింద ఆ పువ్వేమిటో వ్రాయవలసిన అవసరం అక్కర్లేనప్పుడే కదా దాని అందం!

సాహిత్య అకాడమీ [అప] కీర్తి కిరీటాలు

1978 సం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి నందుకున్న రెండు నవలల్లో 'కీర్తి కిరీటాలు' ఒకటి మహిళ వ్రాసిన సృజనాత్మక నవలగా ఈ కీర్తికిరీటాలకు అకాడమీ అవార్డు లభించింది అకాడమీ వారికి ఈ నవలలో సృజనాత్మకత అంటూ ఏం కనిపించిందో అర్థం కావడం లేదు. అకాడమీ వారి దృష్టిలో 'సృజనాత్మకత'కు అర్థం ఏమిటో? తెలిస్తే బాగుండేది.

సృజనాత్మకత అంటే కాపీలు ఎక్కువ అమ్ముడు పోవడంకావచ్చు. సవ్యసాచిలా రెండు చేతులా ఏక కాలంలో ఒక డజను నవలలు సీరియల్‌గా గీకేయడం కావచ్చు. లేదా వాస్తవానికి దూరంగా కలల్లో విహరించే నాయికా నాయకులతో కథను చెంతాడులా లాగుతూ వందల పేజీలు నింపడం కావచ్చు ఈ మూడు గుణాలను అకాడమీ వారు సృజనాత్మకతగా గుర్తించినట్లు తెలుస్తుంది- ఈ నవలకు బహుమతి ఈయడంతో.

సాహిత్యంలో ఏరి ఏరి చచ్చునవలలకు అవార్డులీయడం వీరి ప్రత్యేకత అయింది- ఈ మధ్య. గత సం. ఆర్. యస్. సుదర్శనంగారి 'సంసారవృక్షం'కు అవార్డు నిచ్చి అకాడమీ తన "ఘనతను" చాటుకుంది. రంగనాయకమ్మ' బలిపీఠం' వాసిరెడ్డి'సమత' మహీధర రామ్మోహనరావుగారి' కొల్లాయిగట్టితేనేమి' శీలా వీర్రాజు' మైనా'' దాశరథి రంగాచార్య' చిల్లరదేవుళ్ళు' పక్కన మనం ఈ కీర్తి కిరీటాలను ఊహించలేము.

కీర్తి కిరీటాలు నవలకు రచయిత్రి 'కృతజ్ఞతలు' అంటూ 'నా యీకీర్తి కిరీటాలు నవలకు నన్ను ఉత్తేజపరచిన లతామంగేష్కర్, దేవిప్రసాద్‌రాయ్ రాజారవివర్మ మరియు కాంచనమాలలకు నాహృదయపూర్వకమైన కృతజ్ఞతలు' అవి వ్రాసుకుంది.

ఇది పబ్లిసిటీ స్టంట్. కాదంటే ఫోజు. లతామంగేష్కర్ గురించి దేవీప్రసాద్‌రాయ్ గురించి' రవివర్మగురించి తనకు చాలా తెలిసినట్లు, నిజానికి ఈ నవలా రచనకు వీరి ఉత్తేజన ఏముందో? అలవోకగా ఒక గాయకిని, ఒక చిత్రకారుణ్ణి, ఒక నర్తకిని సృష్టించింది. అంతే దానికి వీరి ఉత్తేజన నయాపైసా లేదు. కానీ ఏదో ఉన్నట్లు వ్రాసుకుంది మొదట్లో. తన నవల ఏదో గొప్ప క్లాసిక్ అయినట్లు ఆయా రంగాల్లో ప్రముఖులైన వ్యక్తులు తనకు ఉత్తేజన కలిగించినట్లు వ్రాసుకోవడం ఆత్మ వంచన. చదివిన వ్యక్తులు అది గ్రహించరను కోవడం - మరీ బేలతనం.

వసంతరావు దేశపాండే

దేవీ ప్రసాద్, రాజ్యలక్ష్మి శాంతినికేతన్ విద్యార్థులు.

దేవీ ప్రసాద్ పెయింటింగ్‌లో గొప్ప కళాకారుడు. రాజ్యలక్ష్మి సంగీతసామ్రాజ్ఞి.(అని మనం అనుకోవాలి.) రచయిత్రి అలాగే అనుకుంది. కాని అలా చిత్రించ లేక పోయింది. కారణం రచయిత్రికి సంగీతజ్ఞానం బొత్తిగా లేకపోవడం. నవలలో రాజ్యలక్ష్మి గొప్ప సంగీతకారిణి అని పదే పదే చెపుంది. కాని రాజ్యలక్ష్మి ఒక సంగీత సామ్రాజ్ఞిగా మన కళ్ళముందు రూపుకట్టదు. అనుకున్న రీతిగా పాత్రలు రూపుకట్టడానికి రచయిత్రికి ఉండాల్సిన భావనాశక్తి, పాత్రవృత్తిని, కళనుబట్టిఅయా రంగంలో గల సాంకేతిక పరిజ్ఞానం, బొత్తిగాలేవు పాత్రఅనుభవాలు, అనుభూతులు, భాష ఎన్నోవిషయాలు కలసి ఒక పాత్ర సమగ్రంగా సజీవంగా కదుతుంది. నవలలో గల ఒక నర్తకి పాత్ర (అంతంతమాత్రంగానే) తప్ప మిగిలిన సంగీత సామ్రాజ్ఞి రాజ్యలక్ష్మి పాత్రగాని, చిత్రకారుడు దేవీప్రసాద్ పాత్రగాని అసలురూపు కట్టవు. స్వర్ణపుట్టినరోజు పార్టీలో రాజ్యలక్ష్మి గానం చేర ఏర్పాటు చేయబడుతుంది. కానిరచయిత్రి ఏవిధంగాను ఆదృశ్యాన్ని రూపుకట్టించ లేకపోయింది- (పేజి 75) ప్రసాద్ రాయ్, రాజ్యలక్ష్మి ప్రేమించి పెళ్లిచేసుకుంటారు. ప్రసాద్‌రాయ్‌రాజ్యలక్ష్మి కుటుంబాలమధ్య గల ఆర్థికవ్యత్యాసం, ప్రసాద్‌రాయ్ కుటుంబం దేశీయత, రాజ్యలక్ష్మి కుటుంబం విదేశీయ నాగరికతా వ్యామోహం, రాజ్యలక్ష్మి తండ్రికిగల 'డబ్బున్నవాణ్ణనే అహంకారం' కారణంగా నవదంపతుల కాపురంలో చిచ్చురేగుతుంది ప్రసాద్‌రాయ్‌కు బొమ్మలు గీయడంతప్ప మరోపనిరాదు. అతను నిజమైన కళాకారుడు..శాంతినికేతన్ విద్యార్థి. అశ్లీలం అయన గీయలేడు. అశ్లీలానికి తప్ప సంప్రదాయానికి స్థానంలేదు. అదేఆయన దారిద్ర్యానికి కారణమౌతుంది. తండ్రి రాజ్యలక్ష్మిని అత్తవారింటికి పంపడు. అల్లుడ్నే తమయింటికి వచ్చిఉండమంటాడు అత్తవారింట్లో ఇమడలేక సతమతమౌతూ ఉంటాడు - ప్రసాద్‌రాయ్. విషయం చివరకు విడాకులు పొందేవరకు వస్తుంది. జీవితంతో పూర్తిగా ఓడిపోయిన ప్రసాద్‌రాయ్ చివరకు ఆత్మహత్యతో తన కథను చాలిస్తాడు. రాజ్యలక్ష్మి సంగీత కచేరీలతో పేరుతెచ్చుకొని చివరకు తన సెక్రటరీని పెళ్ళిచేసుకొని ఇండియా వదలి ఫారెన్ వెళ్ళిపోతుంది. వెళ్ళేముందు ఆమె గతజీవితానికి గుర్తుగా మిగిలిన కొడుకు (తేజ)ను యిక్కడే తన స్నేహితురాలు ఇందిరకు అప్పగించి పోతుంది.

తేజ ఇందిర వద్ద ఉండలేక తాతగారి (ప్రసాద్‌రాయ్ తండ్రి,) ఊరు చేరతాడు. అక్కడే తాతగారి నీడన విద్యాబుద్ధులతో పెరిగి పెద్దవాడౌతాడు.

కాలగతిలో యిరవై ఏండ్లు గడిచిపోతాయి.

ఇరవై ఏండ్ల తరువాత రాజ్యలక్ష్మి విదేశాల్లో రెండవ భర్త చనిపోయాక తిరిగి ఇండియా వస్తుంది. ఆమెతో పాటు రెండవ భర్త మొదటి భార్య కొడుకు కిషోర్ వస్తాడు. ఈ యిరవై ఏండ్లలో రాజ్యలక్ష్మి చాలానే డబ్బు సంపాదిస్తుంది

ఈ యిరవై ఏ ళ్లు రాజ్యలక్ష్మి చాలానే బాధపడినట్లు చెప్పబడింది. తన సంతానం తేజ తనను క్షమించ గలిగితే శేష జీవితం అతని సమక్షంలో గడపాలని ఆమె కోరిక. అదే ఉద్దేశ్యంతోనే ఒక ఉత్తరం వ్రాసి పత్రికలో ఉన్న కొడుకుకు పంపుతుంది. తేజాకు తల్లంటే కోపం, అసహ్యం. ఉత్తరాన్ని చించి, వచ్చిన డ్రైవర్ చేతిలో ఉంచి యిదే జవాబు పెళ్ళి రమ్మంటాడు. ఇది ఒకవైపు కథ! ఇంకొవైపు రాజ్యలక్ష్మి స్నేహితురాలు ఇందిర. ఇందిర కూతురు స్వర్ణ. అందమైంది. మంచి నాట్యకత్తె. రాజ్యలక్ష్మివెంట వచ్చి కిషోర్ స్వర్ణమీద కన్నువేస్తాడు. కిషోర్ పూర్తిగా డబ్బు మనిషి డబ్బుకోసం ఏమయినా చేయగల మనిషి. స్వర్ణ డాన్స్ ప్రోగ్రామ్స్ రూపంలో బంగారు గుడ్లు పెట్టే హంస అని గుర్తిస్తాడు-కిషోర్. అందుకనే ఆమెను విపరీతంగా ఆకర్షించి, ఆమెను శాశ్వితంగా తన గుప్పెట్లో ఉంచుకోడానికి విషయం పెళ్ళి ప్రమాణాల వరకు తెస్తాడు.

రాజ్యలక్ష్మి-ఇందిరలు చిన్ననాడే స్వర్ణ తేజ భార్య అని నిర్ణయిస్తారు. పెళ్ళి లాంటి తతంగం కూడా చేస్తారు చిన్నపిల్ల స్వర్ణ ఆ చిన్ననాటి విషయం మరచిపోతుంది. కానీ తేజాకు ఆ విషయం చక్కగా గుర్తుంటుంది. స్వర్ణయే తన భార్య అని తేజా మనసులో అనుకుంటాడు. కాని ఇందిర చిన్ననాటి విషయం మరచిపొమ్మంటుంది రాజ్యలక్ష్మితో. స్వర్ణ పెళ్ళి తేజాతో జరగడం ఇందిరకు ఇష్టముండదు ఆమె కిషోర్ తన కూతురుకు తగినవాడు అనుకుంటుంది. కాని స్వర్ణకుగాని, ఇందిరకుగాని కిషోర్ నిజస్వరూపం తెలియదు. అతడి నిజరూపాన్ని ఎరిగిన రాజ్యలక్ష్మి, కిషోర్ స్వర్ణకు తగడంటుంది. ఈ విషయం చూచాయగా గ్రహించిన కిషోర్ రాజ్యలక్ష్మిని బెదిరిస్తాడు. కిషోర్‌కు కావలసింది డబ్బు ఆమె వెంటపడి ఇండియా వచ్చాడు. రాజ్యలక్ష్మిని కిషోర్ ఏనాడూతల్లిగా గౌరవించడు. ఆమె తన ఆస్తిని తన పేర వ్రాయకుంటే ఆమెను బలవంతంగానైనాసరే చంపి ఆత్మహత్యగా నమ్మించగలనని బెదిరిస్తుంటాడు.

స్వర్ణతో ప్రోగ్రామ్స్ యిప్పిస్తూ దేశవిదేశాలు తిరిగి ఆమె ద్వారా లక్షలు లక్షలు ఆర్జించవచ్చని అతని ప్లాను. కాని విధి వక్రించి స్వర్ణకాలుకు ఏక్సిడెంట్ జరిగి డాన్స్‌కు పనికిరాకుండా పోతుంది కాలికి గజ్జెకట్టని స్వర్ణ కిషోర్ దృష్టిలో పైసాకు కూడా కొరగాదు అతడు స్వర్ణను వదిలేసి మరో అమ్మాయితో వరల్డ్ టూర్ వేస్తాడు స్వర్ణ తల్లిదండ్రులను పోగొట్టుకొని, బంధువులతో నిరసించబడి దిక్కులేనిదానిగా మిగిలిపోతుంది. అప్పుడు తేజ ఆమెను చేరదీసి ఆదరిస్తాడు. ఆమె కాలికి వైద్యం చేయిస్తాడు. పల్లెటూరినాటు వైద్యంతో స్వర్ణకాలు బాగుపడుతుంది. స్వర్ణ తిరిగి గజ్జెకట్టి ఆడగలుగుతుంది. ఈ లోగా మళ్ళీ కిషోర్ వరల్డ్-టూర్ ముగించుకొని వస్తాడు, స్వర్ణ తిరిగి మామూలుగా డాన్స్ చేయగలుగుతుందని తెలుసుకొని మళ్ళీ ప్రేమ నటిస్తాడు.

ఒకనాడు కిషోరే తన స్వరస్వమనుకున్న స్వర్ణ అతని నిజ స్వరూపం తెలుసుకొని ఈసడిస్తుంది.

చివరకు క్లైమాక్స్‌లో, స్వర్ణ, తేజాల పెళ్ళి; - చావు బ్రతుకుల మధ్యనున్న రాజ్యలక్ష్మి, తల్లీ - కొడుకుల పట్టింపులు....రక్తదానం....డాక్టర్లు.....,ఇంజక్షన్లు....; చివరకు రాజ్యలక్ష్మి తేజాల కలయిక. మధ్యన ఒకసారి కిషోర్-తేజాల బాక్సింగ్, తన ప్లాన్స్ ఏమీ ఫలించని కిషోర్...ఐ హేట్ ఆల్ ఆఫ్ యు ది బ్లడీ ఇండియా - అంటూ నిష్క్రమిస్తాడు. కిషోర్ నిష్క్రమణతో నవల సుఖాంతమౌతుంది. చివరకు తేజా, రాజ్యలక్ష్మి, స్వర్ణ అందరూ పల్లెలో సుఖంగా ఉంటారు ఇదీ కథ. ఈ మహత్తరమైన కథకే 'కీర్తి కిరీటాలు' అనిపేరు.

అసలు ఇదొక సిసలైన చచ్చు తెలుగు సినిమా కథ.

హీరో - హీరోయిన్. ఆ హీరోకు మళ్ళీ హీరోలాంటి కొడుకు పుడతాడు. (Double Role). ఈ పడుచు జంట ముసలిదై పోతుంది. మళ్ళీ ఒక పడుచు జంట; (స్వర్ణ, తేజ). వీరిద్దరిమధ్య ఒక మంచి విలన్ (కిషోర్) వాడు సినిమా విలన్ కాబట్టి నిలువెల్లా నీచుడే. వాడికొక వాంప్‌గర్ల్ ఫోనులో మాట్లాడుతూ బొచ్చుకుక్కలా భుజాలు విమరడానికి, వాడికొక పాత ప్రేయసి. ఆమెను మోసగించడం కూడా వాడి విలన్‌గిరీలో ఒక భాగమే. హీరో - హీరోయిన్‌లకు ఒక కోయడాన్స్ లాంటిది ఉంటుంది రెండు స్టేజీ డాన్సులు. ఒక బర్త్‌డేపార్టి(అక్కడో పాట మామూలుగా!). ఒక హరేరామ హరేకృష్ణ తాత. అవి ముఖ్యపాత్రలు. అంటే రేపు సినిమా రివ్యూలో సజీవంగా, పాత్రలో లీనమై తమకు తామే సాటియై వారి నటజీవితంలో మైలురాళ్ళుగా నిలిచిపోయేట్టు నటించి పారేయగల పాత్రది. ఇవిగాక మరోడజను చిల్లర పాత్రలు.

అకాడమీవారు స్త్రీలు వ్రాసిన సృజనాత్మకనవల బహుమతి అని అపహాస్యం పాలయ్యేకన్నా వచ్చే యేడన్నా 'స్త్రీలు వ్రాసిన అసలైన సినిమా నవలకు అవార్డు' అని ప్రకటిస్తే ఎవరికి ఏ పేచీ ఉండదు.

ఈ నవలను నిర్మాతలు కొన్నామని ప్రకటించగానే ఆ నవలా రాజము ఎంత మహోన్నతమైనదో విజ్ఞులు గ్రహించే ఉంటారు. ఆ గ్రహింపు అకాడమీ వారికి కలగకపోవడం చాలా శోచనీయం.

సీరియల్‌గా రాసే నవలకు, మామూలు నవలకు చాలా భేదం ఉంటుంది. వారం వారం పాఠకోత్తములను అలరించటానికి దాంట్లో చాలా మసాలా ఉండాలి లేకపోతే సదరు పాఠకులు ఇంటిల్లిపాదీ ఆనంద డోలికల్లో ఊగరు, కన్నీళ్ళలో తేలరు. మసాలా లేని నవలను మన పత్రికల వాళ్ళు ధారా వాహికంగా ప్రచురిం

చరు. అందుకని ఈ నవల మొదటు కావడమే సందు మలుపు తిరగని కారుతో మొదలు అవుతుంది. సీరియల్ నవల కాబట్టి సస్పెన్స్,మలుపులు, హఠాత్ సంఘటనలు క్లైమాక్స్‌లతో సాగిపోతుంది. ఇన్ని తెలుగు సినిమా లక్షణాలు, చవక రకం సాహితీ విలువలున్న, ఈ నవలకు అకాడమీ అవార్డునిచ్చి అకాడమీ చవక, అయిందోలేక ఈ నవల సృజనాత్మక నవల స్థాయికి ఎదిగిందో. చదివినవారు గుర్తింతురు గాక!

ఈ నవలలో అన్నింటికన్న గొప్పలోపం— నాయకుడు ఎప్పుడో జరిగిన బాల్యవివాహానికి అధికప్రాధాన్యత నిచ్చి అలమటించడం. ఒకవిధంగా రచయిత్రి బాల్యవివాహాలను సమర్థిస్తుందనే చెప్పాలి తేజాకు తల్లంటేగౌరవం- ప్రేమాలేవుకాని ఆతల్లి చిన్ననాడు ఏర్పరచిన పెళ్లిఅంటే ఎంతోఇది. ఇదెలాసాధ్యం? ఇదిఅవసరమైన సెంటిమెంట్ .స్వర్ణకు కిషోర్ అంటేఎంతో ప్రేమ (అతడుఆమెను మోసగించాడు అదివేరుసంగతి) స్వర్ణకు చిన్ననాటి పెళ్లిసంగతిగాని, తేజరూపంగాని గుర్తే లేవు. వారిద్దరి మధ్య ఎలాంటి మధురమైన అనుభవాలు, అనుభూతులు లేవు.అయినా తేజఆమె కోసం అలమటిస్తున్నట్టు,ఆమెకుతప్ప మరొకరికి చోటులేదని అనడం అర్థంలేనిమాటలు. ఇలాంటి నాయకుణ్ణి సృష్టించి చివరకు ఆ బాల్యవివాహాన్నే బలపరిచి- మూడుముళ్ళుమళ్ళీవేయించి చేతులు కడుక్కొంది- రచయిత్రి.

ఇలాంటినవలలకు అవార్డులు ప్రకటిస్తుంది కాబట్టే' ఊబిలోదున్నలు' తంతాయి. ఇలాగే వరుసగా నాలుగు (ఇప్పటికి రెండుఅయ్యాయి 1. సంసారవృక్షం 2. కీర్తికిరీటాలు) నవలలకు అవార్డులు యిస్తే బుద్ధున్న ఏ రచయితా తనకు అకాడమీ అవార్డు రావాలని కోరుకోరు.

అవార్డు వచ్చిందికదాఅనిరేపు ఏ మహానుభావుడో ఈ నవలను యితర భాషలోకి అనువదిస్తే మన తెలుగు సాహిత్యం ఎంత ఉన్నత(?) స్థితిలో ఉందో స్పష్టంగా తెలుస్తుంది.

తెలుగు సాహిత్యానికి అంత అవమానం జరగకుండుగాక!

గాయం-గేయం

వాడుచేసిన గాయం
ప్రాణం తీసింది.
ఎందరు అనాథలయ్యారో?

వీడు రాసినగేయం
ప్రాణం పోసింది.
ఎందరు బతికిపొయ్యారు!

—విద్వాన్ రవీంద్రబాబు.

మినీకథ.

అద్దమా - అమ్మాయా

—ఆదూరి వెంకట సీతారామమూర్తి.

అక్కడ - అటు పల్లెమీద నాలు గాకు లెక్కువచడవి, అటు పట్నానికి రెండు మెట్లు తక్కువకున్న ఆ వూళ్ళో నడిబాజారు నాలుగురోడ్ల జంక్షన్‌లో మేకప్ వేసుకున్న ముసలి హీరోయిన్‌లా తయారైన ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో కలకలంబయల్దేరింది-

ఆ రోజు డిపార్ట్‌మెంట్ స్టోర్సుకు సంబంధించిన మేనేజరొకాయన హైద్రాబాద్ నించి విమానంలో వస్తున్నాడు- ఆ సందర్భంలో అక్కడి సేల్సుమన్ అంతా దిగులు గుండెల్తో వున్నారు-స్టోర్ మొత్తంమీద చూస్తే కస్టమర్సుకన్నా సేల్సుమెన్నే ఎక్కువున్నారు-ఆ యేడు లాభంకంటే నష్టాలే ఎక్కువున్నాయి--

నాలుగు రోడ్ల నడిబాజార్లో వున్న గవర్నమెంట్ స్టోర్సులో జనం లేకపోద మేంటి అని ముక్కులమీద వేళ్ళేసుకునే వాళ్ళు ఆ వూళ్ళో లేరు - అక్కడి వాళ్ళకు ఆ స్టోర్‌హిస్టరీ తెల్సు - స్టోర్ పెట్టిన మొదట్లో ఆ హిస్టరీ- పేపర్లో కూడ పడింది-హిస్టరీ చింపేస్తే చిరిగి పోయేది కాదు గాబట్టి పేపర్లు చిరిగి పోయినా హిస్టరీ మిగిలిపోయింది-

అక్కడ పప్పుదినుసుల తూకాల్లో తేడా వుంటుందనీ, వూళ్ళో ఎక్కడా దొరకని ముక్క (పప్పు) దినుసులు అక్కడే లభ్యమౌతాయనీ, అక్కడ వస్తువుల ధరలు పెరగడమేగాని తగ్గడం వుండదని ఆ వూరి జనం అభిప్రాయం- పీటన్నిట్నీ మించి అందులోకి జొర బడ్డవాడెవడూ ఒక్క అయిదునిముషాలేన నిలవలేని 'కండిషండ్‌ఎయిర్ 'వాతావరణం దాన్ది-ఎండాకాలంలో అతివేడిగానూ వుంటుందందులో - వర్షాకాలంలో వర్ష పాతాన్ని కొలవొచ్చు. అంచేత-అందులో పన్జేసే వారికంటే కష్టమర్సు ఏ రోజూ ఏ సమయంలోనూ ఎక్కువుండరు - అందుకే కలకలం! జనరల్ మేనేజరు గారు రానేవచ్చారు. వస్తూనే అల్మయిరాల్లో వున్న సామగ్రిని కౌంటర్లలో వున్న సేల్సుమన్‌నీ చూశారు - చూసి ఏదో అవగతమైనట్లు తల పంకించాడు- పక్కనున్న అసిస్టెంటుతో యింగ్లీషులో ఏదో మాట్లాడేరు - నవ్వ మొచ్చినంత మాత్రాన భయపడ నక్కర్లేదన్నారు- స్టోర్సు యింప్రూవ్‌చేస్తే లాభాలు వాటంతటవే వస్తాయన్నారు- ఆతర్వాత అక్కడి మేనేజర్‌గారి తోనూ అసిస్టెంటు తోనూ డిస్కస్‌చేసి కొన్ని సజషన్సు యిచ్చారు.

ఆయన సలహాననుసరించి స్టోర్సులో మార్పులు - జరగటంవల్ల ఆ తర్వాతి యేడాదిలో బాగా లాభా లొచ్చాయి-

ఆస్టోర్స్ పూర్వంలాలేదు- సమ్మం దాటిలో పలికి నాలుగడుగులు వేస్తే ఎడం వైపు నిలువెత్తు పెద్దఅద్దం; దానికెదురుగా కుడివైపు కౌంటర్‌లో ఒకఅందమైన అమ్మాయి- ఆకౌంటర్లో అబ్బాయిలకు కావల్సిన ఎన్నోసామాన్లు।

ఇప్పుడా డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో జనానికి లోట్లేదు!

స్వార్థ సారథి

పాలానాదండం ములుగోల కేలబూని
స్వార్థ సారథి రథం నడుపుతున్నాడు
గోలగోలగా సమస్యల సమరక్షేత్రంలో
తూలి పడుతున్నాడు
నకిలీ ప్రజాస్వామ్యపు
నకిలింతల సోషలిజం గుఱ్ఱాలంతోంతూ
హస్తిన సింహాసనంతో
కుస్తీపడుతున్నాడు— మరోవైపు
దేశంలోని పాసిజాన్నిఎదుర్కొనే
ఉద్దేశం మంటమండని
నరుడు నిరుత్తరుడై
ఉత్తరుడై అస్త్రసన్యాసంచేసి
ఉత్తచేతులతోనే తత్తరపడుతున్నాడు
నరుడు అధర్మాన్నికాపాడిన సహనానికే
మళ్ళీ
పురుడు పోసుకుంటున్నాడు
బూర్జువా తాతలనూ
గర్జించే దోపిడీభ్రాతలనూ చూచి
భూస్వాములైన తండ్రులనూ
కేపిటలిస్టు మామలనూ
లంచగొండి స్నేహితులనూ
పంచాధికార బంధువులనూ
వంతపాడే గురుజనులనూ
సొంతగొంతులేని అనుజులనూ చూచి
వింత సానుభూతితో
అస్త్రసన్యాసంచేసిన నరుడే
తన ఆశయ లక్ష్యాల సరిహద్దు గీతపై
నిలుచుని
అవినీతి ప్రాణంపై
బాణంసంధించ బోతున్నాడు

—చొప్పకట్ల చంద్రమౌళి.

గాలానికి మింగలేది

చెమటోడ్చి, న్యాయంగా
పనిచేసేవాడి " శ్రమ "
నీట్లోమునిగిన " గాలం "లాటిది
కష్టానికి తగ్గప్రతిఫలాన్ని
అడిగితినే " నోరు "లేనంతకాలం
వాడికిమిగిలేది శ్రమే!
ఫలితం మాత్రం
ఎరచూపించి
కర్ర[illegible]నంచేసే
ఆపైవాడిదే

—నిట్టల ఫణిమిత్ర

చర్చా వేదిక

1. ఇంగ్లీషులో పార్టిజాన్‌షిప్ అనేమాటకు సహయోధత్వం అనిభావార్థం. స్పెయిన్‌లో రిపబ్లిక్ తరుపున ఫ్రాంకో నియంతృత్వానికి (1937) వ్యతిరేకంగా పోరాడిన దేశదేశాల వీరులను పార్టిజాన్స్ అన్నారు. పిమ్మట ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో యూరప్ అంతటా. స్థిరసైన్యంలో భాగంకాకుండా అడవుల్లో గెరిల్లా పోరాటం చేసినవారిని పార్టిజాన్స్ అన్నారు. లక్ష్యంఒకటే, పోరాటపద్ధతులు మాత్రం స్థిరసైన్యానికి,పార్టిజాన్‌లకువేర్వేరు.

2. సహయోధత్వం అనేమాట నోరు తిరగనందుననో, ఏమో, పాక్షికత అనేమాట వాడుకలోకి వచ్చింది. ఏమైనా సహయోధత్వం అనేమాట భావాన్ని సరిగ్గా వ్యక్తంచేస్తుంది పాక్షికతను కొందరు పక్షపాతం అంటారు. పక్షపాతం అంటే న్యాయాన్యాయాలతో ప్రమేయం లేని అభిమానం అని వ్యావహారికార్థం వుండనే వుంది. ఏమైనా ఈ చర్చలో పాక్షికత అంటే సహయోధత్వం అనే అర్థాన్ని స్వీకరిద్దాం.

సాహిత్యరంగంలో పాక్షికత

---

3. సాహిత్యంలో పాక్షికత ఏమిటి?

పెట్టుబడి దారీ భూస్వామ్య వ్యవస్థను కూల్చి, సమసమాజ స్థాపనకై నేడు ప్రపంచ వ్యాపితపోరాటం జరుగుతున్నది. ఇదికేవలం రాజకీయ సమస్యకాదు, చారిత్రక పరిణామం లోని ఒకదశ. సైద్ధాంతిక. తాత్విక పాతిపదికలు కల్గినఒక మహాసామాజిక విప్లవం. మనదేశంలోనూ ఇది జరుగుతోంది. పీడితప్రజలు, కార్మిక, రైతు, మధ్యతరగతి మేధావి వర్గాలందరూ ఈ మహావిప్లవంలో objective గా భాగస్వాములు. వారిప్రయోజనాలు ఈ విప్లవంలో ఇమిడి వున్నాయని అర్థం.

4. భౌతికంగా వారిప్రయోజనాలు ఈ విప్లవంలో ఇమిడి వున్నప్పటికీ ఈనాడు ఆవర్గాలలో అత్యధికులు ఆగుర్తింపు కలిగిలేరు. భౌతిక వాస్తవికతకు, మానసికగుర్తింపుకూ గల ఈ అఘాతానికి కారణం, దేశరాజకీయ పరిస్థితులు, పరిణామాలు, ఆర్థిక, సామాజికాది అనేకకారణాలు.

5. ఇట్టి ప్రత్యేక పరిస్థితులలో సాహిత్యరంగంలో పాక్షికతను గూర్చిచర్చిస్తు

51

న్నాము. భౌతిక, మానసిక పరిణామాల మధ్య ఇంత అఘాతం లేకుండా విప్లవం జరిగిన దేశాలలో, సోవియట్ రష్యాలాంటివి, బహుశా ఈ సమస్య ఏర్పడి వుండదు. ఏర్పడినా ఇంత తీవ్రరూపంలో వుండివుండదు.
కానీ మనదేశపరిస్థితివేరు.

6. ఆ దేశాలలో సైతం, సాహిత్య, తాత్విక, రాజకీయ రంగాలలో పాక్షికతలు ఒకే మూసలో పక్క పక్కనే సాగలేదు. లక్షణం ఒకటే అయినా, ఈ మూడింటి మధ్య వ్యత్యాసాలున్నాయి. ఇవి పరస్పర విరుద్ధమైనవి కావు. పరస్పర సహాయకాలు, కాగా, ఈ పరస్పర సహాయకత్వం, దీర్ఘకాల పరిణామంలో అభివ్యక్త మవుతుందే తప్ప, వెంటనే కాదు మన దేశ పరిస్థితులలో ఇది మరీ నిజం.

7. 1960 దశకంలో దిగంబర ధోరణి, 1970 దశకంలో విరసం, ఏర్పడింది. అంతకు ముందున్న అభ్యుదయ సాహిత్యం నుండి వేరు బద్ధంతో, నిబద్ధత, నిమగ్నత, పాక్షికత వంటి మాటలు వాడుకలోకి వచ్చాయి. ఈ పూర్వ రంగంలో, సాహిత్య రంగంలో పాక్షికత అనే అంశాన్ని చర్చించటం సబబుగా వుంటుంది.

X X X X

1. తత్వశాస్త్రం, సాహిత్యం, విరోధ వైరుధ్యసూత్రం(Negation of Negation)చే బంధితమై వుంటాయి. తాత్విక దృష్టిని యధాతథంగా, యాంత్రికంగా ప్రతిబింబించే సాహిత్యంలో తరచు కళాత్మక విలువలు దవు. ఆ మేరకు అది పార్టిజాన్‌షిప్ లక్షణాన్ని కోల్పోతుంది. తాత్విక దృష్టి "SUBLIMATE" కావాలి. ఆహారం జీర్ణమై రక్తపుష్టి ఏర్పడినట్లు, సిద్ధాంత జడత్వం హరించి, "సారం" కళారూపంలో వ్యక్తం కావాలి. అప్పుడే తాత్విక పాక్షికత, సాహిత్య పాక్షికతగా రూపాంతరం చెందుతుంది దీనినే విరోధ వైరుధ్యం అంటున్నాము

2. ఆకులందున అణిగిమణిగి
కవిత కోకిల పలుకవలెనోయ్'-అనే మాటలో 'అణగి మణగి'అంటంలో మొదటి వైరుధ్యం వుంది, సిద్ధాంత జడత్వం హరించటం 'పలుకులను విని దేశమందభిమానములు మొలకెత్త వలెనోయ్' అనటంలో రెండో వైరుధ్యంవుంది అలా జీర్ణమైన "సారం" భావసంచలనాన్ని కల్గించటం ఇది రెండో వైరుధ్యం.

8. అప్పారావుగారు 'గతి తర్కం' అనే మాటను విని వున్నారో లేదో తెలియదు. KANT, HEGEL ప్రాచీన గ్రీకు తత్వశాస్త్రిలు ఆయనకు తెలుసు. కనుక ఆ మాట వినివున్నా వుండవచ్చు. ఏమైనా ఆ భావాన్ని ఆయన (Conscious)గా స్వీకరించ లేదని స్పష్టం. ఆనాటి కది అసాధ్యం.

4. శాస్త్ర విజ్ఞానంలో సరికొత్త పరిశోధనను ఆవిష్కరించిన ప్రతి శాస్త్రవేత్త ఆ మేరకు "Unconscious Dialecticion, objective"గా భౌతికవాది అవుతాడు. అలాగే ఆంధ్ర సాహిత్య పునరుజ్జీవనానికి అద్యుడైన గురజాడ (unconscions Diale cticion) అని చెప్పవచ్చు.

5. ప్రతి రచయితలో ఉద్దేశ్యపూర్వకమైన తాత్విక దృష్టి ఏదీ మొదట్లో వుండక పోవచ్చు. కొందరికి చివరిదాకా వుండకపోవచ్చు. హెచ్చుమంది తమ రచనా నైపుణ్యాన్ని పెంచుకోటానికి చూస్తారేకాని తమ తాత్విక దృష్టి సమగ్రమా, కాదా అనే జిజ్ఞాస అంతగా వుండదు. ఉండకపోవచ్చు. అంత మాత్రాన రచయితగా అతని స్థాయికి తప్పనిసరిగా భంగం రానక్కరలేదు.

సమగ్ర తాత్విక దృష్టిని ఏర్పరచుకోండి-అని రచయితను కోరటంవేరు, అట్టి దృష్టి రానంతవరకూ అతని ప్రతి రచనలోనూ ఏదో కొంత లోపంవుంది తీరుతుందని అనుకోవటం వేరు. చలం తాత్విక దృష్టిని మనం ఆమోదించము. కాని కొన్ని రచనలలో ఆయన ప్రదర్శించిన అద్భుత సామర్థ్యాన్ని కాదన లేము కదా।

6. వీరేశలింగం గారి "బ్రహ్మ వివాహం"లో వస్తువూ, కన్యా శుల్కంలోవస్తువూ ఒకటే. వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, బ్రాహ్మ వివాహం అంతా చదివిన తర్వాత పాఠకునికి జుగుప్స కలుగుతుంది. రచయితకే కల్గింది. అఖరుకు వీరేశలింగంగారిలా అంటారు. ఈ రోజంతా రంకు పురాణంతో గడిపాము. ఇకపోదాం రండి".

కన్యాశుల్కం అందుకు పూర్తి విరుద్ధం. హాస్యం, వ్యంగ్యం, కరుణ మానవత, ఇత్యాది అనేక రసాలతో "నాటక" వస్తువు పునీతమై ఉత్తమ కళా రూపంగా తయారైంది. వీరేశలింగం గారికి తాత్విక పాక్షికత పూర్తిగావుంది. కాని సాహిత్య రంగంలో పాక్షికతను ఆయన సాధించలేకపోయినారు. పాఠకుల మనస్సులను ఆకట్టుకోలేక పోయారు. గురజాడ ఆ పని సాధించారు. కనుకనే గురజాడను సాహిత్యరంగంలో "పాక్షికత" కు తార్కాణంగా ఎంచుతున్నాము.

7. బ్రహ్మ వివాహం చదివి, వస్తువు మంచిదైనా, కళాత్మకంగా అది తక్కువ స్థాయిలో వున్నందున, తాను కన్యాశుల్కం రాయటానికి పూనుకొన్నట్లు అప్పారావుగారు స్వయంగానే చెప్పుకున్న సంగతి మనకు తెలుసు. కళాత్మక విలువలు, సాహిత్య పాక్షికతలో విడదీయరాని అంతర్భాగాలు అని సారాంశము,

8. "దేశమంటే మట్టిగాదోయ్
దేశమంటే మనుషులోయి", అని అప్పారావుగారు 70 ఏండ్ల క్రితం గొంతె

నపుడు, భవిష్యత్తులో ఈ గేయం అభ్యుదయ సాహిత్యోద్యమానికి మార్గదర్శక సంకేతం అవుతుందని వూహించి వుండరు. జాతీయ దురహంకారాన్ని రెచ్చగొడుతున్న ఆనాటి ఉపన్యాస కేసరుల వాగ్ధాటిలోని బండారాన్ని బహిర్గతం చేయటానికి ఆ మాట అన్నారు. ఆ చల్లని మాట, సమాజ పరిణామ క్రమంలో ఈనాటికీ పురోగమన కేతనంగా వుంది. వస్తుగత కారణాలు, ఒక మహా దర్శిష్ట తాత్త్విక చింతనల మేళవింపు ఇది. (objective and subjective dialectics)ల కలయిక.

9 కళారంగంలో పాక్షికతకు భాషా సంయమనం ఒక చిహ్నం. భాషా సంయమనం అంటే భావ సంయమనం కాదు భావ తీవ్రత కావచ్చు.

"నలుగురు కూర్చొని నవ్వేవేళల

నా పేరొకపరి తలవండి", అనే పూర్ణమ్మ వేదన తెలుగు సాహిత్యం వున్నంత వరకది ప్రతిధ్వనిస్తూనే వుంటుంది. భాషా సంయమనం, భావ తీవ్రతల సమ్మేళనం ఇది. "మానిషాదం ప్రతిష్ఠాంత్వమ గమః శాశ్వతీ సమాః" అనే వాల్మీకి మాటలలోనూ ఇలాంటి సమ్మేళనం వుంది. భాషా సంయమనానికి, భావ తీవ్రతకూ గల విరోధ వైరుధ్య బంధనం ఇది.

10. అప్పారావుగారు అభ్యుదయ సాహిత్యానికేగాదు, భావ కవిత్వానికి కూడా ఆద్యులు.

కొయ్య బొమ్మలు మెచ్చు కళ్ళకు

కోమలుల సౌరెక్కునా?, అనే మాటలలో, ప్రబంధ నాయికల కృత్రిమత్వాన్ని హేళనచేసి, స్త్రీ సహజ సౌందర్య వర్ణనా భావాన్ని ప్రవేశపెట్టారు. ఆ మాటకొస్తే పింగళి సూరన సుగాత్రి శాలీనుల కథలోనే ఇందుకు బీజాలున్నాయి. అప్పారావుగారి భావాన్ని, రాయప్రోలు, దువ్వూరి, దేవులపల్లి ఇత్యాదులు కొనసాగించారు. కాని వీరు అతిగా ముందుకుపోయి, అమలిన శృంగారం, ఆత్మాశ్రయ కవిత్వ ధోరణులలోకి వెళ్ళారు.

11 ఆ వక్రీకరణను 1936 ప్రాంతాల్లో సవరించింది శ్రీ శ్రీ

"పొలాలనన్నీ హలాలదున్నీ

ఇలా తలంలో హేమంపిండే"

"కర్మవీరులూ, ధర్మవీరుల"ను కవితా వస్తువును చేశారు. అప్పారావుగారిలోని అభ్యుదయ ధోరణికి 1939-40కి గాని వారసులు పుట్టలేదు. భావ కవితా ధోరణికి 1920కే పుట్టారు. కాలక్రమ పరిణామం వేరు, భావక్రమ పరిణామం వేరు అని చెప్పటానికి ఇది చక్కని వుదాహరణ. ప్రాచీన ధోరణులకంటే అర్వాచీన ధోరణి తప్పని గాదు, ప్రతి సందర్భంలోనూ ముందడుగు కానక్కరలేదు.

12. అనేక కారణాలవలన అభ్యుదయ సాహిత్యోద్యమం 1960 దశకంలో బల హీన పడ్డది. ఈ కారణాలు సాహిత్యపరమైన వనటంకంటే, రాజకీయ పర మైన వనటం సబబు. జాతీయమైనవి అనటంకంటే అంతర్జాతీయమైనవి అనటం సబబు. ఏది ఏమైనా 1960 నుండి నేటి వరకు రాజకీయ రంగంలో వచ్చిన వ్యక్తీకరణ కాలంలో పుట్టిన సాహిత్య ధోరణులు, మొదట దిగంబరశాఖ, పిమ్మట విరసం. ఇప్పుడనేక కారణాలవలన, అవీ రాజకీయమైనవే, బలహీన పడుతు న్నవి ఈ రెండు సాహిత్య ధోరణులు తెలుగు సాహిత్య పురోగతికి అనుకూల అంశాలేవైనా చేర్చాయా, ఒకవేళ చేర్చినా అవి అనుద్దేశ పూర్వకంగా జరిగిన వ్యతిరేక ఫలితాలా- అనే అంశం ప్రత్యేకంగా చర్చించవలసినది.

13. కారణాలేవైనా, నిబద్ధత, నిమగ్నత, పాక్షికత అనే మాటలు వేర్వేరు ప్రగతి శీల రచయిత సంఘాలకు ప్రతీకలై వున్నాయి. వీటికి వేర్వేరు వామ పక్షాల అనుబంధం వున్న విషయం విదితమే.

14. పాక్షికత విషయంలోనే తాత్విక, కళారంగాలమధ్య వ్యత్యాసం చూపవలసి వుండగా నిబద్ధత, నిమగ్నత, ఇత్యాది భావాల విషయంలో ఈ విభజన మరింతగా వర్తిస్తుందని వేరే చెప్పనక్కరలేదు. తాత్విక, సాహిత్య రంగాల మధ్య విభజనను గుర్తించక పోగా, ఈ కాలంలో, తాత్విక పాక్షికతను, రాజకీయ పాక్షికతగా, ఏదో ఒక వామపక్ష పార్టీకి, గ్రూపుకు అనుబంధమే పాక్షికతకు, నిబద్ధతకు, నిమగ్నతకూ తార్కాణంగా భావించటం జరిగింది. కారణాలేవైనా ఇది మరింత అవాంఛనీయ పరిణామ మనటంలో సందేహం లేదు.

15. ఈ వాద వివాదాలలో ప్రగతిశీల రచయితల వుద్యమం ఇరుక్కు పోగా, సామాజిక స్పృహ లేకపోవటమే సాహిత్య ఔన్నత్యానికి తార్కాణమనే "నిహిలిస్టు" ధోరణి అనుభూతి వాదం, అసందర్భ, అవ్యక్త ధోరణులు, జాతీయ దురహంకార తిరోగమన ధోరణులు ప్రబలుతున్నాయి. సిద్ధాంత జడత్వానికి, మరొక పార్శ్వం నిహిలిస్టు ధోరణి.

16 సాహిత్య రంగంలో పాక్షికత అనే సైద్ధాంతిక ప్రతిపాదనను, ఈ పూర్వ రంగంలో చర్చించటం వుపయోగకరంగా వుండగలదని అనిపిస్తున్నది.

బాలచంద్రుడు

చిరిగిన చొక్కాతో
విరిగిన పలకతో
బుగ్గలమీద చారలతో
జానెడు లోతుకుపోయిన పొట్టతో
బడికిపోతున్నాడు

బాలల సంవత్సరం బాలుడు
చంద్రుడు వీణ్ణి చూసి సిగ్గుపడి
తనవంటిని ముక్కలుగా కోసి
కింద పడేస్తున్నాడు.

డా॥ పి. చిరంజీవనీ కుమారి.

సోవియట్ల దృక్పథంలో ప్రేంచంద్

1955 లో మాస్కోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లో చదివే రోజులలో కొందరు తోటి విద్యార్థులతో కలసి ప్రేంచంద్ రచనలలో ఉత్తమ శ్రేణికి చెందిన నవల "నిర్మల"ను తర్జుమా చేశాను. నాటినుండీ ప్రేంచంద్ హిందీ భాషలో నా అభిమాన రచయిత. అంచేత, ఆ మహనీయుని గురించి వ్రాయడానికి సాహసిస్తున్నాను.

సోవియట్ పాఠకుల హృదయాలలో ప్రేంచంద్‌కు ప్రత్యేక స్థానమున్నది. ఆయనకు సోవియట్ దేశంలోని శ్రమజీవుల పట్ల, మా దేశంలో విప్లవానంతరం వచ్చిన సామాజిక పరివర్తనల పట్ల గల ప్రేమ సానుభూతులు ఎంతగా గలవో అదే రీతిగా మా పాఠకులకు ఆయన రచనలలోని ప్రధాన పాత్రల పట్ల అనురాగం అభిమానం ఏర్పడ్డాయి.

ఆయన "ప్రేమాశ్రమం" లోని ముఖ్య పాత్రలలో వొకరైన బలరాజ్ పుస్తకాలు, పత్రికలు చదివి రైతులకు విప్పేస్తాడు, వాటిని వలస వాదుల పాలనకు వ్యతిరేకంగా పోరాటానికి సన్నాహం చేస్తాడు. "మనం వారికెె ముకు లొంగిపోవాలి?" అని ప్రశ్నిస్తాడు. రష్యాలో కార్మికులు, కర్షకులు తమపాలనను ఏర్పాటుచేసికోగల్గారుగదా.

మూలం:	అనువాదం:
డా॥ ఒ. జి. ఉల్త్సిఫరేవ్	కుంమారి శోభ

ప్రేంచంద్ భార్య శివ్ రాణీదేవి, "ప్రేంచంద్ ఘర్ మే" అనే పుస్తకంలో ఆయన (1928) అన్నమాటలను ఉదహరిస్తుంది: "ప్రపంచమంతటా బలవంతులు బలహీనులను దోచుకొంటున్నారు. రష్యాలో మాత్రమే ప్రజలు ధనికులను నాశనం చెసారు. ఇప్పుడుఅక్కడ పేదలు స్వేచ్ఛగా గాలిపీల్చుకోగల్గుతున్నారు"

ప్రేంచంద్ సానుభూతి, ప్రేమ అంతా శ్రమజీవులపట్లనే, అయనఅనేవాడు. "చివరకు నేనుకూడా కార్మికుణ్ణే." పలుగతో పనిచేయనన్న మాటేగాని, కలంతో పనిచేస్తానుగదా".

తాను పుట్టిన దేశానికి సుందరమైన, ఉజ్వలమైన భవిష్యత్తు కావాలని కలలు కనేవాడు. అయన సృజనాత్మకమైన రచనా వ్యాసంగం పూర్తిగా యీ లక్ష్యం కొరకు తీవ్రంగా పోరాడడానికే అంకితం చేసాడు. ఆనాటి "విశాల్ భారత్" అనే పత్రికా సంపాదకుడైన బనార్సీదాస్ చతుర్వేది మీ కోరికలు, ప్రణాళికలు ఏమిటి? అన్న ప్రశ్నకు యీ విధంగా సమాధానం చెప్పాడు.

"నాకు నిశ్చితమైన ఆశయాలున్నాయి. స్వాతంత్ర్యంకోసం మనం జరిపే పోరాటం జయించాలి- యిదే ముఖ్యంగా నా కోరిక.

డబ్బుకోసంగాని, కీర్తికోసంగాని నేనెన్నడూ తహతహ లాడలేదు. భవ నాలుగాని కార్లుగాని నాకు అవసరం లేదు.... నేను కలలుకనేది ఒకే ఒక్క విషయం కోసం. స్వాతంత్ర్యంకోసం జరిగే పోరాటానికి అంకితమైన మూడు నాలుగు అతి చక్కని కళాత్మకమైన రచనలను వదలి వెళ్ళాలని, నా జీవితాశయం సాహిత్యానికీ, దేశానికీ సేవచేయాలనేదే."

ఆనాటి దుర్భరమైన పరాయి పాలన క్రింది పరిస్థితులలో ఎంతో ధైర్యంతో ప్రేంచంద్ సోవియట్ ప్రజలు ఆర్థిక సాంస్కృతిక రంగాలలో తెస్తున్న గొప్ప విజయాలపట్ల ఆసక్తి చూపేవాడు. వలస దేశాధిపతులు ఆ రోజుల్లో ప్రపంచం లోని శ్రామికుల మొదటి ప్రభుత్వాన్ని, రాజ్యాన్నిగురించి జరిపే నీచ ప్రచారాన్ని కల్లబొల్లి కట్టుకథలను ఖండిస్తూ, ప్రేంచంద్ వ్యాసాలు సోవియట్‌లోని పరిణామాల ప్రాముఖ్యతను ప్రజలలో ప్రచారం చేసేవి. ఆ పరిణామాలు ఆయన రచనలలో ప్రతిఫలించాయి.

ప్రేంచంద్ జీవిత చరిత్ర, రచయితా, జర్నలిస్టు అయిన మదన్ గోపాల్ వెల్లడి చేసాడు. గ్రామీణ జీవితాన్ని చిత్రించే ముఖ్యమైన నవల "గోదాన్" వ్రాసే రోజుల్లో, ప్రేంచంద్ సోవియట్‌లోని సోషలిస్ట్ పరివర్తన గురించిన విషయాలను, వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. మన దేశరైతుల క్లిష్టసమస్యల పరిష్కా రానికై సోవియట్ లోని సమిష్టి వ్యవసాయం అనుభవంపట్ల ఎంతో ఎక్కువగా ఆయన ఆకర్షింపబడ్డాడు.

ఉర్దూలో ప్రేంచంద్ వ్రాసిన మొదటి కథల సంపుటి "సోజ్-ఎ-వతన్" బహిరంగంగా బ్రిటిష్ వలస వాదులచే తగలబెట్టబడింది. ఈ పుస్తకంలోని ప్రతి మాటా పరాయిపాలనను, నియంతృత్వాన్ని వ్యతిరేకించేదే. ఆ పుస్తకంతోపాటు ప్రేంచంద్ దేశభక్తికూడా మంటలపాలైందని ఆశించిన అధికారుల ఆశలు అడి యాసలయ్యాయి. ఈ కష్టాలు, యీ అగ్నిపరీక్షలు ఆయనను అంతవరకు ఆవ హించిన అన్ని సంస్కరణ వాద దృక్పథాలనుంచి విముక్తిచేసి, తిరుగులేని పోరా టం నడిపే విప్లవ దృకథం ఏర్పరచుకోవడానికే దారితీశాయి। పోరాటమే ఆయన జీవిత ధ్యేయంగా రూపొందింది।

"తాను పోరాడుతున్నాను అనే చైతన్యమే మానవునికి అవసరమైన మన శ్శాంతినిస్తుంది" అని ఆయన వ్రాశాడు. "పోరాడే సైనికుడు అన్న పేరుకు తగిన వాడినేనా ? ఈనాటి గీటురాయి అదే. నా జీవితం వ్యర్థమైనది అని యీనాడు నేను అనను. పోరాటం కోసమే నాకుజీవితం ప్రసాదింపబడింది. సర్వశక్తులూ అందుకే ధారపోశాను".

ఇవి చదువుతూంటే మాకు అత్యంత ప్రియమైన రచయిత, పోరాట యోధుడూ అయిన నికొలాయ్ ఆస్ట్రోవ్‌స్కీ వ్రాసిన వాక్యాలు గుర్తుకు వస్తాయి. "మానవునికి అత్యంత విలువైనది జీవితమే. అది అతనికి ఒకే ఒకసారి యివ్వ బడింది. అయ్యో, వృధాగా సంవత్సరాల తరబడి లక్ష్యం లేకుండా గడిపేశామే అనే బాధ చెందకుండా మరణించేటప్పుడు ఈ క్రిందివిధంగా చెప్పగలిగేటట్లు జీవిం చాలి. నా జీవితాన్నంతటినీ, నా శక్తినంతటినీ, ప్రపంచంలో అన్నిటికంటే విలు వైనదానికోసం, మానవజాతి విమోచనకై జరిగే పోరాటంకోసం, అంకితంచేశాను".

సోవియట్ మహాకవి మాక్సిం గోర్కీ ప్రభావం, ప్రేమ్‌చంద్ సృజనాత్మక శక్తిపై ఎంతో పడింది. "గోర్కీ పెద్ద రచయిత. దేశాల, జాతుల సరిహద్దులను దాటిపోయింది ఆయన కృషి. మన కవులు భారతీయులుగా కానీ, యూరోపియన్లు గాగాని మాత్రమే ఉండేవారు. ఆయన ఏం వ్రాసినా అదంతా అందరికోసమూ వ్రాసి నదే" అని ప్రేమ్‌చంద్ అన్నారు.

తన దేశ ప్రజలు అందరూ అక్షరాస్యులు కావాలనీ, తులసీదాస్, సూరదాస్ లను ఎలా అయితే చదవగల్గుతారో, అంతగానూ గోర్కీని కూడా చదవాలనీ ఆయన కలలు గన్నారు.

భారత, సోవియట్ ప్రజల సంస్కృతులు పరస్పరం ప్రభావితులను చేసు కోవడానికి తోడ్పడిన మహనీయుల జాబితాలో అగ్రశ్రేణిలోనున్నారు ప్రేమ్‌చంద్, మాక్సిం గోర్కీ.

ప్రేమ్‌చంద్ ఉర్దూలోనూ, హిందీలోనూ వ్రాశాడు. గోర్కీ రష్యన్‌లో, టాగోర్ బెంగాలీలో అయితే, వారు ముగ్వురూకూడా యుక్రినియన్ రైతుకూ, బెంగాలీ రైతుకూ, గుజరాతీ హస్తకళా కార్మికునికి ఒకే మోతాదులో దగ్గర వారు. జీవితంలో కవి స్థానాన్ని నిర్ణయించేది భాషగాని, కులంగాని కానేకావు.

ప్రేమ్‌చంద్ సృజనాత్మక సాంప్రదాయాలంటే సోవియట్‌లో ఎంతో ఆసక్తి వున్నది. మా ప్రజలు ఆయనను మహారచయితగా ఎరుగుదురు. వేలాదిసంఖ్యలో ఆయన రచనలు చాలా సోవియట్ భాషలలో తర్జుమా అయ్యాయి. సోవియట్ యిండాలజిస్టుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ప్రేమ్‌చంద్‌ను ప్రప్రథమంగా అధ్యయనంచేసి, సోవియట్ ప్రజల దృష్టికి ఆయన రచనలు తెచ్చిన మొదటి వ్యక్తి అకడమిషియన్ బరాన్నికోవ్.

1934 లో, ప్రేమ్‌చంద్ జీవించివున్న రోజులలోనే, బరాన్నికోవ్ 'సప్త సరోజ్' అనే ప్రేమ్‌చంద్ కథలను గురించి విమర్శనాత్మక వ్యాసం వ్రాసారు. ప్రేమ్‌చంద్‌ను చెకోవ్‌తో పోలుస్తూ ఆయన ఈ క్రింది విధంగా వ్రాసాడు. "చెకోవ్ వలెనే, ప్రేమ్‌చంద్ సాధారణ వ్యక్తులను, వారి దైనందిన పరిసరాలలో, పరిస్థితు

లలో చిత్రిస్తారు. నేటి భారతదేశంలో, ముఖ్యంగా గ్రామాలలో పాతుకుపోయిన చెడు వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు."

ప్రేంచంద్ వాస్తవికవాది (Realist) అని మొదటిసారిగా చెప్పింది బరన్నికోవ్, "ఇంతకు పూర్వం వచ్చిన భారతీయ సాహిత్యంలో ఇంత పెద్దఎత్తున వాస్తవికత పరిచయం కాలేదు."

1947 లో బెస్క్రోవ్నీ (Beskrovny) రచించిన సంగ్రహజీవిత చరిత్రలో ప్రేంచంద్ వ్రాసిన సాంఘిక నాటకం (?) "సంగ్రామ్" గురించి వ్రాసిన వ్యాసం ప్రచురితమయ్యాయి.

ప్రేంచంద్ సైద్ధాంతిక దృక్పథం రూపొందడంలో "ప్రేమాశ్రమం", "గోదాన్" అనే నవలల పాత్రను గురించి లెనిన్ గ్రాడ్ శాస్త్రవేత్త వి. బాలిన్ చక్కగా వ్రాశారు.

భారత ప్రజల చరిత్రలో స్వాతంత్ర్యంకోసం పోరాటం జరిపే ముఖ్య దశను చిత్రించే విజ్ఞాన సర్వస్వంగా ప్రేంచంద్ రచనలను గుర్తించాలని యిండాలజిస్టుల వ్యాసాలూ, థీసిస్‌లు మా ప్రజలకు విశదం చేశాయి. పరాయి పాలన కింద కృంగి, కృశించే తోటి ప్రజల విషాద గాథలను మాత్రమే ప్రేంచంద్ రాయలేదు. నిరంకుశత్వాన్ని వ్యక్తిత్వాన్ని కాలరాచే పాశవికతనూ ఆయన రచనలు మరీమరీ ఖండించాయి.

ఆయన రచనలు విరివిగా అనువాదం చేయడం ద్వారా ఆయన గురించి పరిశోధనలు జరపడానికి సిద్ధాంత పరంగా సూత్రీకరించడానికి అవసరమైన భౌతిక పరిస్థితులు సృష్టింపబడ్డాయి.

1964 లో ఇండాలజిస్టు చెలిషేవ్ వ్రాసిన "ప్రేంచంద్ – భారతీయ సాహిత్యములో అభ్యుదయ వాస్తవికతను స్థాపించిన కవి," అనే దీర్ఘమైన వ్యాసం ప్రచురింపబడింది. తన ఇతర రచనలలో చెలిషేవ్, ప్రేంచంద్ రచనలలో వాస్తవికత రొమాంటిసిజం ఏ విధంగా కలిసి మెలిసి వున్నాయో కూడ విశ్లేషించి చూపిస్తారు.

సౌందర్యం అనేది సామాన్య ప్రజల నిత్యజీవితంలోనే ప్రదర్శితమౌతుందని అభిప్రాయపడిన మొదటి భారతీయ రచయితలలో ప్రేంచంద్ ఒకరు. ఆయన రచనలలో ప్రత్యక్షమయ్యే కొత్తరకపు నాయకులు, ఎంతో క్రూరంగా అణగ ద్రొక్కబడుతున్నా, వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నిలిచి పోరాడే సామాన్య వ్యక్తుల చిత్రీకరణలో ప్రతిఫలిస్తుంది.

ప్రేంచంద్ రచనలను అధ్యయనం చేయడంలో సోవియట్ శాస్త్రవేత్తలు గణనీయమైన అనుభవాన్ని సంపాదించారని చెప్పవచ్చును. ఈ విషయమై మరింత సాఫల్యత సాధించాలంటే సోవియట్, భారతీయ సాహిత్య వేత్తలు, విమర్శకులు సమిష్టి కృషి జరపాలి.

వార్తాసంగ్రహం

ప్రేంచంద్ సాహిత్యంపై సదస్సు

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం పక్షాన హైదరాబాద్‌లో ప్రేంచంద్ శత వార్షికోత్సవాలకు ఆరంభం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో ప్రేంచంద్ సాహిత్యంపై సదస్సు ఏర్పర్చారు. శ్రీ దాశరధిరంగాచార్య అధ్యక్షత వహించారు డా॥ రాజబహుదూర్ గౌర్, డా॥భీమ్‌సేన్‌నిర్మల్, సురేష్ దత్ అవస్థి తదితరులు ప్రసంగించారు. నగరంలోని ప్రముఖ సాహిత్య వేత్తలందరూ హాజరయ్యారు.

ప్రేంచంద్ శత వార్షికోత్సవం.

అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘ స్థాపక అధ్యక్షుడు, ప్రముఖ హిందీ రచయిత కీ శే. ప్రేంచంద్ శత జన్మదినోత్సవ సందర్భంగా, ఖుర్దా రోడ్‌లోని సాహితీ సంస్థ "కవిత" ఒక సాహితీ సమావేశం ఏర్పాటు చేసింది.

కవిత ఉపాధ్యక్షులు శ్రీ ఏ.భగవతి రావు సమావేశ ప్రారంభంలో ప్రేంచంద్‌ను శ్రోతలకు పరిచయంచేశారు.

శ్రీరామ తీర్థ "ప్రతిజ్ఞ" నవలపై ప్రత్యేక సమీక్ష వ్యాసం చదివి వినిపించారు.

శ్రీ విజయచంద్ర "ప్రేంచంద్ సాహిత్యం, జీవితం, హిందీ సాహిత్యంలో వాస్తవిక యుగావతరణ" అనే అంశంపై ఉపన్యాస సమీక్ష చేశారు.

సంస్థ అధ్యక్షులు శ్రీ ఆనందరావు మలిపలుకులతో సమావేశం ముగిసింది.

కాకినాడలో కవిసమ్మేళనం

అభ్యుదయ రచయితల సంఘం, కాకినాడ శాఖఆధ్వర్యాన, ఆగస్ట్ 15న "దేశమా!-ఎటు?" అనే అంశంమీద కవి సమ్మేళనం జరిగింది.

శ్రీ K. V. కొండలరావు అతిధిగా విచ్చేసిన ఈ కవి సమ్మేళనానికి డా॥ ఆయారి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు డా॥ మిరియాల రామకృష్ణ, ఎ. సోమసుందర్, ఇజ్జాడ వెంకట్రావు, శ్రీమతి డా॥ పి. చిరంజీవినీ కుమారి కవితాగానం చేశారు.

తర్వాత, "యువత" నిర్వహించిన మినీ కవితల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది.

తుమ్మలకు సన్మానం.

U.S.S.R., G.D.R. దేశాలలో రెండు నెలలపాటు పర్యటించి వచ్చిన ప్రముఖ రచయిత, ఆంప్ర అరసం అధ్యక్ష వర్గ సభ్యులు శ్రీ తుమ్మల వెంకట్రామయ్యకు 'విశాలాంధ్ర' కార్యాలయంలో సన్మానం జరిగింది.

సన్మాన సభకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు శ్రీ దాసరి అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు కాటగడ్డ గంగయ్య, పొన్నం వీరరాఘవయ్య సి. రాఘవాచారి శ్రీ తుమ్మల పర్యటన జయప్రదంగా ముగించుకు వచ్చినందుకు అభినందించారు.

డా॥ సి. నారాయణరెడ్డి విదేశీపర్యటన

సోవియట్ భారత మిత్రమండలి ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఆం.ప్ర. అ. ర. సం. అధ్యక్ష వర్గ సభ్యులు డా॥ సి. నారాయణరెడ్డి ఇస్కస్ ప్రతినిధిగా సోవియట్ సందర్శించటానికి వెళ్ళారు.

బరంపురంలో గ్రంధావిష్కరణ.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షులూ, ప్రముఖ రచయిత అనువాదకులూ, డా॥వుప్పల లక్ష్మణరావు జర్మన్ పండితుడు వాల్టర్ రూబెన్ రచన "ప్రాచీన భారత దేశంలో బానిసల స్థితిగతులు" అనే గ్రంధానికి చేసిన అనువాదాన్ని, ఆగస్ట్ 14న బరంపురంలో శ్రీ ఏటుకూరి బలరామమూర్తి ఆవిష్కరించారు.

డా॥ కోశా సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించారు.

వికాసం కార్యదర్శి శ్రీ బి. నరసింహస్వామి వందన సమర్పణ చేశారు

లహరి ఆవిష్కరణ సభ.

తాడేపల్లి గూడెం యువ అభ్యుదయ రచయితలు ప్రారంభించిన లిఖిత సాహిత్య మాస పత్రికను, ఆగస్టు 15న గవర్నమెంటు కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ ఇ. వి నరసింహమూర్తి ఆవిష్కరించారు.

కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు పత్రికకు తమ పూర్తి సహకారాన్ని ప్రకటించి ఎంతో ప్రోత్సహించారు.

పత్రిక సంపాదకుడు శ్రీ పి. పూర్ణారావు వందన సమర్పణతో సభ ముగిసింది.

స్వాతంత్ర్యోత్సవసందర్భంగా గోష్ఠి

"32 సంవత్సరాల స్వాతంత్ర్యంలో మనం ఎక్కడున్నాం" అనే అంశంపై ఖమ్మారోడ్ సాహితీసంస్థ "కవిత" ఆధ్వర్యంలో ఒక గోష్ఠి జరిగింది.

గోష్ఠిని సంస్థ కార్యదర్శి శ్రీ హనుమంతరావు ప్రారంభించారు.

శ్రీ విజయచంద్ర, స్వాతంత్ర్యానంతర స్థితిని ఆర్థిక సామాజిక దృక్కోణంనుండి సమీక్షించారు.

గంగాధరం స్మారక భవన నిర్మాణం

సుప్రసిద్ధ జానపద సాహితీవేత్త నేదునూరి గంగాధరం స్మారక భవన నిర్మాణానికి ప్రారంభ సూచకంగా గత నెల 30న రాజమండ్రిలో సినీనటి శ్రీమతి జమున ఫలకాన్ని ఆవిష్కరించారు. శ్రీ దుర్గా వెంకటరమణారావు కళ్యాణ మండపంలో జరిగిన ఈ సభలో శ్రీ దుర్గా వెంకటరమణారావు, శ్రీ పి. బి.

వీరాచారి, శ్రీ సన్నిధానం నరసింహ శర్మ, శ్రీ సహదేవ సూర్య ప్రకాశరావు, శ్రీ యస్. వి, రమణారావు, శ్రీరామహా ప్రభృతులు ప్రసంగించారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ శతజయంత్యుత్సవ కమిటీ ఏర్పాటు

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ శత జయంతి ఉత్సవాలు, కావలిలో సెప్టెంబరు 8, 9 తేదీలలో జరపడానికి ఈ నెల 10 న పట్టణంలోని మేధావుల సమావేశంలో ఒక కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీకి జవహరు భారతి లెక్చరర్ శ్రీ యస్. వి. రమణయ్య కన్వీనరుగా పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ బి యల్ నారాయణ కోశాధికారిగా ఎన్నుకోబడ్డారు

జాషువా విగ్రహ ప్రతిష్ఠాపన నిర్ణయం

గుఱ్ఱం జాషువా కవి 85 వ జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా తోట్లవల్లూరు హరిజనవాడలో వచ్చేనెల 28 వ తేదీన జాషువాకవి శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించాలని విగ్రహ ప్రతిష్ఠాపాలన సంఘం నిర్ణయించింది.

"నా హృదయం" - ఆవిష్కరణ

ప్రముఖ కవి, పాత్రికేయుడూ, విద్వాన్ విశ్వం రచన "నాహృదయం" ప్రముఖ వాణిజ్యవేత్త శ్రీ పి. వి. రమణయ్య రాజాకు అంకితం సభ ఈ మధ్యన హైదరాబాదు, హోటల్ సరోవర్‌లో జరిగింది.

సభలో డా॥ దాశరధి ప్రొ॥ కొత్తపల్లి వీరభద్రరావు, ఇచ్ఛాపురపు జగన్నాధరావు తదితరులు ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చల్లా కొండయ్య సభకు అధ్యక్షత వహించారు.

మహాకవి శ్రీశ్రీ 70వ పుట్టినరోజు పండుగ

మహాకవి శ్రీశ్రీ 1980 జనవరి 2వ తేదీకి 70 ఏళ్ళు నిండుతాయి. ఈ సందర్భంగా 1980 మార్చి రెండవ తేదీన కాకినాడలో సభ జరపడానికి తాత్కాలిక కార్యవర్గం (అడ్ హాక్ కమిటీ) ఏర్పడింది. ఈ కమిటీ కింది నిర్ణయాలు తీసుకుంది; (1) డా. మిరియాల రామకృష్ణ గారి "శ్రీశ్రీ కవిత్వం" థీసిస్ను ముద్రించి ఆ నాడు ఆవిష్కరించడం, (2) శ్రీశ్రీ 70వ జన్మదినోత్సవాన్ని జరిపి, ఆయన్ను సత్కరించడం, (3) ప్రత్యేక సంచికను రూపొందించి ఆవిష్కరించడం.

కమిటీకి కార్యదర్శులుగా డాక్టర్ పి. చిరంజీవినీ కుమారి; శ్రీ అవంత్స సోమసుందర్‌లు వ్యవహరిస్తారు. డాక్టర్ ఆటూరి విజయలక్ష్మి కోశాధికారిగా ఉంటారు. వివరాలకు శ్రీమతి పి. చిరంజీవినీ కుమారి, ప్రతాప్‌నగర్, కాకినాడ 4 - అనే చిరునామాకు రాయాలి.

మహా నాటకంపై సదస్సు

విజయసాహితి ఆధ్వర్యంలో, విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మహా నాటకంపై సదస్సు జరిగింది.

అం.ప్ర.అ ర.సం. రాష్ట్ర సమితి సభ్యులు శ్రీ మైత్రేయ డా. కొర్రపాటి గంగాధరరావులు ప్రసంగించారు.

సమీక్ష వల్లకాటి వసంతం (కవితా స్రవంతి)

రచన. శంకర్, అన్నమరెడ్డి. వెల. అయిదు రూపాయలు

లక్ష్మీ ప్రచురణలు, మద్రాసు-24

ప్రతులకు : రాణీబుక్ సెంటర్, పాండీ బజార్, మద్రాసు-600017.

ప్రేమ కవిత్వం రాయటం నేరంకాదు. కేవలం సామాజిక దృష్టితో చూచి దాన్ని కొట్టి పారవేయటమూ భావ్యంకాదు. కాని వ్యక్తిగత ప్రేమను కవిత్వంగా అందరి ఎదుటికి పంపేటప్పుడు కొన్ని బాధ్యతల్ని విస్మరించలేము. సాహిత్యానికి సామాజిక స్పృహ కన్నుగా ఏర్పడ్డ ఈ కాలంలో కలం పట్టేవాడు "ఏదిముందు" (Priyority) అనే ప్రశ్న వేసుకోక తప్పదు. "కానీయండి చూద్దాం!" అని ప్రోత్సాహ వచనాలు పలికిన శ్రీ ఆరుద్ర "ఇది భావ కవిత్వానికి పునః పలాయనమా? లేక-యువక హృదయాలలో చరిత్ర పునరావృతమా? ఇవి విదానించవలసిన చిహ్నాలు" అని అన్నారు.

శ్రీ శంకర్ అన్నమరెడ్డి రాసిన 'వల్లకాటి వసంతం' 51 పేజీల "కవితా స్రవంతి." ఇందులో అప్రాప్త ప్రేయసిని గూర్చి కవి భగ్నహృదయ శకలాలున్నాయి. వారి ప్రేమ "ముక్కుమూల్గే సమాజపు రీతికి గొడ్డలిపెట్టు." ఆమె అతనికిచ్చిన శక్తితో "ఈ సమాజాన్ని గెలిచేందుకై" ప్రయత్నిస్తాడు. కాని చిత్రం! వారి ప్రేమ ఫలించదు. కారణం. సమాజంకాదు. ఆమె అతణ్ని మోసగిస్తుంది. కవి ఆమెను "మోసాల పుట్ట"గా వర్ణిస్తూ ఉపాలంబిస్తాడు. ఆ మోసానికి కూడ కారణం ఊహిస్తాడు.

"ఏ కలిమి కాదందో
ఏ బలిమి వద్దందో నేడు
నా చెలిమి వలదన్నావు" అంటాడు.

అంతరాలేవో అడ్డుపడివారి ప్రేమను విఫలం చేశాయి. "నాలుగు మాటలు" రాసిన కొసరాజుగారి మాటల్లో "నిరాశ, నిస్పృహ, నిట్టూర్పు, ఉద్రేకం, ఉల్లాసం అన్నీ కలబోసి కవిత్వంగా దిద్దుకున్నారు" కవి. "వేదన ఈ కవికి సాధన" అని శ్రీ దాశరధి కొన్నిమంచి మాటలు చెప్పారు. ఈ కవిలో నిజాయితి ఉంది. అమాయకంగా చెప్పుకపోతాడు. గుండెను పట్టి ఊపే లైన్లు కనిపించవు. ఊహలు కూడా చాలా పేలవంగా ఉన్నాయి. కవిత్వంగా ప్రాథమికదశలో ఉన్న పుస్తకమిది. గంగాధర్ వేసిన ముఖచిత్రం, ఆయనే లోపల వేసిన

చిత్రాలూ బాపు బొమ్మలకు అలవాటు పడిన కళ్ళకు కొత్తగా ఉన్నాయి.

—ఎస్వీపీ.

అగ్గిఈటెలు:
భూపాల్ పాటలు

ప్రతులకు : దేశీ బుక్ హౌస్,
నారాయణగూడా హైదాబాద్.
సృజన, హన్మకొండ.

కాలుతూ, కాలుస్తున్న ఈ దశాబ్దం వేదికి కవిత్వం కరిగి పాటలరూపమై ప్రవహిస్తోన్న కాలంలో 'భూపాల్ పాటలు' అగ్గిపాటల రూపమెత్తాయి.

కవిత్వం అందరూ రాయలేరు. అందులో పాటలు రాసేవారు మరీ తక్కువ ఆ పాటల్లో ప్రజల పాటలు రాసే వాళ్ళు వేళ్ళమీదే ఉన్నారు. ఉన్నవారిలో సఫలులైన కొద్దిమందిలో భూపాల్ ఒకరు.

ఈ మధ్య పాటలు మూడు రకాలుగా వస్తున్నాయి : ప్రజల గుండెల్లో పరుగు దీసే పాటలు, ప్రజల నోట్లో గున్‌గునాయించుకునే పాటలు, ప్రజల కోసం రాయబడినా పత్రికల పేజీల్లోనో, పేజీల పైనో సంసారం చలాయిస్తున్న పాటలు ఇందులోనే చాలా వరకు అంతర్జాతీయ జాతీయ రాజకీయాలు ముడిపెట్టిన,పాటల ప్రయోజనాన్ని బాహటంగా ఖూనీచేసేవి కూడా ఉన్నాయి.

భూపాల్ పాటల్లో మొదటిరకం పాటలే ఎక్కువగా ఉన్నాయనడాకి ప్రజలే సాక్ష్యం. రెండోరకం పాటలు కూడా కొన్ని ఉన్నాయి ఇందులో.

పాట పాడేటప్పుడు ఎన్నో మెలికలు తిరుగుతుంది. సంగీత వాద్యాల ప్రభావం స్వరం ఎత్తుగడలు, ఉచ్చారణా వీటిని మౌలికంగా విన్నప్పుడే అనుభూతిచెందగలం. కాగితం మీద పాటలు చదివి 'విలువ' గట్టటం సరైన పద్ధతికాదు.అందుకే పాటలను ఈ దృష్టితో చూడాలి.

స్వరాల హెచ్చు తగ్గులు పాటకు 'గాంభీర్యత' నిస్తాయి. పైగా పాటలు సామూహికంగా పాడుకునేప్పుడు పాటల్లోని "Silent stress" కూడా ఎంతో శక్తివంతంగా ఉంటుంది.

పాటలు రాయడానికి కవికి ప్రజల భాష, ఉచ్చారణ, పసగలిగిన పలుకుబళ్లు, ఆకట్టుకునే భావవ్యక్తీకరణపద్ధతి, పసునైన పద చిత్రాలు, ప్రజల గుండెల్లో జలజల పారే బాణీలు, ముఖ్యంగా ప్రజల జీవితం బాగా తెలిసీ ఉండాలి. ఈ లక్షణాలన్నీ ఉన్నపాట "మూసీనది". ఇది పరిశోధన లాంటిది. మూసీనది చుట్టుపక్కల బతికే బెస్తల, కాపోళ్ల, సాకలోళ్ళ, తోటకూలీల, సేట్లకింది గులాపోళ్ళ బతుకులు మూసీ చుట్టూ పేదరికంతో ఎలా అల్లుకుపోయిందో - దొరల జులుంను ఎలా ప్రతిఘటించాలో చక్కగా వివరిస్తుంది.

ఈ పాట "ఓర్నాయనో" అన్న జంటవంతలతో పాడే పెద్దపాట. అందులోని కాపు కూలీ స్త్రీ వర్ణన :

సీతళరల కాపుతల్లిరా ఓర్నాయనో
ఏటివడ్డు అద్దెకురంతో ,,
రెట్టిరుగా గడ్డికోసిరా ,,
మెడలిరుగ గడ్డిమోసిరా ,,
గుండెదాట ఏట్లమునిగిరా ,,
ఏటాకు యేరి కొట్టిరా ,,
పేగుల్ని పెటపెటమాడ్చె....,,
సినిగిపోయిన సీరలుగట్టి....,,

ప్రజల నాడి తెలిసినవాడు కాబట్టే "సీతక(చె)రల కాపుతల్లి" అనగలిగాడు. కూలీలను వర్ణిస్తూ-"రైకగొంటె అప్పు జేతురా" అంటాడు. మానాన్ని కాపాడు కోడానిక్కూడా అప్పుచెయ్యాలి ఇంత కష్టపడీ.

ఇలాంటిదే మరో పాట "గొల్ల, కుర్మ గోత్రం". గొల్లల జీవితాల్లోని కష్టాలు కళ్ళనీళ్ళు తెప్పించే విధంగా ఉన్నాయి. దొరల పీక్కుదినడానికి వేగలేక" గొల్ల కుర్మ గోత్రమింక గొడ్డలికే శాస్త్ర మాయె" అని తీర్పు చెప్పుకుంటారు.

ఇకపోతే "దానొన్నట్ల మన్నువొయ్య" "అన్ని నరికి నల్లొండ" పాటలు Spontenious singing tunes అని చెప్పొచ్చు. ఈ రెండు పాటలు గొంతు వరకు అన్యాయం చేయబడి సర్వబాధలు అనుభవిస్తున్న పేదకూలీ స్త్రీ గుండె లోంచి అమాంతంగా వెలువడ్డ పదునైన నిరసనలు.

"దానొన్నట్ల మన్నువొయ్య దానిపాడె ఇపుడెగట్ట కనగంటె సైసదమ్మ కలవారి రుక్మిణమ్మ" కాగంత కడుపు పెంచి కానొక్క అన్యాప్పుని చేసి కూలీ స్త్రీల కడుపుగొట్టే రాకాసి ముండను," తాడో పేడో తేల్చా నడవాలి మనం అంతా.." అన్న జనశ్రుతులతో వారి కళ్ళు తెరిపించడంలో చేయూతనిస్తుందిపాట.

పాటను ముగించడంలో భూపాల్ ది కొత్త టెక్నిక్. మొదటిపాటలో "కదులాలనే-మనమూ కత్తూలమయ్యీ" మరో పాటలో కనిదీర్పుకుంటాము కదులు తాయ కొడవలిలా. "కొడవళ్ళ కదలిక వంటో పల్లెజనానికి బాగా తెలుసు. గొల్ల కుర్మ గోత్రమింక గొడ్డలికే శాస్త్ర మాయె...." ముగింపు వ్యామోహంవల్ల పాటకు పద్నాలుగు తులాల ముట్టెలబరువు కట్టాడు పల్లె పడతుల సర్వసామాన్య అలంకారాల వలెనే పాటల్ని తీర్చిదిద్దు తాడు. వారి గుండెల మంటల్లాగే పాటల అక్షరనరాల్లో వెచ్చని అర్థం రక్తం పరుగుతీస్తుంటుంది.

అనవసరమైన మాండలిక పదాల రాద్ధాంతం లేదుగాని "అన్ని నరికి నల్లొండ" లాంటి చోట్ల వివరణలు ఇస్తే బాగుండేది (నల్ల = రక్తంతో చేసే పదార్థం) + వండ(తయారుచేయడం)అందులోనే సన్నియ్య = చన్ను + ఇయ్య లాంటివి. ఇకపోతే 28 పేజీలో" తన ఆకిలూ కెసాయి"కి అర్థం బోధపడదు. 46 పేజీలో "అశ్రుఒక్కొక్కటి అందించి వస్తావ" అన్న చోట పదాల కూర్పు పొందికగా లేదు.

36 పేజీలో "పొలం మీది చిన్న పెద్దలు" అన్నదగ్గర పొలం బదులు చెలక, 38 పేజీలో "సినిగిపోయిన సీరలు గట్టి" అన్నదగ్గర "పేల్కలు గట్టి" అని ఉంటే ఇంకా బలంగాఉండేది

నిర్మల పాటలో "సిక్కోలు కొండల్లో సినబాబు అటలా నీ కాలగజ్జలా ధ్వని మేలుకొల్పులో నిద్రలేచినపేద.." విప్లవ సోదరి కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటుందన్నది ఊహాజనితం. భూపాల్ పాటల్లో వాస్తవ విరుద్ధం.

జనామంలో గద్దర్ పక్కన పనిచేసే అనుభవంతోకాక - సొంతం చేసుకునే రీతిలో రాయగలగాలి. అతనా పనిలోనే ఉన్నాడని ఆశిద్దాం!

-జయధీర్ తిరుమలరావు

Edited, Printed and Published by T. Venkataramaiah, 3-6-737/3, Himayatnagar, Hyd-29
Printed at Nagarjuna Printing Works.